ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


22-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 80 పేజీలు: 12 వెల: 6.50



అమెరికాను దెబ్బతీస్తే సహించను: ట్రంప్

రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్

5లో


శక్తివంతమైన జాతిగా మన తెలుగుజాతిని నిలుపుదాం

ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్ఎంఇ పాలసీలను ప్రకటించాం

- సిఎం చంద్రబాబు

# ప్రపంచ ఆవిష్కరణలకు వేదికగా ఎపి

**విజయవాడ, ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఆవిష్కరణలకు, అవకాశాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నదే తన తపన అని, థింక్ గ్లోబల్లీయాక్ట్ - గ్లోబల్లీ విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగు ప్రజల రక్తంలోనే ఉందన్నారు. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయిచేయి కలుపుదామని తనతో పాటు, అందరూ ఇందులో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు తన కుటుంబసభ్యులతో కలిసి యూరప్‌దేశాల పర్యటనకు వెళ్లారు.ఆయన నిన్న యూరప్ పర్యనట్లో అంతర్భాగంగా అక్కడే కుటుంబసభ్యులతో కలిసి తన పుట్టిన రోజు జరుపుకున్నారు.ఆయనకు రాష్ట్రీయంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభినందనలు లభించాయి.వారందరికి సిఎం చంద్రబాబు సామాజిక మాధ్యమాల ద్వారా ధన్యవాదాలు తెలిపారు.నేటి అర్ధరాత్రి తరువాత యూరప్ పర్యటన ముగించుకుని ఆయన ఢిల్లీ చేరుకుంటున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన టిడిపి కార్యకర్తలకు,ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మనమంతా తిరుగులేని విజయాలు సాధించాలన్నారు. పేదరికం లేని సమాజం స్థాపించాలనేదే తన సంకల్పమని అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రతి సంపన్న వ్యక్తి పేదవాడి శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూ టలన కోసం పీ4 తెచ్చామని చెప్పారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 2047నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగు జాతిని నిలపాలన్నదే తన అభిలాష అన్నారు. అందరికీ అవకాశాలు కల్పించేలా, ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసానిచ్చేలా పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. అందరీ ఆదరాభిమానాలు, నమ్మకం తనలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయన్నారు. ప్రజల భవిష్యత్ కలలు, ఆకాంక్షల సాకారానికి నిరంతరం కష్టపడి పనిచేస్తానని మాటిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, తెలుగు ప్రజల అభ్యున్నతికి పునరంకితం అవుతానన్నారు. స్వర్ణాంధ్ర2047 విజన్‌ను >>2



# పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

## దీర్ఘకాలిక అస్వస్థతతో సుదీర్ఘ పోరాటం

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** ప్రపంచ క్రైస్తవుల ఆరాధ్యదైవం పోప్ ఫ్రాన్సిస్ తుదిశ్వాస విడిచారని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ తన జీవితమంతా చర్చి సేవకు అంకితమయ్యారని వెల్లడించాయి. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన ఆయన, 2013లో 266వ పోప్‌గా నియమితులయ్యారు. లాటిన్ అమెరికా దేశాల నుంచి పోప్‌గా నియమితులైన తొలి వ్యక్తిగా ఆయన నిలిచారు. పోప్ ఫ్రాన్సిస్ పేదల పట్ల ఎంతో దయతో ఉండేవారు. ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించేవారు, వాతావరణ మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేసేవారు. చిన్నప్పుడే ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించిన ఆయన తరచూ అస్వస్థతకు లోనవుతున్నారు. వాస్తవానికి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఫ్రాన్సిస్ యువకుడిగా ఉన్నప్పుడే ఆయన ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించారు. 2025 ఫిబ్రవరిలో ఆయన శ్వాసకోశ సమస్యలతో జెమెల్లి ఆసుపత్రిలో చేరారు. అది డబుల్ న్యుమోనియాగా మారింది. ఆయన 38 రోజులపాటు ఆసుపత్రిలోనే ఉండి, తరువాత కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. అయితే తన అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం, పోప్ ఫ్రాన్సిస్ సెయింట్ మేరీ మేజర్ బాసిలికాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ ఏప్రిల్ 20న ఆయన ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులకు సందేశం కూడా ఇచ్చారు. కాగా ఇప్పుడు 88 ఏళ్ల వయస్సులో ఆయన మరణించారు.పోప్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా చాలా రోజు తర్వాత ఆయన ప్రజల్లోకి వచ్చారు. దాదాపు నెల రోజుల పాటు ఆసుపత్రి చికిత్స తర్వాత పోప్ మార్చి 24న తన నివాసం కాసా శాంటా మార్టాకు తిరిగి వచ్చారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన తరువాత తనను చూడాటానికి వచ్చిన ప్రజలకు కూడా ఆయన ఆశీర్వాదం >>2

# జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదలీ

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్21:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదలీ జరిగింది. సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగాఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు >>2

# ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

## వైద్య, ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ధరణి మాత ఆరోగ్య రక్షణ మనందరి సమష్టి బాధ్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టు చేసారు.మానవాళి సుఖజీవనాభిలాష నానాటికీ పెరుగుతుండటంతో తత్పర్యవసానంగా నిరంతర దాడులకు గురవుతుందన్నారు. దాంతో సమతుల్యం కోల్పోతూ అను నిత్యం ఆరోగ్య క్షీణతకు గురవుతున్న పుడమి తల్లి మౌనంగా రోదిస్తోంది. మానవాళితో పాటు లక్షలాది రకాల జంతువులు, పక్షులు, మొక్కలకు ఆశ్రయమిచ్చే ధరణి మాత బలహీనమవుతూ బేలగా మారుతోంది. ఎల్లలు లేని గనుల తవ్వకాలు, కనుమరుగవుతున్న పచ్చదనం, మాయమవుతున్న జీవ వైవిధ్యం, అడుగంటుతున్న భూగర్భ జలాలు, కలుషితమవుతున్న నదీ జలాలు, పెరిగిపోతున్న ఎడారీకరణ, విజృంభిస్తున్న వాయు కాలుష్యం, అతివేగంగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో కబళించడానికి సిద్ధమవుతున్న సముద్ర జలాలు వంటి సమస్యలు ధరణి మాత ఉనికికి, తద్వారా మానవాళి మనుగడకు పెను సవాళ్లుగా మారుతున్నాయి. ఈ సమస్యల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని కల్పించి, సమిష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ ద్వారా భూ మాతను మరియు >>2



# తొలిసారి లక్షదాటిన బంగారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** బులియన్ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. సోమవారం బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల మేలిమి బంగారం పన్నులతో కలిపి లక్షరూపాయలకు చేరింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్యయుద్ధం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారంవైపే ఎక్కువ ఆసక్తిచూపుతున్నారు. ఈక్రమంలో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారంధరలు సోమవారం 3405 డాలర్లుపలికింది. ఈ ధరల క్రమాన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును చేరింది. >>2



సోమవారం న్యూఢిల్లీలో అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

# ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 500 బిలియన్ డాలర్లు

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో ప్రధానిమోడీ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సహకారంలో అన్ని కీలకరంగాల్లో నమోదయిన ప్రగతిని ఈసందర్భంగా ఇరువురునేతలు సమీక్షించారు. అమెరికా భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి మేలుచేసేవిధంగా చర్చలుజరిగాయని అనంతరం ప్రకటించారు. రెండుదేశాల ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించే చర్చలు కూడా చోటు చేసుకున్నట్లు తెలియవచ్చింది. ప్రధానిగా ఇంధన రంగం, రక్షణ, వ్యూహాత్మక అధునాతన టెక్నాలజీలు ఇతర కీలక రంగాల్లో రెండుదేశాల పరస్పర సహకారం, వాణిజ్యం అంశాలే వీరిమధ్య చర్చకు వచ్చాయని తర్వాత అధికారిక >>2

# అనంతబాబు డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 21(ప్రభాతవార్త) :** వీధి సుబ్రహ్మణ్యం కేసులు సిట్‌కు అప్పగించి సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని విశ్రాంత డిజిపి ఎబి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్సీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసు వివరాలు తెలుసుకునేందుకు ఆయన కాకినాడ జిల్లాకు విచ్చేశారు. సోమవారం ఉదయం పెదపూడి మండలం జి మామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి >>2

# ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రుల బృందం

**విజయవాడ, ఏప్రిల్21, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడి మే 2నఅమరావతి రాజధాని పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని జలవనరుల శాఖ రైతు శిక్షణా కేంద్రంలో మంత్రుల బృందం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించింది. ఈసందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ముఖ్యంగా ఆహారం, తాగునీరు వంటి వసతుల కల్పనలో ఎంత మాత్రం రాజీ పడరాదని అధికారులకు స్పష్టం చేశారు.

ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులను మెరుగుపరచాలని మంత్రి కేశవ్ అధికారులకు స్పష్టం చేశారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని పర్యటన రోజు ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని పోలీస్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.ప్రధాని సభకు వచ్చే సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వరకూ చాలా గ్రామీణ రహదారులై ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. >>2

# రేపు పదవ తరగతి పరీక్ష ఫలితాలు

**విజయివాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ 23వ తేదీన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్ (మన మిత్ర), లీప్ యాప్‌లలో ఫలితాలు చూసుకోవచ్చని వివరించారు. మార్చి 2025, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్ సైట్లు,'మన మిత్ర' (వాట్సాప్), ఎల్ఇఎపి మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఇక అభ్యర్థులు ఫలితాలను వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని..వారి రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా వారి ఫలితాల పిడిఎఫ్ కాపీని పొందవచ్చు. అలానే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఎల్ఇఎపి మొబైల్ యాప్ ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కలిగించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ >>2

# హైకోర్టులో వంశీకి మళ్లీ చుక్కెదురు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** భూ కబ్జా కేసుకు సంబంధించి వైఎస్సార్సీ నాయకుడు,మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీకి హైకోర్టులో చుక్కెదురయింది. ఈ కేసులో ఆయన దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వంనుంచి ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారం పాటు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి.

# 'సిట్' అదుపులో కసిరెడ్డి



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డిని (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) సిట్ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు, విజయవాడ తీసుకువస్తున్నారు. ఇప్పటికే సిట్ విచారణకు హాజరవుతున్నట్లు రాజ్ కసిరెడ్డి ఆడియో విడుదల చేసారు. విచారణకు హాజరవుతున్నట్లు సిట్ అధికారులకు రాజ్ కసిరెడ్డి సమాచారం ఇచ్చారు. రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది.

**మంగళవారం ఉదయం సిట్ విచారణకు:**

ఎపి మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా పోలీసులకు ఆచూకీ తెలియకుండా ఆయన తిరుగుతున్నారు. తాజాగా ఇవ్వాళ మధ్యహ్నం కసిరెడ్డి మరో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సిట్ విచారణకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. >>2

# జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## 8 మంది మావోయిస్టుల హతం

## మృతుల్లో మావోయిస్టు అగ్రనేత వివేక్



మరణించిన వివేక్ (ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** మావోయిస్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఓవైపు ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర బలగాలు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముప్పేట కట్టడి చేస్తున్న తరుణంలో జార్ఖండ్‌లోని బొకారోలో సోమవారం ఉదయం నక్సల్స్ స్థావరంపై సిఆర్‌పిఎఫ్ బలగాలు జరిపిన దాడిలో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించారు. మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైన ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ సహా ముగ్గురు వున్నట్లు జార్ఖండ్ డిజిపి అనురాగ్ గుప్తా మీడియాకు తెలిపారు. జార్ఖండ్‌లోని బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని లుగు పర్వతాల వద్దగల అటవీ ప్రాంతంలో నక్సలైట్ల >>2



రాజస్థాన్‌లోని బికనీర్‌లో సోమవారం బెంగాల్ అల్లర్లకు నిరసనగా విహెచ్‌పి కార్యకర్తలు ప్రదర్శన చేస్తున్న దృశ్యం

## మా పాలసీలు వెయ్యేళ్ల
# భవిష్యత్తుకు ప్రణాళికలు
## సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21:** తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తాము తీసుకుంటున్న నిర్ణయాలు.. దేశ భవిష్యత్తును మరో వెయ్యేళ్ల పాటు తీర్చిదిద్దనున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 17వ సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్‌లో ఆశావాహ సమాజం ఆశయాలు.. అసాధారణ రీతికి చేరుకుంటున్నాయని, ఆ కలల్ని నిజం చేసేందుకు అమితమైన వేగంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. సమగ్ర దేశాభివృద్ధి ముఖ్యమని, ప్రతి గ్రామం.. ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడిని వదలకుండా అభివృద్ధి సాగాలన్నారు. ప్రభుత్వ స్కీములు ప్రజలకు చేరిన తీరును బట్టి.. పరిపాలనా నాణ్యత తెలుస్తుందన్నారు. ప్రజలకు అన్ని స్కీములు చేరితే అప్పుడు ఆ ప్రభావం గ్రౌండ్ స్థాయి నుంచి మారుతుందన్నారు. గత పదేళ్లలో భారత్ అసాధారణ రీతిలో మార్పులను చవిచూసిందన్నారు. పరిపాలన, పారదర్శకత, ఆవిష్కరణ అంశాల్లో భారత్ కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. ఇది టెక్నాలజీ యుగమని, అయితే వ్యవస్థలను సమర్థవంతంగా మేనేజ్ చేయడమే పరిపాలన అని ప్రధాని తెలిపారు. భారతదేశ సమగ్ర అభివృద్ధి అంటే ఏ గ్రామం, ఏ కుటుంబం, చివరికి ఏ పౌరుడు కూడా వెనుకబడి ఉండకూడదు అని మోదీ పేర్కొన్నారు.మన బ్యూరోక్రసీ, విధాన రూపకల్పన అవుట్‌డేటెట్ వ్యవస్థల ఆధారంగా పనిచేయదు. అందుకే ఈ రోజు మా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు రానున్న 1000 సంవత్సరాల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తాయని మోడీ అన్నారు. భారతదేశంలో యువత, రైతులు, మహిళలు, వారి కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి, అసాధారణమైన వేగం చాలా అవసరం అని ప్రధాని అన్నారు. ప్రభుత్వ పథకాలు ఎంతగా ప్రజలకు అందుతున్నాయో, క్షేత్రస్థాయిలో వాటి నిజమైన ప్రభావం ఎంత ఉందో అన్నదానిని బట్టి, పాలనలో నాణ్యత తెలుస్తుంది. గత పదేళ్లలో భారతదేశం క్రమానుగతంగా పెరుగుతున్న మార్పును దాటి, ప్రభావవంతమైన పరివర్తనను చూసింది.

# డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

>> బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సహాయం గూర్చి చర్చించారు. జిల్లా ఎస్పీని కలిసి కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్.పి,ఇన్చార్జి, డి.ఎస్.పి రెగ్యులర్ డి.ఎస్.పి,మరియు టూ టౌన్, సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సక్రమంగా కేసు విచారణ చేయిపట్టలేదని అప్పటి ఛార్జ్ సీటు చూస్తే తేటతెల్లమైందన్నారు. ఈ కేసును సిట్ కప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించి అరెస్టు చెయ్యాలన్నారు. నిరక్ష ్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వీధి సత్యనారాయణ, వీధి నూకరత్నం,తమ్ముడు వీధి నవీన్ కుమార్, ఆర్పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కడలి సత్యమూర్తి, కడలి కిషోర్, కోడి కత్తి శీను తదితరులు పాల్గొన్నారు.

# 500 బిలియన్ డాలర్లు

>> ప్రకటన వెలువరించారు. జాతీయ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అంశాలు కూడా వీరిమధ్య చర్చకు వచ్చాయి. చర్చల్లోభాగంగానే ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ భారతపర్యటనకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. గతంలో 2013లో జోబైడెన్ ఉపాధ్యక్షుడుగా ఉన్న కాలంలో మాత్రమే అమెరికా ఉపాధ్యక్షుల పర్యటన జరిగింది. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత ఉపాధ్యక్ష హోదాలో జెడివాన్స్ భారత్ తొలిపర్యటనగా చెప్పువచ్చు. 2030 నాటికి రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన జెడివాన్స్ దంపతులకు ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టులోనే గౌరవవందనం స్వీకరించిన తర్వాత అక్కడినుంచి బయలుదేరి న్యూఢిల్లీలోనే ఉన్న స్వామినారాయణ్ మందిరాన్ని సందర్శించారు. భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా వారసత్వ సంపదకు చిహ్నంగా అక్షరధామ్ ఆలయాన్ని నిర్మించారని వాన్స్ వ్యాఖ్యానించారు. ఆలయ ప్రాంగణంలో పొందుపరిచిన సామరస్యం కుటుంబ విలువలు కాలాతీత జ్ఞానం వంటి సందేశాలను చూసిన వాన్స్ ఉషావాన్స్ నిర్మాణ నైపుణ్యాన్ని అభినందించారు. ఈ పర్యటన అమెరికా, భారత్‌లమధ్య ఉన్న సంబంధాలను బలోపేతంచేయడానికి కొనసాగుతున్న విశ్వాసం శాంతి ఐక్యత ఉమ్మడి విలువలను పెంపొందిస్తాయని వారన్నారు. ఈ అందమైన ప్రదేశానికి నన్ను నా కుటుంబాన్ని స్వాగతించడంలోనే మీ ఆతిథ్యం, దయకు మీ అందరికీ ధన్యవాదాలని మీరు ఖచ్చితత్వం, శ్రద్ధతో అందమైన ఆలయాన్ని నిర్మించడం భారత దేశానికి గొప్ప ఘనతను సాధించిందన్నారు. మోడీతో జరిగిన భేటీలో విదేశాంగమంత్రి జైశంకర్, కార్యదర్శి విక్రమం మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, అమెరికాలో భారత రాయబారి వినయ్‌మోమణ్ క్వాత్రాలు ఉన్నారు. భేటీ అనంతరం ప్రధాని ఇచ్చిన విందుకు జెడివాన్స్ దంపతులు హాజరయ్యారు. ప్రధాని నివాసానికి వచ్చిన వాన్స్ కుటుంబాన్ని ప్రధానిమోడీ సాదరంగా ఆహ్వానించి తోడ్కొనివెళ్లారు. అనంతరం అక్కడినుంచి జయపురకు వెళ్తారని విదేశాంగశాఖ ప్రకటించింది. విలాసవంతమైన రాంభాగ్‌ప్యాలెస్ హోటల్‌లో బసచేస్తారు. అబర్‌కోట సందర్శన అనంతరం ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగిస్తారు. ట్రంప్ హయాంలో భారత్, అమెరికా విస్తృత సంబంధాలపై మంగళవారం జరిగే సదస్సులో ఉపన్యసిస్తారు. 23న వాన్స్‌కుటుంబంతోకలిసి ఆగ్రాకు వచ్చి తాజ్‌మహల్, భారతీయ కళలకు సంబంధించినశిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. తిరిగి 24న జయపురకువెళ్లే వాన్స్ అక్కడినుంచే అమెరికా బయలుదేరి వెళతారు.

# మంత్రుల సమీక్ష

>> గతంలో చిలకలూరిపేట,విశాఖపట్నంలలో ప్రధాని పర్యటన సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.ఈసమావేశంలో ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ టెంట టివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం సమీపంలోని హెలీప్యాడ్ కు చేరుకుని అక్కడ నుండి రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక వైపున గల ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈకార్యమానికి సంబంధించి విధులు కేటాయించిన అధికారులు వారి టీంలతో కలిసి ఆయా పనులు సక్రమంగా జరిగేలా చూసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు ఇతర ఏవిధమైన సమస్యలున్నా నోడలు అధికారి వీరపాండ్యన్‌తో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు.ప్రధానమంత్రి కార్యక్రమాల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాని పర్యటన ఏర్పాట్లను వివరిస్తూ టెంటటివివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధాన మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని వివరించారు. తదుపరి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం వద్ద గల హెలీప్యాడ్‌కు 3.20గం.లకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి ప్రధాన వేదిక వరకు సుమారు 1.2 కి.మీల పొడవునా రోడ్డు షో నిర్వహిస్తారని వివరించారు. రోడ్డుషోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.అంతేగాక సాంస్కృతిక బృందాల ప్రదర్శన ద్వారా స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు.3.35గం.లకు సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన అమరావతి ఫెవిలియన్ కు చేరుకుంటారని తదుపరి 3.45గం.లకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వివరించారు. సాయంత్రం 5గం.ల ప్రాంతంలో ప్రధాని హెలీప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని విమానంలో బయలుదేరి వెళతారని అన్నారు. మొత్తం మీద సుమారు రెండు గంటలపాటు సాగే ప్రధాని పర్యటనను విజయ వంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.ప్రధాని పర్యటనకు సంబంధించి 10 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.వివిఐపిలకు కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్లను ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక సామాన్య ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా విజయవాడ నుండి మరో రెండు రూట్లు, గుంటూరు నుండి నాలుగు రూట్లను, మరికొన్ని తాత్కాలిక రూట్లను కూడా ట్రాఫిక్ కు అంతరాయాలు లేని విధంగా తీర్చిదిద్దనున్నట్టు పేర్కొన్నారు.ఆయా రోడ్లన్నీ పాట్ హోల్ ఫ్రీ రోడ్లుగా తీర్చి దిద్దాలని ఆర్ అండ్బి అధికారులకు సూచించారు. ఆయా రోడ్లపై గల వివిధ బాటిల్ నెక్స్‌ను సరి చేయాలని చెప్పారు.
వివిధ జిల్లాల నుండి సభకు తీసుకువచ్చే వారందరికీ అల్పాహారం,తాగునీరు, మజ్జిగ,పండ్లు,భోజనం వంటివి పంపిణీ చేయాలని సంబంధిత ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు. ఈ విషయంలో రాజీ పడవద్దని ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చుసుకోవాల న్నారు. ఈనెల 29 సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆయా అధికారులకు చెప్పారు.30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి ఆయా అధికారులకు కేటాయించిన పనులను వారి బృందాలతో సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ప్రతి రోజు పర్యటించి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. అంతేగాక ఏర్పాట్లకు సంబంధించి ప్రతి రోజు సా.4గం.లకు డైలీ నివేదికను సమర్పించాలని వీరపాండ్యన్ చెప్పారు. ఈసమావేశంలో జిఎడి ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మదుసూధన్ రెడ్డి, ఎన్టిఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మిష, బాలాజీ, నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేదికగా ఎపి

>> ప్రజల మద్దతు, సహకారం, సమిష్టి కృషితో ఆ కలను నిజం చేస్తానన్నారు. సమాజంలో అసమానతలు పోవాలని పేదధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గాలని సిఎం వివరించారు. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తెలుగువారు ఉన్నారని వారంతా మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రానికి ఎంత రెవెన్యూ వస్తే అంత మొత్తాన్ని సంక్షేమానికి ఖర్చు చేయొచ్చునని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగానే సిఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కీలక సమాచారాన్ని వెల్లడించారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని స్పష్టం చేసారు. సూపర్ సిక్స్ పథకాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాబోయే రోజుల్లో ఎక్కువ మూలధన వ్యయం చేస్తామన్నారు. ఆదాయం మార్గాలను అన్వేషిస్తామన్నారు. మళ్లీ అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తామని అన్నారు. మూడుసార్లు సిఎంగా ఉన్నప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు వస్తున్నాయి. ఇప్పటికీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కంట్రోల్‌లోకి రాలేదు. ఆర్థిక వ్యవస్థ మరింత దారి తప్పకుండా గాడిన పెడతామని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేంద్రం ఆదుకోబట్టే కొంతమేరకు ముందుకెళ్తున్నాం. అమరావతి, పోలవరం పనులు సాగుతున్నాయి. స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చారు అని ముఖ్యమంత్రి తెలిపారు. సుదీర్ఘమైన కసరత్తు చేసి రాష్ట్ర భవిష్యత్తు కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ ను సిద్ధం చేశాం. అప్పటికి వృద్ధి రేటు 15 శాతం నమోదైతే తలసరి ఆదాయం 45,787 డాలర్లకు చేరుతుందన్నారు. ఎపికి 15 శాతం పైగా గ్రోత్ రేట్ సాధిస్తేనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయి. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. తొలి 100 రోజుల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్న విషయం గమనించాలన్నారు. 204పైగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5లకే పేదలకు భోజనం పెడుతున్నాం. మెగా డిఎస్సీని ప్రకటించాం. రాష్ట్రాభివృద్ధికోసం ఉచిత ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్‌ఎంఈ పాలసీలను ప్రకటించాం. ఉద్యోగులకు సమయానికి పెన్షన్లు, జీతాలు అందిస్తున్నాం. రాష్ట్ర సొంత ఆదాయం 2018-19కి 17.10 శాతం ఉంటే 2022-23కి 9.80 శాతానికి పడిపోయింది. ప్రభుత్వ అప్పులు 16.5 శాతం పెరిగాయి. రెవెన్యూ లోటు 2018-19 మధ్య 13.4 శాతం ఉంటే 2022- 23కి 16.2కు పెరిగింది. కార్పొరేషన్ల ద్వారా కూడా అప్పులు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు మళ్లించారు. గత ప్రభుత్వం పెట్టిన పాత బకాయిలు రూ.22,252 కోట్లు విడుదల చేశాం. ఇంకా చెల్లించాల్సినవి చాలా ఉన్నాయి. 10 నెలల కాలంలో ప్రత్యేక దృష్టి పెట్టి రూ.6,35,568 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. దీని ద్వారా 4,10,125 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎన్నికల ముందు మేము చెప్పిన 20 లక్షల ఉద్యోగాల కోసం కసరత్తు చేస్తున్నామన్నారు.గూగుల్ వంటి ప్రముఖ సంస్థల రాకతో 10 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులు వస్తాయి. అన్ని వ్యవస్థలను పునరుద్ధరించి పరుగులు పెట్టించేలా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం పథకం అమలు చేసేలా ప్రణాళికలు చేపట్టారు. ఎటువంటి జాప్యం లేకుండా కార్పొరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుపై బడ్జెట్ లో ప్రస్తావించారు. ఈ ఏడాదిలోనే 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే ఆరోగ్య బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 7 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. టిడ్కో ద్వారా 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం నిమిత్తం ఎస్సీలకు అదనంగా 50 వేలు, ఎస్టీలకు అదనంగా 75 వేలు ఇవ్వనున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందించే సాయాన్ని 10వేల నుంచి 20 వేలకు ప్రభుత్వం పెంచింది. దీపం 2.0 కింద నిధుల కేటాయించారు. ఆదరణ పథకం పునఃప్రారంభించిన కూటమి ప్రభుత్వం, నిధులు కేటాయింపునకు కట్టుబడి ఉందని తెలిపింది.మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,506 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18,847 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యశాఖకు రూ.3,156కోట్లు, ఇంధనశాఖకు రూ.13,600కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.8,785 కోట్లు, యువజన పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు గృహ మంత్రిత్వశాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, పోలవరం కోసం రూ.6,705 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కోసం రూ.2800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాలు

>> 1వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6,19,275 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంలో 5,64,064 మంది, తెలుగు మీడియంలో 51,069 మంది పరీక్షలు రాశారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 6,49,884 మంది విద్యార్థులు ఫీజుకట్టారు. కానీ వారిలో 6,19,275 మంది పరీక్షలు రాశారు. ఈ పదో తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాల మూల్యాంకనం మొత్తం 26 జిల్లాల్లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమై.. ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. ఇక మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసే ప్రక్రియ కూడా ముగిసింది. దీంతో ఫలితాల విడుదలకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసింది.

# హైకోర్టుకు బదలీ

>> చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియపూర్తయింది. బదలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ నటరాజన్‌ను కేరళకు, సంజయ్‌గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

## 'సిట్' అదుపులో కసిరెడ్డి

>>మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కసిరెడ్డి కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. న్యాయస్థానం దీనిపై విచారణ చేపట్టింది. మధ్యంతర రక్షణ కల్పించాలంటూ రాజ్ కసిరెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీక రించలేదు. ఈ కేసులో తదుపరి విచార ణను వారానికి వాయిదా వేసింది. మంగళవారం తాను విచారణకు హాజర వుతానంటూ కసిరెడ్డి ఆడియో విడుదల చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 22-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.నవమి సా.6.07
శ్రవణ మ.12.39
వర్జ్యం సా.4.33-6.07
దు.ఉ.8.19-9.09, రా.11.27-12.17
రాహుకాలం – మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** శ్రమతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. దైవదర్శనాలు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్తులాభం.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో పాల్గొంటారు.

**కన్య :** ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సోదరుల కలయిక.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు బదలీలు వుంటాయి.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి ధనలాభం.

**కుంభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందిస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




సోమవారం వేసవి కార్యాచారణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న ఢిల్లీ సిఎం రేఖా గుప్త

# ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

>> మానవాళిని కాపాడుకునే దిశగా ప్రతి ఏడాదీ ఏప్రిల్ 22ను 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. పారిశ్రామిక ప్రగతితో ఏర్పడుతున్న వాయు కాలుష్యాన్ని 'ప్రగతి వాసన' గా భావిస్తున్న తరుణంలో 1970 నుంచి వరల్డ్ ఎర్త్ డే పేరిట పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా సమిష్టి చైతన్య కార్యక్రమాలు మొదలయ్యాయి.
ఈ ఏడాది ప్రపంచ ధరిత్రీ దినోత్సవానికి మన శక్తిమన గ్రహం అన్న ఇతివృత్తాన్ని ఎంపిక చేశారు. పునరుత్పాదక వనరుల ద్వారా 2030 నాటికి విద్యుదుత్పాదనను మూడు రెట్లు పెంచే లక్ష్యం వైపు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాల్ని ముమ్మరం చేయడం పట్ల దృష్టి సారించేందుకు ఈ విషయాన్ని ఎంపిక చేశారు. కేవలం నేటి సుఖం కోసమే ఆరాటపడకుండా, రేపటి మనుగడ కోసం సుస్థిరాభివృద్ధి విధానాలపై దృష్టి పెట్టి ధరణి మాత మనుగడతో పాటు మానవాళి ఉనికిని కాపాడుకునేందుకు తగు చైతన్యంతో ప్రజలు, ప్రభుత్వాలు దూర దృష్టితో పనిచేయాలి. ఈ దిశగా ఈ ఏడాది ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా సమిష్టిగా సంకల్పించాలని కోరుతున్నాను. ..ధరణి మాత ఆరోగ్యాన్ని రక్షించుకుందాంమానవాళి ఉనికిని కాపాడుకుందామన్నారు.

## గొల్లపూడి పంచాయతీకి
# జాతీయ అవార్డు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో రాష్ట్రంలోని విజయవాడ నగర శివార్లలోని గొల్లపూడి గ్రామ పంచాయతీకి అవార్డు లభించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఆత్మ నిర్భర్ పంచాయతీ కేటగిరిలో ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీ మూడవ స్థానం సాధించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆశాఖ పేర్కొంది.
సొంత ఆదాయ వనరులు పెంపొందించుకున్న పంచాయతీలకు ఇచ్చే ఈ అవార్డును గొల్లపూడి గ్రామ పంచాయతీ దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన పంచాయతీ రాజ్ దివస్ సందర్భంగా బీహార్ రాష్ట్రంలోని మధుబనిలో జరిగే జాతీయ స్థాయి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

# పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

>> అందించారు. శరణార్థుల పాదాలు కడిగిన పోప్ తరచూ సామాజిక అంశాలపై కూడా ఆయన వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థులకు పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావించేవారు. తదుపరి పోప్‌ను రహస్య ఓటింగ్ ద్వారా కార్డినల్స్ కాలేజ్ ఎన్నుకోనుంది. వాస్తవానికి పోప్ ఈ ఏడాది భారత్‌లో పర్యటించాల్సి ఉంది. కాథలిక్ చర్చి జూబ్లీ ఇయర్ వేడుకల కోసం ఆయన భారత్‌కు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబర్‌లో కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఆయన్ను ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతినిధి బృందం స్వయంగా ఆయన్ను కలిసింది. అయితే పోప్ అనారోగ్యం కారణంగా ఆ షెడ్యూల్ వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆయన కన్నుమూశారు. తన మరణానికి కొద్దిగంటలముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో 35వేలమందిని ఉద్దేశించి ఆయన ప్రపంచ శాంతికోసంసందేశం ఇచ్చారు. బ్రదర్స్ అండ్ సిస్టర్స్ హ్యాపీ ఈస్టర్ అని పోప్ స్వయంగా చెప్పారు. తర్వాత ఆయన సందేశాన్ని ఆర్చిబిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో మయన్మార్‌లలో శాంతినెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిసారు. పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. అస్వస్థతకు గురయిన తర్వాత ప్రజల్లోకి రావడం ఈస్టర్ సందేశంతోనే. ప్రత్యేక వాహనంలోప్రజలమధ్యనుంచి ఆయన ప్రయాణిస్తూ వెళ్లారు. మధ్యలో ఆగి పసికందులను చిన్నారులను ఆశీర్వదించారు.

# లక్షదాటిన బంగారం

>> సాయంత్రం 5.30 గంటలకు 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కి చేరింది. తదనంతరం కొంతమేర దిగివచ్చి రూ.99,900వద్ద ట్రేడ్ అయింది. ముందురోజు ముగింపుధరతోపోలిస్తే సుమారు రెండువేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటివరకూ పసిడిధర సుమారు రూ.20వేలకుపైనే పెరిగింది. డిసెంబరు 31న సుమారు రూ.79వేలు ఉన్న పసిడిధరలు గడచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగాయి. వెండికూడా కిలో మళ్లీ లక్షరూపాయలకు చేరువగా ఉంది. ఒకసారి ఇప్పటికే లక్ష మార్కును దాటిన వెండి ప్రస్తుతం రూ.99,299వద్ద ట్రేడ్ అవుతోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో కూడా పదిగ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కుదాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్టుల్లో పదిగ్రాముల పసిడి ఒక్కరోజులోనే రూ.1621మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875వద్ద గరిష్టాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాలమధ్య వాణిజ్యపరంగా సయోధ్య కుదిరేంతవరకూ పసిడిధరల్లో ఇదేపరిస్థితి కొనసాగుతుందని నిపుణులు అంచనాలువేస్తున్నారు.

# జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> సంచారం వుండడంతో పాటు వారి స్థావరం వుందనే సమాచారంతో తెల్లవారుజాము నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలకు తోడుగా స్థానిక పోలీసులు కూంబింగ్ చేబట్టారు. ఈ సందర్భంగా ఇరువైపుల కాల్పులు జరిగా యని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. కాల్పుల తరువాత ఎనిమిది మంది నక్సలైట్లు మరణించారని, వీరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని స్థానిక ఆసుపత్రికి తర లించామని డిజిపి తెలిపారు. ఘటనా స్థలంలో ఒక ఎకె 47 తుపాకి, మరో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకి, మూడు ఇన్సాస్ తుపాకులు, కొంత పేలుడు సామాగ్రి,, మావోయిస్టుల సాహిత్యం లభ్యమయ్యిందని ఆయన వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసుల తరపున ఎలాంటి నష్టం జరగలేదని ఆయన తెలిపారు. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో మరికొందరు నక్సలైట్లుగా గాయపడినట్లు భావిస్తున్నామని, ఆ ప్రాంతంలో గాలింపు జరుగుతోందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేత పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ కూడా వున్నారని, ఆయనపై కోటి రూపాయల రివార్డు వుందని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. వివేక్‌తో పాటు జోనల్ కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్ అలియాస్ అవినాష్, సాహెబ్రాం మాంజి అలియాస్ రాహుల్, మహేష్ మాంజి అలియాస్ మోటా తాలు రాంజి, గంగారాం మాంజిలు మృతుల్లో వున్నారని డిజిపి తెలిపారు. వివేక్‌పై కోటి రూపాయల రివార్డు వుండగా అరవింద్ యాదవ్‌పై 25 లక్షల రూపాయలు సాహెబ్రాంపై పది లక్షల రూపాయల రివార్డు వుందని డిజిపి తెలిపారు. జార్ఖండ్‌లో నక్సల్ ప్రభావం పెద్దగా లేదని, అయితే కొన్ని ప్రాంతాల్లో వారి ఉనికి వుందని, వీరిని వచ్చే వర్షాకాలం లోపు ఏరివేస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు. నక్సల్స్ ఏరివేతకు కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర సాయుధ బలగాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఝూర్కండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ నక్స లైట్లు ఆయుధాలను వీడి వెంటనే లొంగి పోవాలని పిలుపునిచ్చారు. నక్సలైట్ల ఏరివేత నిరంతరాయంగా కొనసాగుతుందని, వచ్చే ఏడాది మార్చినాటికి నక్సల్స్ విముక్త భారత్‌ను సాధించి తీరుతామని ఆయన తెలిపారు.

## పోప్ ఫ్రాన్సిస్ మరణం బాధించింది - సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** పోప్ ఫ్రాన్సిస్ మరణం తనను ఎంతో బాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారని, శాంతి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరుపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాడ సానుభూతి ప్రకటించారు.

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కూడా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి దూతగా పోప్ ఫ్రాన్సిస్ మరణం కేథలిక్ సమాజానికి తీరని నష్టమని వారు తమ ప్రకటనల్లో పేర్కొన్నారు.ఆయన ఉన్నంతకాలం శాంతి సామరస్యం కోసం పరితపించారని పేర్కొన్నారు.

## బిసి అభ్యర్థులకు 24నుంచి ఆన్ లైన్ ద్వారా డిఎస్సీకి ఉచిత కోచింగ్ - బిసి సంక్షేమ మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:**డీఎస్సీకి హాజరయ్యే బీసీ అభ్యర్దులకు ఈ నెల 24నుంచి ఆన్ లైన్ ద్వారా ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు.ఆ మేరకు ఆమె కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా శిక్షణ పొందిన వారే అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత వెల్లడించారు. అందుకనుగుణంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 26 జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేంద్రాల ద్వారా 5,200 మందికి ఉచిత డీఎస్సీ శిక్షణతో పాటు కోచింగ్ సమయంలో నెలకు రూ.1500ల స్టయిఫండ్, మెటీరియల్ కోసం మరో అదనంగా రూ.1000 అందజేసినట్లు తెలిపారు. గృహిణులు, ఇతర అభ్యర్థుల కోసం ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ నెల 24 నుంచి ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ నిర్వహణా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుడుతూ సీఎం చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముక్తకంఠంతో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ కు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు రూపొదిద్దుకుంటుందని భావిస్తూ, టీడీపీ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర చరిత్రలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వాలకే చెందుతాయన్నారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ విధానం తెచ్చింది కూడా సీఎం చంద్రబాబునాయుడుదేనని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మెగా డీఎస్సీ నిర్వహణకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సవిత ధన్యవాదాలు తెలిపారు.

# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషం - సుప్రీంకోర్టు విశ్రాంత సిజె జస్టిస్ ఎన్‌వి రమణ



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి మొక్కిన జస్టిస్ రమణ కుటుంబసభ్యులుఅనంతరం ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కృత్రిమ మేధ వినియోగంలో ప్రజాసంబంధాల పాత్ర కీలకం

### - జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవంలో వక్తలు



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కృత్రిమ మేధస్సు(ఎఐ)ను బాద్యతాయుతంగా వినియోగించడంలో ప్రజా సంబంధాలు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య పివి నరసయ్య తెలిపారు. కృత్రిమ మేధ కేవలం కంప్యూటర్ సబ్జెక్టు కాదని, ఇది అన్ని సబ్జెక్టులను ప్రభావితం చేయగలదని అన్నారు.ఏఐని నైతికంగా, పారదర్శకంగా వినియోగిస్తే మంచి ఫలితాలను రాబట్టుకోవచ్చని తెలిపారు.ఏఐని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజా సంబందాల నిపుణులు, సాంకేతిక నిపుణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ కామర్స్,మేనేజ్‌మెంట్ కంప్యూటర్స్ కళాశాలలో జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్య పి.వెంకటకృష్ణ, తిరుపతి ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యేటూరు కాలిదాస్ కీలక ఉపన్యాసంలో ప్రజలకు ఏఐ సాంకేతిక వినియోగం గురించి అవగాహన కల్పించడం ప్రజాసంబంధాల ప్రధాన లక్ష్యమన్నారు.సామాజిక మాద్యమాలు, వార్తావ్యాసాలు, సమావేశాలు ,అవగాహన కార్యక్రమాల ద్వారా ఏఐ సానుకూల ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ జివిఎస్ ప్రసాద్, కార్యదర్శి డి.చంద్రమోహన్, కంప్యూటర్‌సైన్స్ కళాశాల విభాగాధిపతి ఆచార్య జి.అంజన్‌బాబు, మేనేజ్‌మెంట్ స్టడీస్ విబాగాధిపతి ఆచార్య పి.రఘునాథరెడ్డి,కామర్స్ హెచ్ఓడి ఆచార్య కె.జయచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జివి రమేశ్‌బాబు, పిఆర్ఎస్ఓ కోశాధికారి కె.మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, మాజీ ఛైర్‌పర్సన్లు డాక్టర్ పి.స్వరాజ్యలక్ష్మి, ఆచార్య డాక్టర్ త్రిపురసుందరి ,రమ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె సంతోష్‌రావు పదవీకాలం పొడిగింపు



**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎపి ఎస్‌పి డిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సిఎండి) కె సంతోష్‌రావు పదవి కాలాన్ని రాష్ట్రప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించిన జివో 29ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విడుదల చేశారు. సంతోష్‌రావును 2023 ఏప్రిల్ 14వ తేదిన ఎస్‌పిడిసిఎల్ సిఎండిగా నియమించిన ప్రభుత్వం రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని వెల్లడించింది.

ఇప్పుడు కొత్తవారిని నియమించే వరకు ఆయననే కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది.

## శ్రీవారి సేవలో సినీప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని పలువురు సినీ ప్రముఖులు దర్శించు కున్నారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో సినీసంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపీచంద్‌మలినేని, నటుడు అశ్విన్‌బాబు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనంతోఆనందంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎస్వీగోశాలలో గోవులకు చల్లచల్లదనం - జనసేననేత కూలర్లు విరాళం



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల మరణాలపై ఆరోపణలు ,రగడ చోటుచేసుకున్న తరుణంలో గోమాతలకు చల్లదనం కోసం ఎయిర్‌కూలర్లను తిరుపతి జిల్లా జనసేననేత కిరణ్‌రాయల్ విరాళంగా అందించారు. జనసేనాని పవన్‌కల్యాణ్‌కు గోమాతలంటే ఎంతో ఇష్టమని, గోమాతలపై ఉన్న విశ్వాసంతో గోమాతలకు కూలర్లు ఇవ్వడం జరిగిందని కిరణ్ తెలిపారు. గోశాలకు నాలుగు ఎయిర్ కూలర్లు అందించినట్లు చెప్పారు.గోవుల సంరక్షణకు మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నేతలు ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, మనోజ్,వంశీ, లోకేశ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. జనసేననేత కిరణ్‌రాయల్ మంచి మనసును గోసంరక్షకులు అభినందించారు.

## డిఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచండి

### సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** డిఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేసారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్ కు సంబంధించి అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని, వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం రామకృష్ణ లేఖ రాశారు. 2018 తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని రామకృష్ణ తన లేఖలో గుర్తుచేశారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలామంది అభ్యర్థులు వేచి చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో అభ్యర్థుల్లో వయోపరిమితిపై ఆందోళన నెలకొందని చెప్పారు. వయోపరిమితి 47 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని, మెగా డీఎస్సీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రామకృష్ణ తన లేఖలో సీఎం చంద్రబాబును కోరారు.

## గ్రావెల్ మాఫియాపై ఎమ్మెల్యే ఉక్కు పాదం



**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా పై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉక్కుపాదం మోపారు. సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంది మార్బలంతో కాకుండా తన వాహనంలో నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకం ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఒక హిటాచి వాహనంలో పెద్ద మొత్తంలో గ్రావెల్‌లోడ్‌తో టిప్పర్లు ట్రాక్టర్లకు గ్రావెల్ ఎత్తుతున్న దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. గ్రావెల్ మాఫియా ఇంతలా బరితెగించి గ్రావెల్ తరలిస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోవడం ఎమ్మెల్యేకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులను నల్లగొండ్ల గ్రామానికి రావాలని ఆదేశించడంతో అధికారులు హుటాహుటీన నల్లగొండ గ్రామానికి చేరుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలిస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులుపై ఆగ్రహించాడు ఎమ్మెల్యే గ్రావెల్ తరలింపు వద్దకు వచ్చాడన్న సమాచారం తెలియడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘటన స్థలం వద్దకు వచ్చారు. గ్రామస్తులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధికారులు తీరుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ మాఫియా గురించి తెలియజేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాసులురెడ్డి భరోసా అండదండలతో ఇంత పెద్ద ఎత్తున నల్లగొండ్లలో గ్రావెల్ తరలించుకుని పోతున్నారని పంచాయతీ పాలకవర్గం తమది కాబట్టి పంచాయతీ తీర్మాన్ని ఇస్తాం గ్రావెల్ తగిలించుకో వెళ్లండి భరోసా ఇవ్వడంతో గ్రావెల్ మాఫీ ఇష్టానుసారం రెచ్చిపోతున్నారని ప్రతి నెల ఒప్పందం మేరకు అధికారులకు స్థానిక నేతలకు ముడుపులు పోవడంతో నోరు మెదపడం లేదన్నారు. గ్రామస్తులు ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నల్లగొండ గ్రామస్తులు తమ గ్రామ సమీపంలో నల్లకొండ వద్ద పెద్ద పెద్ద వాహనాలతో గ్రావెల్ లోడుతూ డంపింగ్ చేస్తూ టిప్పర్లతో బయటకు తరలిస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెప్పడంతో తానే స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గం ప్రజలు ఎంతో పెద్ద మనసుతో మొన్నటి ఎన్నికల్లో నన్ను దీవించి గెలిపించడం జరిగిందన్నారు. తాను కూడా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం దృష్టికి అనేక ప్రతిపాదన సిద్ధం చేసుకుని తాను ప్రయత్నిస్తుంటే, ఈ ప్రాంతంలో కొంత మంది పనికట్టుకుని తన పేరు చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని, తాను ఎప్పుడు కూడా అక్రమార్కులకు తావు ఇవ్వనని ఎవరైనా తన పేరు చెప్పుకొని అక్రమాలకు పాల్పడితే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు తావిస్తే చర్యలు తప్పని అధికారులు హెచ్చరించారు. నియోజకవర్గ సంపదను అక్రమంగా దోచుకోవాలని దుర్మార్గులను విడిచి పెట్టేది లేదని మన విలువైన సంపదను మనమే కాపాడుకోవానలి అధికారులు సూచించారు. అక్రమ గ్రావెల్ రవాణా మాఫియా పై రెవెన్యూ ఇరిగేషన్ పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి

**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కెవిస్ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


DEBTS RECOVERY TRIBUNAL
VISHAKHAPATNAM
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530020
Case No.: OA/225/2025
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub- rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Between :
ICICI Bank Limited, T. Nagar Branch, Rajamundry, Rep. by its Branch Manager ...Applicant Bank
And :
Nalli Jaya Krishna and Another ...Defendants

To,
Def. 1. Mr. Nalli Jaya Krishna S/o. Nalli Bala Krishna R/o. 3-81, Gopalapuram, Gadimoga Locality, Near Ambedkar Statue, Tallaveru, East Godavari- 533463. Andhra Pradesh
Def. 2. Mr. Nalli Bala Krishna S/o. Nalli Ramaswamy, R/o. 3-81, Gopalapuram, Gadimoga Locality, Near Ambedkar Statue, Tallaveru, East Godavari- 533463. Andhra Pradesh ...Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY RELIEFS PRAYED FOR SHOULD NOT BR GRANTED

(I) Whereas, the Petitioner/ Applicant filed the above O.A for impleading you as Defendants in the above O.A 225/2025. Therefore, you hereby directed to appear before the Hon'ble Tribunal in person or through advocate or duly authorized agent on 30.04.2025 at 10.30 AM to answer the claim.
(ii) You are directed to collect the copy of the petition on your appearance before the Tribunal.
(iii) If you need to file any documents, you may file the same with a list along with the written statement
(iv) You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
(v) Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 16.04.2025

Signature of the Officer
Assistant Registrar
DEBTS RECOVERY TRIBUNAL
VISAKHAPATNAM


## ప్రధాన మంత్రి పర్యటనపై మంత్రుల సమావేశం

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడి పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఎపి మంత్రులు తెలిపారు. ఎపి పర్యటనలో భాగంగా. మే 2 న సాయంత్రం 3 గంటలకు ప్రధాని మోడి గన్నవరానికి చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ .. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోడి గంటపాటు ఉంటారని చెప్పారు. నాదెండ్ల మనోహర్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పున్ణప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివఅద్ధి పనులను మోడి ప్రారంభిస్తారని తెలిపారు.

### పురుగు మందుతాగి మహిళ మృతి

**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ లోని కడనూతల గ్రామానికి చెందిన చల్లా. ఆదినారాయణమ్మ (55)ఈనెల 19 వ తేదీన పురుగుమందు తాగి చికిత్స పొందుతూ చెన్నై లోని ప్రైవేట్ వైద్యశాల లో ఆదివారం మృతి చెందిందని తెలిపారు.

## ఉత్తమ పనితీరులో ఐఎఎస్‌కు జాతీయ అవార్డు




**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి అవార్డు (2023)ను తిశిళీజులిని,ళీ సెక్రటరీ వి. ప్రసన్న వెంకటేష్ నేడు డిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో అందుకున్నారు. సోమవారం నాడు 17వ సివిల్ సర్వీస్ డే సంధర్భంగా డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో వికసిత్ భారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాని హాజరయ్యారు. ఈ సంధర్భంగా పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఐఏయస్ అధికారులకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. ప్రసన్న వెంకటేష్ జనవరి 2022 నుంచి జూలై 2024 వరకు ఏలూరు జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ఆయన ప్రజలకు అందించిన సేవలకు గాను ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ పథకాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో అక్షజ్ఞ అనే కార్యక్రమంతో గర్భిణీలు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఈ విధంగా, జిల్లాలో సుపరిపాలన అందించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లలో ప్రసన్న వెంకటేష్ ఒకరు. ఈ సంధర్భంగా అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజా సేవకునిగా శక్తివంచన లేకుండా తాను కృషి చేస్తానన్నారు.

## కోనలో బ్రహ్మోత్సవాలపై సమీక్షా సమావేశం



**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మే నెల 8వ తేది నుండి జరగనున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందించి చేయవలసిన ఏర్పాట్లపై మంగళవారం పెంచలకోనలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి సోమవారం తెలిపారు. కోనలోని కాకతీయ కమ్మ సత్రంలో నెల్లూరు ఆర్‌డిఓ ఆధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో బ్రహ్మోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం వివిద శాఖల ద్వారా చేపట్టవలసిన వివిద అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని వివిద శాఖలకు చెందిన అధికారులు తప్పని సరిగా ఈ సమీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆందోళన

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు ఆధ్వరనఓయంలో సోమవారం నిరసనలు నిర్వహించారు. విజయవాడ, విశాఖ. గుంటూరు, శ్రీకాకుళం, తిరుపతి తదితర నగరాల్లోను రైతులు నిరసన ప్రదర్శనలు చేసారు. పలు మండల కేంద్రాల్లో తహాస్సీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో ఈ అంశంపై తహాస్సీల్దార్లుకు వినతి పత్రాలు అందజేసారు. అమెరికా ప్రభుత్వం తరపున దేశంలో ఒప్పందాలు చేసుకునేందుకు వస్తున్న అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనకు భారత రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, బి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో పేర్కొన్నారు. భారత వ్యవసాయ ఉత్పత్తులపై విపరీతంగా సుంకాలు విధిస్తూ, దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా దెబ్బతీస్తుందన్నారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనల్లో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## భక్తులకు మరింత నాణ్యమైన ఆహారం

**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు తిరుమలలోని హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ఆహారపదార్థాలు ఏ మేరకు నాణ్యత, పరిశుభ్రత పాటిస్తు న్నారనే పరీక్షలకు మరో ఆహార పదార్థాల తనిఖీ పరిశోధన శాలను కేంద్రం మంజూరు చేసింది. ఫుడ్‌సేఫ్టీల్యాబ్‌లు ఏర్పాటులో భాగంగా తిరుమలకు మరొకటి మంజూరు చేసింది. ఈ పరిశోధనశాలలో టిటిడికి సరఫరా అవుతున్న పలు రకాల ఆహారపదార్థాలు, పప్పులు, నూనెలు వంటివాటి నాణ్యతను పరీక్షించే వెసలుబాటు కలుగుతుంది. ఇప్పటికే తిరుమలలోని ఫ్లోర్‌మిల్ ఆవరణలో ఆహారపదార్థాల పరీక్షించే ల్యాబ్ ఉంది. దీన్ని ఇప్పటికే ఆధునీకరించి అత్యాధునిక పరికరాలు అమర్చారు. దేవునికి మూడుపూటలా తయారుచేసే నైవేద్యప్రసాదాలను ఈ ల్యాబ్‌లో పరిశోధకులు తనిఖీ చేసి ఆ తరువాత స్వామివారికి నివేదిస్తున్నారు. ఇప్పుడు తిరుమల ప్రాధాన్యత దృష్ట్యా మరో సేఫ్టీఫుడ్‌ల్యాబ్ మంజూరైంది. తిరుమలేశుని అన్నప్రసాదాల తయారీలో వినియోగించే పదార్థాల నాణ్యత పరీక్షించేందుకు అధునాతన యంత్రాలు తిరుమలకు రానున్నాయి. అంతేగాక అన్నప్రసాదాలు తయారుచేసే వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా పదార్థాలు తనిఖీ చేసే అవకాశం కలుగుతుంది. తిరుమలలో అవసరమైన మరో అధునాతన పరిశోధనశాల ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఉన్న ల్యాబ్‌లో గ్యాస్‌క్రోమోటోగ్రఫీ, హైఫర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ రెండు యంత్రాల ద్వారా నెయ్యిలోని నాణ్యత, నిత్యావసరసరుకుల నాణ్యత ఎవ్ ఎస్ ఎస్ ఏ ఐ నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదో తెలిసిపోతుంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.02/2025-26 తేది: 19.04.2025
పనిపేరు: కాకినాడ జిల్లాలోని జగ్గంపేట నియోజకవర్గంలో ఇర్రిపాక గ్రామంలో శివాలయం వద్ద ఏలూరు కాలువ కుడి గట్టుకు రిటైనింగ్ వాల్ నిర్మింపుట. పని విలువ: రూ.60.00 లక్షలు. టెండరు స్వీకరించు చివరి తేది: 05.05.2025, ఉ.11.00గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ //tender.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్: 0883-2417419.
సం/-, పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం.
DIPR.NO. 16157/CL/ADVT/1/1/2022-23 తేది: 21.04.2025

వార్త

ఒక వ్యక్తి పేదరికాన్ని సంపదను నిర్ణయించేది ఆ వ్యక్తి సంపాదన గాని, ఆదాయం కాని కాదు. అతడి ఆదాయానికి, ఖర్చుకి మధ్యలో ఉన్న వ్యత్యాసం అంతే.

-డేనియల్

# తుది సందేశం

సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం తుది శ్వాస వరకు తపించిన వాటికన్ సిటీ అధినేత, రోమన్ కాథలిక్ చర్చి అధిపతి ,క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరనే సమాచారాన్ని క్రైస్తవ లోకం జీర్ణించుకోలేకపోతోంది. ఇటలీ కాలమాన ప్రకారం సోమవారం ఉదయం 7.35 నిమిషాలకు తన నివాసం కాసా శాంటా మార్తాలో తుదిశ్వాస విడిచారు. ఆయన చాలా కాలంగా న్యుమోనియా వంటి శ్వాస కోశ , కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. గత నెలలో 38రోజుల పాటు చికిత్స పొందారు. మొన్న ఆదివారం ఏప్రిల్ 20 ఈస్టర్ సందర్భంగా ప్రపంచ శాంతి కోరుతూ తన తుదిసందేశాన్ని ప్రపంచానికందించి ఆయన మనోభావాలను వ్యక్తీకరించారు. 2013 మార్చి 13 న 266 పోప్ గా ఆయన వాటికన్ ప్రస్థానం ప్రారంభమయ్యింది. 1936 డిసెంబర్ 13న పోప్ అర్జెంటీనాలో జన్మించారు. అమెరికన్ ఖండంలోని దక్షిణా అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి పోప్ ఆయనే. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. తొలుత ఆయన పాస్టర్‌గా అర్జెంటీనాలో సేవలందించారు వాటికన్ సిటీలోని కాథలిక్ చర్చి ప్రధాన పాలకునిగా ఎన్నో కీలక సంస్కరణలు చేపట్టారు. మానవ హక్కులను, మత సామరస్యాన్ని ప్రోత్సహించారు. ఆదిలోనే వాటికన్ సిటీ రాజ్యాంగాన్ని సంస్కరించారు. న్యాయ వ్యవస్థలోనూ సంస్కరణలు చేశారు. ఇందులో బిషప్‌లు, కార్డినల్‌లపై వచ్చే నేరాభియోగాలపై వాటికన్ సిటీ కోర్టు మాత్రమే విచారించే అవకాశం ఉంటుంది. బిషప్‌ల అధికారాలను పెంచారు. పర్యావరణ, సామాజికాంశాలపై కూడా విశేషంగానే స్పందించారు. ఇతర సమాజం కన్నా ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగారు. లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించినా ,హోమోసెక్సువల్ వివాహాలను మన్నించలేదు. గర్భవిచ్ఛిత్తిని అమానుషంగా వర్ణించారు. సహజ కాన్పు కాని దానిని తల్లీ బిడ్డల గౌరవానికి భంగం కలిగించే చర్యగా అభివర్ణించారు. మహిళల, పిల్లల గౌరవాన్ని భంగం పరిచేదని భావించారు. ఫోర్నోగ్రఫిని కూడా పోప్ తప్పుపట్టిన అంశాలలో ఒకటి. వైవాహిక సంబంధం బలంగా ఉండాలంటే భార్యాభర్తల పట్ల ఒకరికొకరికి ప్రేమానురాగాలు పెంపొందించుకోవాల్సి ఉంటుందని పోప్ తరచు చెప్పేవారు. ఆదివారం నాడు ఏప్రిల్ 20, 2025న, సెయింట్ పీటర్స్ స్క్వేర్లో ఈస్టర్ వేడు కల సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ తన సాంప్రదాయ ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించారు. తీవ్రమైన న్యుమోనియా నుండి కోలుకుంటున్నప్పటికీ ఉత్సాహంతో1 తన సందేశాన్ని వినిపించి, సర్వ సమాజాన్ని ఆనందపరిచారు. కార్డినల్ ఏంజెలో కోమాస్ట్రీకి మాస్ను అప్పగించినప్పుడు ఆయన ప్రసంగంలో ఈ సందేశం చదివి వినిపించారు. తన ప్రసంగంలో, పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ సంఘీభావం, వలసదారులను ప్రేరేపించే అణగారిన వర్గాల పట్ల కరుణ చూపారు. ఉక్రెయిన్, గాజా, సూడాన్ ప్రాంతాలలో కొనసాగుతున్న సంఘర్షణలకు శాంతియుత పరిష్కారాల కోసం పిలుపునిచ్చారు. వాటికన్ వెబ్సైట్ ఈసారి ఆయన ప్రసంగ పాఠాన్ని తెలుగులో ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించ లేదు. కానీ ఈస్టర్ ప్రసంగ పాఠాన్ని బయటకు వదలడం విశేషం. 2020 లో పోప్ ఫ్రాన్సిస్ ఫ్రాన్సిస్కో అనే డాక్యుమెంటరీలో హోమో సెక్సువల్ వ్యక్తులు ఒకే కుటుంబం చెందిన వారేనని వివరించారు. ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదమైనవని విశ్వాసులు చెబుతుంటారు. అక్రమ వలస దారులను బలవంతంగా పంపివేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను కూడా పోప్ తప్పు పట్టారు. పోప్ జీవిత చరిత్ర గురించి 2018 లోనే వెండర్స్ అనే నిర్మాత పోప్ జీవిత చరిత్ర, విశేషాలపై ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించారు. వాటికన్ సిటీ ప్రోత్సాహం వల్లనే ఈచిత్ర నిర్మాణం జరిగింది. 2018లో కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. అమెరికాలో కూడా అదే ఏడాది ప్రదర్శితమైంది. విశేషమేమిటంటే ఆ చిత్రంలో పోప్ ప్రత్యక్షంగా వీక్షకులకు ప్రపంచ శాంతి ఆవశ్యకతపై తన సందేశ వాక్యాలను అందించారు. ప్రపంచగడ్డపై మత సామర్థ్యాన్ని, ప్రపంచ శాంతిని కాంక్షించే మహనీయుని కోల్పోవడంవిచారకరం. అనారోగ్యం కూడా సంప్రదాయ బద్ధమైన ఆనవాయితీలను వదలలేదు. ఆనవాయితీ ప్రకా రం కోలుకున్న వెంటనే సెయింట్ మేరీ మేజర్ బాసిలికా వెళ్ళి ప్రార్థనలు చేసి వచ్చారు. దైవ నిర్ణయమే అయినట్లు ప్రపంచ శాంతి సందేశాన్ని లోకానికి ఇచ్చిన పిమ్మట ఆయన పరలోకగతుడయ్యాడు. చాలాకాలంగా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు కారణంగా పోప్ మాట్లాడేందుకు ఇబ్బంది పడడం తెలిసిందే. కాగా విశ్వమానవాళికి దివ్య సందేశం ఇచ్చే సమయంలో. గతంలో వలెనే ఉత్సాహంగా ఉన్నారని వాటికన్ నుంచి తెలిసిన సమా చారం. అమెరికా క్యూబా సంబంధాల పునరుద్ధరణలో కీలకపాత్ర పోషించారు. పేదల సంక్షేమం, వలసదారుల హక్కులు, లింగ సమానత్వం వంటి అనేకానేక సామాజిక అంశాలలో దృఢనిశ్చయంతో వ్యవహరించిన మానవతావాది. కోట్లాది మంది ప్రజల హృదయాలలో పోప్ ఫ్రాన్సిస్ కరుణ, వినయం ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా నిలి చిపోతారని ప్రధాని నరేంద్ర మోదీ సంతాప సందేశంలోపేర్కొన్నారు. ఏసుక్రీస్తు ఆశయాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకున్న ధన్యజీవి అని ఆయనకీర్తించారు. సమగ్రాభివృద్ధి పట్ల పోప్‌కి ఉన్న నిబద్ధత ప్రశంసనీయ మని శ్లాఘించారు. భారత ప్రజల పట్ల పోప్ చూపిన ప్రేమ ఆప్యాయతలు మరువలేనివని ప్రధాని విశ్లేషించారు.

అవినీతికి పాల్పడే వారికి చివరకు మిగిలేది ఆవేదనా, అవమానాలే.



సి.సిమ్మన్స్

తక్కువ తెలుసుకోవడం, ఎక్కువ అర్థం చేసుకోవడం మనకు చాలా అవసరం.



మహాత్మాగాంధీ

# వంతెన నిర్మాణాలకి ముహూర్తమెప్పుడు?

**ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు. ఇలా రాష్ట్రాల్లో ఆర్అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే వండుటాకులా విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీ వర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.**



మేకిరి దామోదర్

మన రాష్ట్రంలో ఈ నెల 3న, మొన్న ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో గంటన్నరపాటు దంచి కొట్టిన భారీ వర్షంతో జనజీవనం అతలాకుతలమై స్తంభించింది. పండ్ల తోటలు, యాసంగి వరి,మొక్కజొన్న పంటలు రైతులు నష్టపోయారు. వేరు వేరు ఘటనల్లో మరణాలు సంభవించాయి. పలుచోట్ల చెట్లు కూలాయి, విద్యుత్ స్తంభాలు విరిగాయి. రోడ్లు వరద నీటితో వాగులను తలపించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మురుగు నీరు కాల్వలు పొంగిపొర్లి ఇళ్లల్లోకి చేరింది. ఇప్పుడే ఇలా ఉంటే? రాబోయే వానాకాలాన్ని తలుచుకుంటే భయమేస్తోంది!. ఇది హెచ్చరికగా భావించి 'చేతులు కాలాక ఆకులు పట్టుకొని' లాభంలేదు. ప్రభుత్వం, అధికారయంత్రం ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలి. వర్షాల వల్ల నగరంలోని నాలల్లో వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లడానికి ఏటా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపడుతుంటారు. వీటి కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఏటా సగటున రూ. 50 కోట్లు వెచ్చిస్తారు. ఈ లెక్కన గత నాలుగేళ్లలో 200 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతగా ప్రజాధనం వ్యయవుతున్నా!. వరద నీటి వ్యవస్థ ఆశించినట్లుగా మెరుగుపడడం లేదు. నగరంలో ఈ నెల 3న, మొన్న సాయంత్రం కురిసిన వర్షంతో తేటతెల్లమైంది. ఆ రోజు ఏకంగా 151ప్రాంతాల్లో రోడ్లపై వరద ఉధృతంగా పారింది. బైక్‌లు,కార్లు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వైపు పరుగులు పెట్టారు. అర్ధరాత్రి దాటింతే వరకు ఇళ్లల్లోకి చేరుకోలేకపోయారు. ఈ పాటి వర్షానికే ఈ దుస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తుంది. వర్షం కురిస్తే జీహెచ్ఎంసీ అధికారులకు పండుగే. రోడ్లపై నిలిచే నీటిని తోడేందుకు అత్యవసర పేరిట పనులు చేపట్టి, తర్వాత బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పైగా నీటి వివరాలను బహిర్గతం చేయడం లేదు. పూడికతీత పనుల్లోనూ ఇష్టానుసారంగా నిధులు ఖర్చు (స్వాహా)చేస్తున్నారని, తోడిన మట్టిని ఎక్కువ చేసి చూపిస్తున్నట్లు విమర్శలున్నాయి. తప్పుడు లెక్కలు ఉంటున్నాయని ప్రజాప్రతిని సైతం ఆరోపిస్తున్నారు.ప్రస్తుత ఏడాది కోసం ఇటీవల 203 పూడికతీత పనుల టెండర్లను పిలిచారు. వాటిలో 9 టెండర్ల దశలో, 97 మొబిలైజేషన్ దశలో, 97 కొనసాగుతున్న దశలో ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తేదారులు దాదాపు 30శాతం తక్కువ ధరలకు ఈటెండర్లను దక్కించుకుంటున్నారంటే? ఇందులోని మతలబు అర్థం చేసుకోవచ్చు!. వరద పారేందుకు నాలాల సామర్థ్యం సరిపోవడం లేదనీ దీనికి పరిష్కారంగా భూగర్భంలో ట్యాంకులను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించగా 2024-25 సంవత్సరానికిగాను రూ.15 కోట్లతో 22 పనులను మంజూరు చేశారు.



వర్షాల సమయంలో దిగువ ప్రాంతాలుముంపునకు గురికాకుండా నాలాల్లో ప్రవేశిస్తున్న వరద నీటిని ఈ భూగర్భ ట్యాంకులోకి మళ్లిస్తారు. వర్షం తగ్గాక మోటార్లతో ఎత్తి పోస్తారు. ఇలాంటివి ఖైరతాబాద్ వద్ద రూ. 3.08 కోట్లతో రెండింటిని,(4లక్ష లీటర్ల, 3లక్షల లీటర్ల సామర్థ్యం) నిర్మిస్తున్నారు. అలాగే పీవీఎన్ఆర్ ఫిల్లర్ 254, లంగర్ హౌస్, రాంనగర్, ఇమేజ్ ఆసుపత్రి, రంగమహల్, కేపిహెచ్‌బీ, సచివాలయం, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, రాజేంద్ర నగర్లోనూ నిర్మిస్తున్నారు. ఇవి ఏమేరకు ఫలితాలు ఇస్తాయనేది తేలాల్సి ఉంది. అయితే భూగర్భ ట్యాంకుల నిర్మాణం కంటే, నాలాల సామర్థ్యం పెంచుకోవడం మంచిదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మన మహానగరంలో నాలాల పొడవు 1,300 కి.మీ భూగర్భంలో ఉన్నవి 910 కి.మీ ఓపెన్ నాలాలు 390 కి.మీ హైదరాబాద్ మహానగరంతో పాటు, వరంగల్ లాంటి చోట మురునీటి నాలాల పరిస్థితి ఇలానే దుర్భరంగా ఉంది?. మన రాష్ట్రంలో రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు వంతెనలనిర్మాణ పనులు కొన్నేళ్లుగా అర్థాంతరంగా ఆగిపోయాయి. గతేడాది, అంతకు ముందు కురిసిన భారీ వర్షాలకు పలు వంతెనలు, రోడ్లు పిచ్చుక గూళ్లలా కొట్టుకుపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసివదిలేశారు.మళ్లీ భారీవర్షాలు కురిస్తే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న వాటితోపాటు కొత్తగా నిర్మించాల్సిన హైలెవెల్ వంతెనలు 193 ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు రూ. 843 కోట్లకు పైగా అవసరమని అధికారులు గతంలో అంచనా వేశారు. కొన్నిచోట్ల టెండర్ల ప్రక్రియ పూర్తయిన బిల్లులు వస్తాయో లేదో అనిపనులు ప్రారంభించడానికి గుత్తేదారులు వెనకాడుతున్నారు. మరికొన్ని చోట్లపనులను ప్రారంభించినా బిల్లులు రాలేదని మధ్యలోనే వదిలేశారు.మరోవైపు ప్రస్తుతం నిర్మాణ సామాగ్రి ధరలు బాగా పెరిగాయి, ఎప్పుడో పిలిచిన టెండర్లధరలతో ఇప్పుడు పనులు చేయలేమంటూ గిట్టుబాటు కావడం లేదంటూ గుత్తేదారులు ఆసక్తి కనబరచడం లేదు.వంతెననిర్మాణం పూర్తికాక ఏటావర్షాకాలంలో వాగులు పొంగి పొర్లినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోయి స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వరదలు పోటెత్తినప్పుడు వాగుల్లో కొట్టుకుపోయి ప్రాణాలుపోయిన ఘటనలూ చోటు చేసుకున్నాయి.ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు.ఇలా రాష్ట్రాల్లో ఆర్అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే పండుటాకుల విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీవర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులుచేపట్టాల్సిన అవసరం ఉంది. ●

# పరువు హత్యలా! దురహంకార నిదర్శనమా?

జి. అజయ్ కుమార్

వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారన్న కారణంతో కొన్ని చోట్ల కూతుర్ని, మరికొన్ని చోట్ల ఆమె ప్రేమించినవాడిని బలితీసుకుంటున్న అమానుష దృశ్యాలు మన చుట్టూ నిత్యకృత్యంలా మారాయి. చిన్నతనం నుంచి ఎంతో అల్లారు ముద్దుగా పెంచిన తమ పిల్లలని ఎదిగిన తరువాత తన ఇష్టానుసారం నచ్చిన వాడిని ప్రేమించి పెళ్లి చూసుకోవడం నేరంగా చూస్తున్న కొంత మంది తల్లిదండ్రులు పరువు అనే భ్రమలో విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు. పరువు హత్యలు అనే ముసుగులో కన్న వారిని క్రూరంగా చంపుకుంటున్నారు. ఇది పరువు కోసం కాదు, కుల దురహంకారపు ఆకృత్యం. తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పరువు హత్యల పేరిట జరుగుతున్న దురహంకార హత్యలు - ఇది ప్రేమ మీద మాత్రమే దాడి కాదు, కులం, మతం, మనిషి మనుగడ మీద దాడి. మిర్యాలగూడలో ప్రణయ్, సూర్యాపేటలో కృష్ణా కేసులు మీడియా లోకానికి తెలిసినవే. కానీ ప్రతి రోజు ఇలాంటివి ఎన్నో సమాజంలో జరుగుతున్నాయి. అలాంటి వాటిల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మావత్వానికి మాయని మచ్చగా, కుల, మతోన్మాదానికి పరాకాష్టగా మారాయి. అనంతపురం జిల్లాలో తండ్రి, తన కూతురు వేరే కులం వాడిని ప్రేమించిందనే కారణంతో దారుణంగా హత్య చేయడం, హయత్ నగర్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చెల్లెలు కులాంతర వివాహం చేసుకుందని నడిరోడ్డుపై తమ్ముడు నరికిచంపడం, చిత్తూరు జిల్లాలో ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్న యువతి అనుమానాస్పద మృతి, ఇలాంటివి ఎన్నో ఇటీవల కాలంలో మానవ సంబంధాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రక్త సంబంధికులే రాక్షసుల్లా ప్రవర్తిస్తున్న సంఘటనలు నానాటికి పెరుగుతున్నాయి. వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారని కన్నపిల్లలని చంపడం పరువా? కాదు మానవత్వానికి మాయని మచ్చ, ఆటవిక క్రూరత్వానికి పరాకాష్ట. అది గౌరవం కాదు. అది ఓ క్రూరమైన అహంకారపు చీకటి కోణం,ఇలాంటి చర్యల వలన పరువు పెరగటం కాదు వున్న పరువు పోయి జీవితాంతం నేరస్థుడిగా మిగిలి కుటుంబాలకు క్షోభను మిగిలించడం తప్ప ఏమి ఉపయోగంఉండదు. వివాహం లేదా ప్రేమ సంబంధం కులాంతరంగా, మతాంతరంగా ఉంటే అది 'ఇంటి పరువు' 'కుటుంబ గౌరవానికి' భంగం అని భావించి కుటుంబ సభ్యులే హత్యకు దిగే పరిస్థితులు ఎదురవుతున్నాయి.యువత సాంప్రదాయాలుపాటించకుండా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించినా, స్వేచ్ఛగా జీవించాలనుకున్నా పెద్దలు దాన్ని సహించలేక ఘోర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి. అమ్మాయి తనకు ఇష్టమైన వ్యక్తిని ప్రేమించడం, వివాహం చేసుకోవాలనుకోవడం వంటి విషయాలు కొన్ని కుటుంబాల్లో తట్టుకోలేరు. వారుతీసుకునే నిర్ణయాన్ని అవమానంగా' భావించి హత్యలు చేస్తున్నారు 'మీ ఇంటి పిల్ల పరువు తక్కువ పనిచేసింది?' అన్న మాటలు వింటే తట్టుకోలేమనే భయం. తాతలు, పినతండ్రులు, బంధువుల మాటలవల్ల కుటుంబ పెద్దల గౌరవాన్ని కాపాడుకోవాలనే మానసిక స్థితిలోహింసకు పాల్పడుతున్నారు. పెద్దలు,కుటుంబ సభ్యులు పిల్లలమానసిక స్థితిని, ప్రేమను, అభిప్రాయాలను ఆలోచనలను అర్థం చేసుకోలేకపోవడం. హత్యశిక్షార్హ నేరం. ఇలాంటి వాటికి తీవ్రమైన శిక్షలుంటాయి కానీ సమాజంలో మనుషుల ఆలోచనా ధోరణి మారనంత కాలం ఎన్నిచట్టాలు వున్నా ఉపయోగంలేదు. కుటుంబాలలో, పాఠశాలల్లో, గ్రామ స్థాయిలో ప్రేమ, సంబంధాలు, వివాహ స్వేచ్ఛ,వ్యక్తిగత హక్కులపై అవగాహన కల్పించాలి. 'పరువు'అన్నది ప్రాణాల కంటే పెద్దదికాదని తెలియ చేయాలి. పరువు హత్యలకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి.



అతిత్వరగా విచారణలు జరిపి శిక్షలు అమలుచేయాలి.దోషులెవ్వరైనా క్షమించరాదని న్యాయవ్యవస్థ స్పష్టంగా చాటాలి. తల్లిదండ్రులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం. పిల్లలపై పట్టుకాదు, ప్రేమతో బంధం అవసరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.తల్లిదండ్రులు పిల్లల అభిప్రాయాలను వినే పరిస్థితిని కల్పించాలి. ప్రేమ,వయసు, అర్థం చేసుకోవడం, సంయమనం అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. సంబంధాల్లోస్పష్టత, బాధ్యత అనే భావనలు నేర్పాలి. అమ్మాయిలకు స్వేచ్ఛ, విద్య, ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారు తమ నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండాలి. కుల సంఘాలు, మతనాయకులు ప్రగతిశీలమైన సందేశాలు ఇచ్చేలా ఒత్తిడి తేవాలి. మతాల పేరుతో హింసను ప్రేరేపించే కార్యక్రమాలు నియంత్రించాలి. బాధితులను పరువు కోసం ప్రాణాలు తీసే సమాజం కన్నా ప్రేమ కోసం ప్రాణాలు కాపాడే సమాజమే అవసరం. కులం,మతం కంటే ముందు మనమంతా మనుషులం అని గుర్తుంచుకోవాలి. ●

# ప్రజావాక్కు



## వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీవిరమణ తర్వాత సిజిహెచ్ఎస్ పథకం ఆరోగ్య సేవలకు ఉంది. ఈ పథకం తోఉన్న ప్రస్తుత కేంద్రాలకు అద్దెభవనాలు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలు వారి సొంతఅవసరాలకు వీరుఅద్దెకు ఇవ్వలేరు.వైద్యులకు,లబ్ధిదారులకు తగినవసతి,కనీస సదుపాయాలులేవు.వైద్యుల కొరత,పరిమిత కేంద్రాల వల్ల ఎన్నో సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర కేంద్రాల్లో ఉన్నత అధికార్లు ఉండడంవల్ల వైద్యాధికారుల సమస్యలు వారికి విన్నవించడం తప్ప నిర్ణయం, మార్పులు చేసే అవకాశం లేదు. సంక్షేమ సంఘంవీటిని కేంద్ర అధికారులకు చేసిన ఫిర్యాదులు ఎన్నో అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ పథకం ఉచితంకాదు.దీన్ని ఏ ఇతరపథకాలతో అనుసంధానం మేలు కాదని, దీన్నే అభివృద్ధి చేస్తే ఎంతో మేలు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేయుచున్న ఉద్యోగ వికలాంగులకు ప్రమోషన్‌లలో 5 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా కల్పించాలి.ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు వర్తించే చట్టాలను ఉద్యోగ వికలాంగులకు కూడా తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్‌లలో ఉద్యోగ వికలాంగులకు వారికి అనుకూలమైన ప్రదేశాలలో విధులు నిర్వహించే విధంగా తగిన ప్రాధాన్యత కల్పించాలి. ఉద్యోగ వికలాంగులకు ఇంటి నుండి ఆఫీసుకు వెళ్లే సమయంలో ఆర్టీసీబస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. రాష్ట్రంలోని ప్రతి విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయడం వలన ఎంతోమంది మేలు కలుగుతుంది.

- డాక్టర్. ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు మానసిక వత్తిడికి లోనవుతున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి. ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించాలి.పుస్తకాల బరువుతగ్గించాలి. ఫీజులను నియంత్రించాలి. శారీరక శిక్షలు నిషేధించాలి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశంలోనే విద్యాబోధన చేయాలి. ఆట పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- పి. నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## అవగాహన సదస్సులు నిర్వహించాలి

తెలంగాణలో ధరణి రద్దుచేసి భూభారతి యాప్‌లో భూ సమస్య లేకుండా చేసుకోటానికి ప్రజలలో రైతులకు అవగాహనా సదస్సులునిర్వహించడం, అధికారులను నాయకులను అభినందనలు కానీ గతంలో రైతు భూమిని వారస్వతంగా రావాల్సినది తండ్రి చనిపోయిన తర్వాత కుమారులకు ఖర్చు లేకుండా ఆటోమెటిగా అయేది నేడు ధరణిలో భూభారతి లోనైనా స్లాట్ బుక్ చేసుకుంటే మాత్రమే అవుతాది. ఇది ప్రభుత్వానికి మీసేవలకు ఆదాయమార్గం అవుతుంది. దేశంలో సైనికుడే రక్షకుడు రైతే లేకపోతే తిండి దొరుకాదు అందుకే రైతే రాజు కానీ రాయితీతో రైతుకూలీలకు తండ్రితదనంతరం భూమిని వారస్వతంగా స్లాట్ బుకింగ్ లేకుండా తక్షణమే కుమారుని పేరున భూమిని పట్టా చేసియివ్వాలి. రైతులను ప్రభుత్వ కార్యాలయం మీసేవ చుట్టూ ప్రదక్షిణ చేయకుండా చేసియివ్వాలి. భూమిని క్రయవిక్రయానికి స్లాట్‌బుకింగ్ పెట్టుకొని ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంచుకోవచ్చు.

- సింగు. లక్ష్మీనారాయణ జయశంకర్ భూపాలపల్లి

## తెలుగు మాధ్యమంలో వైద్యకోర్సులు

తెలుగు మాధ్యమాల్లో బైపీసీ ఎంపీసీ పూర్తి చేసి ఇంజినీరింగ్ లోవైద్యచదువుల్లో ఇంగ్లీషు మాధ్యమం చదివేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ తెలుగులోనే ఇంజనీరింగ్ మెడికల్ కోర్సులు అందించాలన్న ఈ ప్రయత్నం నిజంగా చాలా కొనియాడ తగినది.ఆయా సబ్జెక్టుల లో మంచి పట్టువున్న విద్యార్థులు ఆంగ్లంలో రాయడం అర్థం చేసుకోవడం కొంత ఇబ్బంది పడుతున్నారన్నది సత్యం. ఏది ఏమైనా కాన్సెప్ట్ అర్థం చేసుకోవడం ముందు ముఖ్యం. అది తెలుగులో బోధించుట ద్వారా కొంత కాన్సెప్ట్ మీద పట్టు వచ్చి ఏ విధమైన మెలికలు గల ప్రశ్న వేసినా రాయగల సమర్థత విద్యార్థికి వస్తుంది. ఎన్నో మంచి యూ ట్యూబ్ చానెల్స్ ఈ పాఠ్యంశాలలను తెలుగులో బోధించుట చూస్తున్నాం.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## పాల కల్తీని అరికట్టాలి

దేశవ్యాప్తంగా లభించే పాలలో 68 శాతం కల్తీవేనని ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ సర్వే తేల్చి చెప్పింది. కల్తీ పాల వల్ల క్యాన్సర్లు, జీర్ణాశయ సమస్యలు, పిల్లల్లో వినికిడి, దృష్టిలోపాలు తలెత్తవచ్చు. అధికారులు పాలకల్తీని అరికట్టాలి.

-ఎన్.సాయిరాజు, నల్గొండజిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# ధరిత్రీ రక్షణకు శపథం చేద్దాం

రామ కిష్టయ్య సంగన భట్ల

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచ భూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింపబడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపుకుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రీ దినోత్సవం. 1969 లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈ ధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలో ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగామనిషి






చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయు కాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పదిలంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించుకోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించగలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ల, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతోపాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ●

# యెమెన్ యుద్ధ రహస్యాలు లీక్

## రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌పై దుమారం



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికాకు చెందిన కీలక రహస్యాలు లీకయినట్లు తెలుస్తోంది. యెమెన్ పై చేపట్టిన భీకరదాడులకు ముందే దీనికి సంబంధించిన ప్రణాళిక బహిర్గతం అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే దీనికి సంబంధించి తాజాగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దాడులకు సంబంధించిన రహస్యాలను స్వయంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తన కుటుంబసభ్యులతో కూడా పంచుకున్నారని బయటకు పొక్కింది. తన ప్యామిలీ గ్రూప్‌చాట్‌లో దీని గురించి వర్ణించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 15న యెమెన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాడులను ప్రకటించారు. అయితే, అంతకంటే ముందే సిగ్నల్‌లోని ఓ గ్రూప్‌చాట్ ద్వారా ఈ యుద్ధ ప్రణాళిక బయటికి వచ్చినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అదే సమయంలో రక్షణ మంత్రి హెగ్సెత్ కూడా రెండో సిగ్నల్ చాట్‌ను ఉపయోగించి ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఆంగ్లమీడియాలో కథనాలు వచ్చాయి. తన భార్య జెన్నిఫర్, సోదరుడు ఫిల్ హెగ్సెత్‌తో ఈ యుద్ధ ప్రణాళికలను పంచుకున్నట్లు వెల్లడించింది. హెగ్సెత్ భార్య ఫాక్స్ న్యూస్‌లో మాజీ ప్రొడ్యూసర్ కాగా..ఇక సోదరుడు హోంల్యాండ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు హెగ్సెత్..ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇతర ముఖ్య అధికారులు ఉన్న సిగ్నల్ గ్రూప్ చాట్ నుంచి ఈ యుద్ధ ప్రణాళికలు బహిర్గతమయ్యాయి. ఈ చాట్‌లో ద అట్లాంటిక్ మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ జెఫ్రీ గోల్డ్‌బర్గ్ కూడా ఉన్నారు. యెమెన్‌పై దాడుల గురించి చర్చించడానికి రెండురోజుల ముందే తనను ఆ గ్రూప్‌లో చేర్చాలని జెఫ్రీ కోరారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ కూడా ధ్రువీకరించింది. ఈ లీక్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని హెగ్సెత్, ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న వేళ మరో కథనం వెలువడటం మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో రక్షణ మం త్రిని తొలగించాలని ప్రతిపక్ష డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, తాజా కథనాలపై పెంటగాన్, వైట్‌హౌస్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. హెగ్సెత్‌పై గతంలోనూ ఇలాంటి విమర్శలు వచ్చాయి. రక్షణ శాఖకు సంబంధించిన అధికారిక, రహస్య సమావేశాలకు భార్య, సోదరుడిని వెంటబెట్టుకునే వెళ్లేవారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. మరోవైపు, యెమెన్ రాజధాని సనాలో సోమవారం తెల్లవారుజామున అమెరికా వైమానిక దాడులు చేపట్టింది. ఇందులో కనీసం 12 మంది మరణించగా, మరో 30 మంది గాయపడినట్లు హౌతీరెబల్స్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.



అంతరిక్షంలో స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు



ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

## అంతరిక్షంలో రెండవ డాకింగ్ ప్రక్రియ ప్రారంభం

**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలు అనుసంధానం ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. శ్రీహరికోట నుంచి గతంలో ప్రయోగించిన రెండు జంట ఉపగ్రహాలను ఒక్కచోటికి చేర్చి మళ్లీ వాటిని విడిపోయేలా చేయడమనే డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియను మొదటి దశలో పూర్తి చేశారు. ప్రస్తుతం రెండవ డాకింగ్ కార్యక్రమాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టారు. భూకేంద్రం నుంచి ఈ జంట ఉపగ్రహాలను ఒక్క చోటికి చేర్చే ప్రక్రియలో భాగంగా ఏప్రిల్‌లో పరిశోధన ఉంటుందని గతంలోనే చెప్పి ఉన్నారు. ఆ మేరకు డాకింగ్ తర్వాత విద్యుత్ బదిలీ కూడా విజయవంతంగా జరిపి మరోసారి శాస్త్రవేత్తలు విజయవంతం కావడానికి కృషి చేశారు. దీనిపై ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ స్పందిస్తూ స్పేడెక్స్ యొక్క రెండవ డాకింగ్ కార్యక్రమం సున్నితమైనదిగా అభివర్ణించారు. ఇస్రో బృందాలు దీన్ని సమర్థవంతంగా తేలికగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతరిక్షంలో స్పేస్‌స్టేషన్ భారత్ స్వయంగా ఏర్పాటు చేసుకోవడానికి ముందుగా ఇటువంటి డాకింగ్, అన్‌డాకింగ్ పరిశోధనలు విస్తృతంగా జరపాల్సి ఉంది.

# అమెరికాను దెబ్బతీస్తే సహించను

## ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక!



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా వాణిజ్యం విషయంలో అత్యంత కఠిన వైఖరిని అవలంబిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు మరో హెచ్చరిక జారీచేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలు కాకుండా ఇతర రూపంలో అమెరికాను దెబ్బతీసే ఎనిమిది అంశాలను వెల్లడించి ఏదైనా దేశంవాటిని అనుసరిస్తున్నట్లు బయటపడితే తమ దేశంతో సంబంధాలు దెబ్బతింటాయన్నారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌సోషల్‌లో పోస్టుచేశారు. ఇప్పటికే ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించి ఒక్క చైనా మినహా మిగిలిన వాటికి 90రోజుల ఉపశమనం కల్పించిన విషయం విదితమే.

**ఏమిటా జాబితా ?, కరెన్సీ మేనిప్యులేషన్ :** చాలా దేశాలు తమ వస్తువులను అంతర్జాతీయ మార్కెట్‌లో చౌకగా విక్రయించేందుకు కరెన్సీ విలువలను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తాయి. గతంలో అమెరికా ఇలాంటి దేశాల జాబితాలను కూడా తయారుచేసింది.

**వాల్యూయాడెడ్ ట్యాక్స్ (వ్యాట్):** కొన్ని దేశాల ఉత్పత్తులపై వ్యాట్ విధిస్తాయి. కానీ, దిగుమతులపై వాటిని కొనసాగించినా.. ఎగుమతులపై ఆ సొమ్మును రీఫండ్ చేస్తుంటాయి. అలాంటి చర్యలు సహించమన్నారు. తక్కువ రేటుకు డంపింగ్ చేయడాన్ని కూడా ట్రంప్ తీవ్రంగా పరగణించారు. చైనా వంటి భారీ ఉత్పాదక దేశాలు.. కారు చౌకగా వస్తువులు తయారుచేసి ఇతర దేశాల్లో డంపింగ్ చేస్తాయి. దీంతో ఆయా దేశాల్లో స్థానిక పరిశ్రమలు మూతపడతాయి. ఎగుమతులపై ప్రభుత్వాలురాయితీలు ఇవ్వడాన్ని కూడా ట్రంప్ తప్పు పట్టారు. వ్యవసాయ రంగంలో దేశీయ రైతుల కోసం రక్షణాత్మక రాయితీలు కూడా ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఇవి కాకుండా నకిలీల తయారీ, మేధో హక్కుల అపహరణ, అమెరికా టారిఫ్‌లను తప్పించుకోవడానికి మరో దేశం నుంచి ఎగుమతి చేయడం వంటివి కూడా ఉపేక్షించమన్నారు.

ఇక ప్రత్యేకంగా జపాన్ నిర్వహించే ఓ పరీక్షను కూడా ట్రంప్ తప్పు పట్టారు. దేశీయ సంస్థలను కాపాడేందుకు రక్షణాత్మక సాంకేతిక ప్రమాణాలను ఏర్పాటు చేయకూడదన్నారు. దీనికి గాను జపాన్ నిర్వహించే బౌలింగ్ బాల్ టెస్ట్‌ను ఉదహరించారు. ఈ పరీక్షను జపాన్ 2018లో ప్రవేశపెట్టింది. విదేశీ కార్లు తమ దేశంలో విక్రయించకుండా చూసేందుకు దీనిని మొదలుపెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరీక్షలు దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి బౌలింగ్ బాల్‌ను కారు హుడ్‌పై వదులుతారు. అప్పుడు దానికి సొట్ట (డెంట్) పడకపోతే అది పరీక్షలో విజయం సాధించినట్లు భావిస్తారు. ఇదో భయంకరమైన పరీక్షగా ట్రంప్ అభివర్ణించారు. ఇప్పటికే ట్రంప్ తాను విధించిన ప్రతీకార సుంకాలపై 90 రోజులు నిలుపుదలను అమలు చేస్తున్నారు. కానీ, చైనాతో టారిఫ్‌ల యుద్ధం తారా స్థాయికి చేరింది. ఆ దేశంపై మొత్తం 243 శాతంవరకు పన్నులు వసూలు చేయాలని అమెరికా నిర్ణయించింది.

# పోలీసుల ముందు హాజరుకావాలి

## పూజా ఖేద్కర్‌కు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం సంపాదించిన వ్యవహారంలో ఆ మధ్య మాజీ ప్రొబేషనరీ ఐఎఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ పేరు మీడియాలో చక్కర్లు కొట్టింది. ఆమెపై యూపీఎస్సీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం మే 2న ఢిల్లీ పోలీసుల ముందు విచారణకు హాజరుకావాలని ఖేద్కర్‌ను ఆదేశించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సోమవారం ఆర్డర్ వేసింది. కేసు తదుపరి విచారణను మే 21 కి వాయిదా వేసింది. అయితే అప్పటివరకు ఖేద్కర్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు పేర్కొంది. ఈ కేసులో కచ్చితమైన విచారణ జరగలేదన్న అత్యున్నత న్యాయస్థానం విచారణ త్వరగా ముగించాలని పోలీసులను ఆదేశించింది. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఖేద్కర్‌ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే కోర్టు ఆమెకు మధ్యంతర రక్షణ కల్పించింది. పుణెలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేద్కర్‌పై అధికార దుర్వినియోగంతోపాటు, యూపీఎస్సీలో తప్పుడు పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది.

నకిలీ పత్రాలతో పరీ క్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు లిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయ డంతోపాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దాంతో పూజా ఖేద్కర్ హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీ కి తనపై అనర్హతవేటువేసే అధికారం లేదని వాదించారు. అయినా ఆమెకు నిరాశే ఎదురైంది. గత ఏడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. కోర్టు దాన్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వస్తోంది.

# రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** కేంద్రం ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆ వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందనడంతో పాటు అందులో పలు లోపాలున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ, బోస్టన్‌లోని ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అమెరికా భారత్ సంబంధాలను గురించి కూడా ప్రస్తావించారు. ఇరుదేశాలు కలిసి పనిచేయాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం రాజీ పడింది. ఆ వ్యవస్థలో చాలా లోపాలు ఉన్నాయని మాకు స్పష్టంగా తెలుసు. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు మాట్లాడాను. ఇటీవల మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి. అక్కడ సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7:30 గంటల మధ్య దాదాపు 65 లక్షల మంది ఓటు వేశారు. ఈ విషయాన్ని స్వయంగా ఎన్నికల సంఘమే మాతో చెప్పింది. ఇది భౌతికంగా అసాధ్యమైంది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి దాదాపు 3నిమిషాల సమయం పడుతుంది. అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేస్తారు. మేము వీడియోలు చూపించాలని అడిగితే ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగటానికి వీలు లేదంటూ చట్టంలో కూడా మార్పుల చేశారు. రాహుల్ మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘంపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆయన భారతీయ ఓటర్ల నమ్మకాన్ని పొందలేకపోయారని విమర్శించింది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్యానికి, భారతదేశానికి వ్యతిరేకి అయిన రాహుల్ గాంధీ దేశీయ ఓటర్ల నమ్మకాన్ని గెలవలేకపోయారని దుయ్యబట్టారు. ఇప్పుడు విదేశీ గడ్డపై మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రశ్నించడం ప్రారంభించారని భండారీ విమర్శించారు. విదేశాల్లో భారత పరువును పదే పదే ఎందుకు తీస్తారని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. పార్టీ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా స్పందిస్తూ, అమెరికాలో భారతీయ సంస్థలను, న్యాయస్థానాలను కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు.



# పశ్చిమబెంగాల్ గవర్నర్‌కు అస్వస్థత

**కోల్‌కత్తా, ఏప్రిల్ 21:** పశ్చిమబెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్ ఛాతీలో నొప్పితో ఆస్పత్రి పాలయ్యారు. సోమవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆయనను హుటాహుటిన కోల్‌కతాలోని కమాండ్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు. గవర్నర్‌కు ప్రాథమిక పరీక్షలు చేశామని, ఆయన గుండెలో బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని కమాండ్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను కలిశారు. గవర్నర్‌ను కలిసి ఆస్పత్రి బయటికి వచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పుడే గవర్నర్‌ను చూసి వచ్చానని, ఆయనకు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఆదేశించానని చెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను కమాండ్ ఆస్పత్రి నుంచి అపోలో ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అయితే గవర్నర్‌కు అస్వస్థతపై రాజ్‌భవన్ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కాగా గవర్నర్ ఆరోగ్యానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# బైక్ అదుపుతప్పి మహిళ మృతి

**లక్నో, ఏప్రిల్ 21:** వాహనాల తనిఖీ సందర్భంగా ఒక పోలీస్ అధికారి లాఠీతో బైక్‌పై కొట్టాడు. బైక్ అదుపుతప్పడంతో భర్త వెనుక కూర్చొన్న మహిళ రోడ్డుపై పడింది. ఆమె మీద నుంచి డంపర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో స్థానికులు రోడ్డును బ్లాక్ చేసి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ఎస్ఐపై కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి వేళ కళ్యాణ్‌పూర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ తన భార్య అమరావతితో కలిసి బైక్‌పై పెళ్లి వేడుకకు బయలుదేరాడు. కాగా, నిగోహి ప్రాంతంలోని ధూలియా మలుపు దగ్గర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రిషిపాల్ లాఠీతో ప్రదీప్ బైక్‌పై కొట్టాడు. దీంతో అతడు బ్యాలెన్స్ కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బైక్ వెనుక కూర్చొన్న ప్రదీప్ భార్య అమరావతి రోడ్డుపై పడింది. అదే సమయంలో డంపర్ లారీ ఆమె పైనుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. మరోవైపు స్థానికులు ఇది చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ మృతికి కారణమైన ఎస్ఐ రిషిపాల్‌పై మండిపడ్డారు. తెల్లవారుజామున 2 గంటల వరకు రహదారిని బ్లాక్ చేసి నిరసన తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే సలోనా కుష్వాహా కూడా అక్కడకు చేరుకుని ఎస్ఐ తీరును నిల దీశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ రిషిపాల్‌తోపాటు డంపర్ లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్ధివినాయక ఆలయంలో మస్క్ తల్లి ప్రత్యేక పూజలు



**ముంబయి, ఏప్రిల్ 21:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తల్లి మయే మస్క్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖనటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తో కలిసి ముంబైలోని ప్రముఖ సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మరోవైపు మయే మస్క్ తన 77వ పుట్టినరోజును భారత్‌లో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ముంబైలో ఘనంగా పార్టీ అరేంజ్ చేశారు. ఈపార్టీకి 40నుంచి 50మంది హాజరైనట్లు ముంబై మీడియా తెలిపింది. ఇక తన బర్త్‌డే సందర్భంగా మయే మస్క్ ప్రముఖ డిజైనర్ సబ్యసాచి రూపొందించిన దుస్తుల్లో మెరిసిపోయారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న తల్లికి టెక్ టైకూన్ మస్క్ ఫ్రైజింగ్ గిఫ్ట్ పంపారు. అందమైన పూలను తన తల్లికి బర్త్‌డే కానుకగా అందించారు. ఈ విషయాన్ని మయే మస్క్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



# తదుపరి పోప్ ఎవరు?

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** పీపుల్స్ పోప్‌గా ప్రసిద్ధిగాంచిన ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయాన్ని కార్డినల్ కెవిన్ ఫారెల్ వాటికన్ టెలిగ్రామ్ ఛానెల్‌లో ప్రకటించారు. దీంతో తదుపరి పోప్ ఎవరన్న అంశంపై చర్చ మొదలైంది. 2025 జనవరిలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన నిబంధనలను నిర్ణయించారు. కేవలం 80 లోపు వయసు ఉన్న కార్డినల్స్ మాత్రమే పోప్ ఎంపిక రహస్య ఓటింగ్‌లో పాల్గొననున్నారు. దీంతో మొత్తం 252 కార్డినల్స్‌లో 138 మందికి మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. దీనికి సంబంధించిన ఓటింగ్ సిస్టీన్ ఛాపెల్‌లో నిర్వహించనున్నారు. ఇది పూర్తిగా రహస్య విధానంలో జరుగుతోంది. ఓటింగ్‌లో పాల్గొనే ప్రతి కార్డినల్ ఓటింగ్ సమయంలో చర్చించిన అంశాలను రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. దీనిని ఉల్లంఘిస్తే బహిష్కరణ వేటు పడుతుంది. రోజువారీ నాలుగు రౌండ్ల చొప్పున ఎవరైనా ఒక అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ లభించే వరకు ఓటింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికల ప్రక్రియకు మొత్తం 15 నుంచి 20 రోజుల సమయం పట్టొచ్చు. కాకపోతే పోప్ జాన్‌పాల్-2 ఈ విధానంలో స్వల్పమార్పు చేసినట్లు చెబుతారు. తొలిరోజు ఎన్నికలో మాత్రమే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అదే 10-12 రోజుల వరకు మెజారిటీ నెం బరును ఎవరూసాధించలేకపోతే ఆ తర్వాత సాధారణ మెజారిటీ వచ్చిన వారు పోప్ వారసుడిగా ఎన్నికవుతారు. ఇక్కడొక ఆసక్తికర అంశం ఉంది. నిర్వహించిన ఎన్నికల్లో ఎవరూ విజయం సాధించకపోతే బ్యాలెట్ పత్రాలను నల్లటి పొగను విడుదల చేసే ప్రత్యేక రసాయనాలతో కాల్చేస్తారు. అదే కనుక తెల్లటి పొగవెలువడితే పోప్ ఎన్నికైనట్లు సంకేతం. ఇదంతా సిస్టీన్ ఛాపెల్‌లో జరుగుతుంది. ఫ్రాన్సిస్ వారసత్వం కోసం పోటీ పడుతున్న వారిలో వాటికన్ సిటీ విదేశాంగ మంత్రి కార్డినల్ పీట్రోపారోలిన్, ఐరోపా బిషప్స్ కాన్ఫరెన్స్ మాజీఅధ్యక్షుడు పీటర్ ఎర్డో, కార్డినల్ పీటర్ టురుక్సన్ (ఘనా), కార్డినల్ టూయిస్ టాగ్లే,కార్డినల్‌మాట్టో జూప్పీ, కార్డినల్ రేమాండ్ లియోబుర్కె పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

# కాల్పుల విరమణకు కట్టుబడిలేని రష్యా

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, ఏప్రిల్ 21:** ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని రష్యా ప్రకటించిందే కానీ ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈస్టర్ కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు తప్పుడు వైఖరిని రష్యా ప్రదర్శిస్తోందని విమర్శించారు. రష్యా ఎప్పటిలాగే తమపై దాడులు కొనసాగిస్తోందని, పదుల కొద్దీ డ్రోన్, బాంబు దాడులు చేసిందని తెలిపారు. మరోవైపు కీవ్ బలగాలు కూడా దాడులు చేశాయని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని అధికారులు ఆరోపించారు. తాత్కాలిక కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు రష్యా సైన్యం చెబుతోంది. కానీ యుద్ధక్షేత్రంలో పైచేయి సాధించేందుకు, మా దేశానికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ రష్యా వదులుకోవడం లేదు. 50కిపైగా బాంబు దాడులు, పదుల కొద్దీ డ్రోన్ దాడులు చేసింది. ఈ ఉదయం 10 గంటల నుంచి దాడుల తీవ్రత మరింత పెరిగింది. అయితే రష్యా వైమానిక దాడులకు సంబంధించి సైరన్‌లు మోగకపోవడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. పుతిన్‌కు తన సైన్యంపై పూర్తి నియంత్రణ లేదని, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తుంటే యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఆ దేశానికి లేదనేది స్పష్టమవుతోందని జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు. కాల్పుల విరమణ షరతులకు పూర్తిగా కట్టుబడి ఉండాలని ఆయన రష్యాను డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి 30రోజుల పాటు కాల్పుల విరమణను పొడిగించాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు తాము సిద్ధమేనని అమెరికా ప్రకటించిం. ఇదిలా ఉండగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ శాంతి ప్రతిపాదన వల్ల రష్యాఉక్రెయిన్‌ల మధ్య తక్షణ కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఉక్రెయిన్ సహా ఐరోపా యంత్రాంగాలు పరిశీలించాయి. క్రిమియాపై రష్యా నియంత్రణ కొనసాగడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు కష్టమైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించడం గమనార్హం.

# యుఎస్‌తో వాణిజ్య ఒప్పందంలో జాగ్రత్త: చైనా హెచ్చరిక



**బీజింగ్, ఏప్రిల్ 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి బయటపడేందుకు అనేక దేశాలు అగ్రరాజ్యంతో బిజీబిజీగా చర్చలు జరుపుతున్నాయి. అయితే, టారిఫ్‌ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని తన మిత్ర దేశాలకు ట్రంప్ సర్కారు షరతు పెట్టినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా బీజింగ్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నిటికీ అంగీకరించబోం. మా నుంచి ప్రతిస్పందన కూడా అదేస్థాయిలో ఉంటుంది. ఇతరుల ప్రయోజనాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం.. పులి చర్మంకోసం దాంతోనే డీల్ చేసుకోవడం లాంటిది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదు. స్వల్పకాలిక లాభాల కోసం వెళితే.. అది ఎప్పటికైనా మనకే హాని చేస్తుందన్న విషయాన్ని దేశాలు గుర్తుంచుకోవాలి. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు' అని చైనా తమ ప్రకటనలో హెచ్చరించింది.

# అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలి

## - రేర్ ఎర్త్స్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సులో వక్తల మనోగతం

**తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాత వార్త :** భూమి లోపల లభ్యమయ్యే అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. సైన్స్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది.ఇందుకు సంబంధించిన ప్రారంభ సభ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు.సుమారు 200 మంది దేశ,విదేశీ శాస్త్రవేత్తలు,యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు హాజరయ్యారు.పద్మావతి మహిళా యూనిర్సిటీ వీసి ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ.. భూమి లోపలి అరుదైన మూలకాలను వెలికి తీసే క్రమంలో వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా చూడాలని కోరారు. సేకరించిన అరుదైన మూలకాలను దేశ ప్రగతికి ఉపయోగపడేలా మార్చవలసిన బాధ్యత ఈ తరం శాస్త్రవేత్తలపై ఉందని గుర్తు చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు పద్మావతి యూనివర్సిటీ వేదిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు.ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూకంప్యూటర్స్ , కమ్యూనికేషన్ వ్యవస్థ,లేజర్ సిస్టం లో అరుదైన మూలకాల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రేర్ ఎర్త్స్ బాగా తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు.శాస్త్ర చికిత్సలు చేయడంలోనూ రేర్ ఎర్త్ కిరణాలు ఉపకరిస్తాయని అన్నారు.థాయిలాండ్ కు చెందిన నిఖోన్ పాథమ్ రాజ్ భట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాక్రపాంగ్ కియోఖో మాట్లాడుతూ యూరోపియం, నవేరియం, డెస్పోజియం, నియోడియం,ఎటర్బియం వంటి అరుదైన మూలకాలు సమాజాభివృద్ధికి బాగా ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. ఇండోనేషియా కు చెందిన బంధుంగ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ మిత్ర డి జమల్ మాట్లాడుతూ.. గడలోనియం తులియం హోల్మియం వంటి మూలకాలు అనేక రకాలుగా ఉపయోగపడతాయని చెప్పారు.

ప్రత్యేకించి రేర్ ఎర్త్స్ సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడంలో దోహదం చేస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ఎం ఎల్ పి రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్,అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్ . జాన్ [illegible] అధ్యాపకులు,పరిశోధకులు,వివిధ ప్రాంతాల ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# హుండీ లెక్కింపుల్లో రూ.3కోట్లు ఆదాయం


నిత్యాన్నదానానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు సోమవారం లెక్కించగా రు.3,02,92,986ల నగదు, 440 గ్రాముల బంగారం, 5కెజిల 225 గ్రాముల వెండి లభించినట్లు ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. పద్దెనిమిది రోజులకు గాను హుండీల్లో భక్తులు ఈ కానుకలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్వచ్ఛంధ సేవకులు, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది, వన్‌టౌన్‌పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు. - నిత్యాన్నదానానికి విరాళం:దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష 4వేల 893ల ను కృష్ణాజిల్లా కేసరపల్లికు చెందిన బి నీలిమ సోమవారం ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- స్వర్ణశిఖరం పనులకు విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే స్వర్ణశిఖరం పనలుకు రు.1లక్ష విరాళాన్ని సోమవారం విజయవాడకు చెందిన అట్లూరి రామమోహన్ ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా స్పందించాలి

## - రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** పాలకులను ఎప్పటికప్పుడు ప్రశ్నించకపోవడం వల్లే రాయలసీమ వెనుకబడిందని, కరువు పరిస్థితులు వస్తున్నాయని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ సమస్యలపై స్పందించాలని, రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా యువత, విద్యార్థులు స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోని "ఫార్మసీ సెమినార్" హాల్లో సోమవారం "రాయలసీమ కరవునీటి సవాల్లు, పరిష్కార మార్గాల సాధ్యాసాధ్యాల" పై సదస్సు జరిగింది. విద్యార్థులతో నిర్వహించిన సదస్సుకు విశిష్ట అతిధిగా పాల్గొన్న రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి గారు మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంత కరవుపై అనునిత్యం మొసలికన్నీరు కార్చే రాయలసీమ ప్రాంత నాయకులు రాని వర్షాలు కురిపిస్తామని "మేఘమధనం" చేయడం, నీళ్లే లేని సీమలో రెయిన్ కన్నులతోను, ట్యాంకర్లతోను రాయలసీమ ప్రాంత రైతుల పంటలకు నీళ్లు అందించి పంటలు పండిస్తామని పనికిమాలిన పథకాలను మన పాలకులు సీమలో ప్రయోగం చేయడాన్ని కూడా మన రాయలసీమ ప్రాంత ప్రజలుగా మనము ఏ రోజు ప్రశ్నించడం లేదు అన్నారు. అలా రాయలసీమ ప్రాంత ప్రజలు ప్రశ్నించడం లేదు కాబట్టి మన రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహాలు నేటికి చేస్తూనే ఉన్నారు అని ఆందోళన చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మన ముఖ్యమంత్రులు సిద్దేశ్వరం దగ్గర క్రిష్ణనదిపై కేంద్రం నిర్మిస్తున్న నేషనల్ హైవే లో బాగంగా తీగెల వంతెన నిర్మాణం బదులుగా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని ఈ రోజుకు కోరక పోగా కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర నిర్మాణాన్ని మన పాలకులు ఆపలేక పోవడంతో రాయలసీమ పశ్చిమ ప్రాంతానికి జీవనాధారమైన హెచ్ ఎల్ సి,ఎల్ ఎల్ సి ఆయకట్టు పూర్తిగా ఎడారి కాబోతోంది అన్నారు .ఇప్పుడు కూటమి ప్రభుత్వం 53వేల ఎకరాల అమరావతి రాజధాని ప్రాంతంలో మరో 44వేల ఎకరాలకు విస్తరింప చేసి మరోసారి నిర్బంధ అభివృద్ధి కేంద్రీకరణ కోసం రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీవ్రమైన అన్యాయము చేస్తున్నారు అన్నారు. గోదావరిబనకచర్ల అనుసంధానం చేస్తామ్ రాయలసీమ శశ్యసామలం చేస్తామని చెప్పే ఈ ప్రభుత్వం కేంద్రంలో కీలకమైన భాగస్వామ్యం ఉన్నప్పుడు రాయలసీమ ప్రాంతంలో ఉన్న తుంగభద్ర కృష్ణా నదులపైనే ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు నిర్మించవచ్చు కదా ఆయన నిలదీశారు. ఈ రోజు విద్యార్థుల శక్తి మేల్కొనకపోతే మన రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతాంగం సర్వనాశము అవుతుంది,, సోషియల్ మీడియా పవర్ ను రాయలసీమ ఉద్యమానికి ఉపయోగించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే ఈ మద్య కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని ఈ ప్రభుత్వ అధికారులు కూల్చి వేసినప్పుడు నేను వెంటనే సోషియల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఎంత భూములలో కాశినాయన జ్యోతి ఆశ్రమం ఉందో అంత అటవీశాఖ భూమికి బదులుగా నా స్వంత భూమిని ఇవ్వడానికి సిద్దం అని నేను పెట్టిన పోష్టు ఏకంగా 698మంది షేర్ చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలామంది నాకు ఫోన్లు చేసి ఏ రాజకీయ నాయకుడు కూడా మీ మాదిరిగా స్పందించలేదు కాబట్టి మీ వెనుక మేము కూడా ఉన్నాం అంటూ విపరీతంగా వైరల్ చేయడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి కాశినాయన జ్యోతి ఆశ్రమాన్ని పునర్నిర్మాణం చేయడం జరుగుతోందని ఆయన విద్యార్థులకు వివరించారు.

# గ్రామీణ యువతకు సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున సీడాప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించటంతోపాటు,వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్ధ ఛైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి తెలిపారు.మీడియాకు విడుదల చేసిన సమాచార ప్రతంలో సోమవారం తెలియజేశారు.. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో వారికి ఉచితంగా భోజనంతోపాటు వసతి, యూనిఫామ్ మరియు కోర్స్ మెటీరియల్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా


సిడాప్ ఛైర్మన్ గుణపాటి దీపక్‌రెడ్డి

చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అందులో భాగంగా సీడాప్ కూడా తనవంతు పాత్రిని నిర్వహిస్తుందన్నారు. ఒక వైపు డీఎస్సీ ద్వారా వేల ఉద్యోగాలు ఇంకోపక్క సీడాప్ ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన తరువాత లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు.

ఇందుకోసం చాలా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలు ఏర్పడుతుందన్నారు.

ఈ అవకాశాలను రాష్ట్రంలోని యువత అందిపుచ్చుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుచున్నామని తెలియజేశారు. కోర్స్ మరియు శిక్షణా కేంద్రాల వివరాలకు ఈ క్రింది లింక్ ను క్లిక్ చేయగలరు.. మరిన్ని వివరాలకు 0866 2571125, 80088 79191 సంప్రదించాలని కోరారు.

# టిడిపి నేత కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం టిడిపి నేత మాజీ రాజ్య సభ సభ్యుడు కెఎం.సైఫుల్లా కుమారుడు కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు పెద్ద ఎత్తున టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి నివాళులు అర్పించారు. రామ్‌నగర్‌లోని మాజీ ఎంపి సైఫుల్లా నివాసానికి టిడిపితోపాటు వైసిపి నాయకులు కూడా తరలివచ్చి కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి సవిత హిందూపురం ఎంపి బికె.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, జెసి ప్రభాకర్‌రెడ్డి, పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర ముతవల్లి అసోషియేషన్ అధ్యక్షులు కెఎం.షకీల్ షఫి, ఆయన తండ్రి కెఎం.షఫీవుల్లా తదితర బంధువులు కూడా కెఎం.జకీవుల్లా మృతదేహానికి నివాళులు అర్పించారు. టౌన్ బ్యాంక్ అధ్యక్షులు జెఎల్.మురళీధర్, టిడిపి నేతలు గడ్డం సుబ్రహ్మణ్యం, జయరామ్ నాయుడు, ఆలం నరసనాయుడు, రాయల్ మురళీ, సరిపూటి రమణ, బుగ్గయ్యచౌదరి, ఆదినారాయణ, తదితర టిడిపి నాయకులు కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ రాజ్య సభ [illegible] కె.ఎం.సైఫుల్లాను కూడా ఓదార్చి ధైర్యం చెప్పాడు. అదే విధంగా వైఎస్ఆర్‌సిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి తదితర నాయకులు కూడా మాజీ ఎ ంపి సైఫుల్లా ఇంటికి వెళ్లి కె.ఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఇదే సమయంలో మాజీ ఎంపి కె.ఎం.సైఫుల్లా ఇంటి వద్దకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు. కెఎం.జకీవుల్లా మృతదేహానికి టిడిపి నేతలు ప్రత్యేకంగా టిడిపి జెండాను కప్పి నివాళులు అర్పించారు. కెఎం.జకీవుల్లా ఇంటి వద్ద నుంచి కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని ముస్లింల స్మశాన యాత్ర వరకు అంతిమ యాత్రను నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ తదితరులు పాడె మోయడం విశేషం. ముస్లిం సాంప్రదాయ పద్దతుల్లో ముస్లిం స్మశాన వాటికలో జరిగిన టిడిపి నాయకుడు కె.ఎం.జకీవుల్లా


కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాలులు అర్పిస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు

అంత్యక్రియలకు భారీగా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నేతలు మాట్లాడుతూ.. కెఎం.జకీవుల్లా అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరం, పార్టీ కోసం జకీవుల్లా కుటుంబం ఎంతో చేసింది. గత ఎన్నికల్లో జకీవుల్లా అనంతపురం అర్బన్‌లో తిరిగి సీఎంగా చంద్రబాబును చూడాలని సైనికునిగా పని చేసినట్లు వారు తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. కెఎం.జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను గుర్తు పెట్టుకుంటామని చెబుతూ కెఎం.జకీవుల్లా కుటుంబ సభ్యులను నేతలు ఓదార్చారు.

# శ్రీకూర్మం క్షేత్రంలో నక్షత్ర తాబేళ్ల మృత్యువాత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి** ప్రపంచంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విష్ణు అవతారాల్లో రెండవది అయిన కూర్మావతారంతో వెలసిన ఏకైక దేవాలయం. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రెండు ధ్వజస్తంభాలతో శ్రీచక్ర యంత్రం స్థాపనతో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత సంచలనం రేకెత్తించింది. కూర్మావతారానికి ప్రతీకగా నిలిచిన నక్షత్ర తాబేళ్లను ఆలయం ఆవరణలో సంరక్షిస్తున్నారు. గ్రీన్ మెర్సీ అనే సంస్థ ఈ తాబేళ్లను సంరక్షిస్తుంది. ఆదివారం ఈఓ కార్యాలయం వెనుక సుమారు 15 వరకు మృతి చెందిన తాబేళ్లను దహనం చేసి పుష్కరిణిలో నిమజ్జనానికి పాల్పడుతున్న సంఘటనను గమనించిన స్థానికులు ఆందోళన చెందడంతో ఒక్కసారిగా వెలుగు చూసింది. విశ్వహిందు పరిషత్ సభ్యులు, భక్తులు సోమవారం ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఈఓ కార్యాలయం వెనుక గల సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 212 తాబేళ్లు లెక్కల ప్రకారం ఉండాలని ప్రస్తుతం అన్నే ఉన్నాయని ఎమ్మెల్యే తెల్పడం విశేషం. దహనం చేసిన తాబేళ్ల అవశేషాలను పశుసంవర్ధకశాఖ అధికారులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫారెస్ట్ అధికారులు అక్కడకు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న తాబేళ్లకు వ్యాధులు ఉన్నది లేనిది పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బారువలో శనివారం బీచ్ ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టారు. తాబేళ్ల గురించి చెప్పి 24 గంటలు గడవక ముందే మహావిష్ణువు అవతారమైన తాబేళ్లమృత్యువాత పడడం భక్తుల మనసు కలచి వేసింది.

# క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచారం

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.

# ముగిసిన చంద్రబాబు యూరప్ పర్యటన, నేడు ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో బేటీ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** యూరప్ వ్యక్తిగత పర్యటనపై వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం స్వదేశానికి తిరిగి రానున్నారు. అర్థరాత్రి 12 గంటల సమయంలోను,లేదా బుధవారం తొలిగంట తరువాత సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకోనున్నట్లు తెలుస్తోంది.తన 75వ పుట్టిన రోజు సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ దేశాల పర్యటనకు వెళ్లారు. మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసే అవకాశం ఉందని ఆ తర్వాత సీఎం షెడ్యూల్ ఖరారు కావల్సి ఉంది. కేంద్రమంత్రులను కలవనున్న సీఎం: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు, జలవనరుల శాఖ మంత్రి, న్యాయ శాఖ మంత్రితో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నందున, సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కీలకం కానుంది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తి, పోలవరం బనకచర్ల అనుసంధాన

ప్రాజెక్టుపైనా ఢిల్లీలో మంతనాలు జరపనున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 17వ తేదీన విదేశాలకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇవాళ అర్ధరాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు.

అక్కడి నుంచి ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం అయిన 1 జన్ పథ్ కు వెళ్లి అక్కడే బస చేయనున్నారు.

## యూపీ సీఎంకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**అనంతపురం,ఏప్రిల్ 22 , (ప్రభాతవార్త బ్యూరో)** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహుకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు సోమవారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ధర్మవరం పట్టు వస్త్రాన్ని, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీ కృష్ణుని తొలుబొమ్మను ఆయనకు బహూకరించి, ధర్మవరం పట్టు గురించి, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్ఠత గురించి ఆయనకు వివరించారు. యోగి ఆదిత్యనాథ్ గారు సత్యకుమార్ ని సాదరంగా ఆహ్వానించి మధుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలని, అలాగే ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ ని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలి

### సిఐ పి వెంకటేశ్వర్లు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సైబర్ నేరాలపట్ల ప్రతిఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, మోసగాళ్ళు రకరకాల ప్రలోభాలు, మార్గాల్లో ఖాతాల్లోని నగదును అపహరించే విధానాలపట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో పోలీసు అధికారులు, బ్యాంకర్లు పలుసూచనలిచ్చారు. విజయవాడ సిటి కమిషనర్ ఉత్తర్వులతో నందిగామ ఏసిపి ఆదేశాలతో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని 15 బ్యాంకుల అధికారులతో కలిసి సిఐ పి వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ బి రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ మీడియా సమావేశంలో అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు ఎక్కువగా బ్యాంకుల ఖాతాల ద్వారా జరుగుతున్నాయన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల కుటుంబం ఆత్మ హత్యాయత్నం..

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 21 ప్రభాతవార్త** పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మండపేట స్వీట్ స్టాల్ అధినేత కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు కుటుంబం సోమవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు ఈ సంఘటన పట్నంలో తీవ్ర కలకలం రేపింది. కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావ్ భార్య కనకాల మహాలక్ష్మి ్మ ప్రస్తుతం పెద్దాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తుండడం, పట్నంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన నేపథ్యం కలిగిన కనకాల కుటుంబం ఆత్మహత్యకు ప్రయత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. గత కొంతకాలంగా తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద తీసుకున్న రూ 50 లక్షల రుణ భారం అధికం కావడం, వడ్డీలు కట్టమని సదరు వ్యక్తులు వేధిస్తుండడం తట్టుకోలేక తీవ్ర మనస్థాపనతో కనకాల కుటుంబం సోమవారం ఉదయం నిద్ర మాత్రల మింగి సామూహిక ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. తండ్రి సుబ్రమణ్యం, భార్య మహాలక్ష్మి ్మ, కుమారుడు గోవిందు ముగ్గురు సూసైడ్ నోట్ రాసి పురుల మందు సేవించిన ఘటన బయటకి తొక్కడంతో చుట్టుపక్కల వారు హుటాహుటిన వారిని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పలువురు టిడిపి వైసిపి శ్రేణులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని ప్రత్యేక వాహనంలో కాకినాడ తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య స్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరించారు. ప్రస్తుతం అతన్ని సతీమణి కనక మహాలక్ష్మి ్మ మున్సిపల్ వైస్ చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల వైసిపికి పార్టీకి సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. నాటినుండి రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరి కుటుంబం ఆత్మహత్యయత్నానికి పాల్పడం చర్చనీయాంశంగా మారింది.

## సీఎం చంద్రబాబునాయుడ్ని దూషించిన వైసిపి నేత అరెస్టు

**చేజర్ల (నెల్లూరు), ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు కూటమి నేతలను అసభ్యంగా దూషించిన చేజర్ల మండలం పాతపాడు గ్రామానికి చెందిన కాకుమూరి రాజీవ్‌రెడ్డిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.సిఎం చంద్రబాబుతోపాటు మరి కొందరు టిడిపి నేతలను తిడుతు వీడియో పోస్టు చేయడంతోపాటు వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు.నన్నుఎవ్వరు ఏమి చెయ్యలేరు. ఏమి పీకలేరు అంటు దురుసుగా మాట్లాడాడు.ఈ వీడియో బాగా వైరల్ అయింది.దీంతో కొందరు చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

# అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లవేళలా గుర్తింపు



**అంబాజీపేట, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పదని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా, మాజీ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావులు అన్నారు. మండలంలోని తొండవరం జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్గా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మట్టపర్తి రాంబాబ్ ఉద్యోగ విరమణ సన్మాన సభ హెచ్ఎం పి.వి. కేశవాచార్యులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసేవారిని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం రాంబాబ్ వెంకటరమణమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాంబాబ్ మాట్లాడుతూ 35 ఏళ్ళుగా ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి, విద్యార్థులకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, విధి నిర్వహణయే కర్తవ్యంగా భావించానని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంఈఓలు కాంగ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్,వాకలగరువు సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు,ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పిఎంసి చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు మానుకొండ చంద్రరావు,ఎ.వి. అప్పారావు, కొంపెల్ల వాణి, కందాళ గణేష్ నరసింహారావు, పెచ్చెట్టి సూర్యనారాయణ, పినిపే సత్యనారాయణ, గంటి శ్రీనివాస్, విద్యార్థులు, ఎస్టియు, యుటి ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**కాకినాడ రూరల్ , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో చికిత్స పొంది కోలుకొన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను గుడారిగుంట లో గల ఎమ్మెల్యే స్వగృహం వద్ద గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన నాలుగు కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ 415819/ రూపాయల చెక్ లను లబ్ధిదారులు అల్లు ఉమాదేవి, కుంపటి బాబురావు, కంచి సుధారాణి, నిడదవోలు సాయి సత్య సుధీర్ లకు ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం గా పనిచేస్తుందని , సంక్షోభంలో కూడా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నా రన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాస్, కూటమి నాయకులు, సలాది శీను బాబు జన సైనికులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు సృజనాత్మక విద్యనందించాలి : ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విద్యను అందుపుచ్చుకోవాలి కాని, ఆ విద్య చిన్నారులకు నిర్భంద విద్య కాకుడదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గోపాలపురం లోని శర్వాణి పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన విద్యావైజ్ఞానిక ప్రాజెక్టులను ఆయన తిలకించారు. అనంతరం ప్రిన్సిపల్ రాపాక ఫణికిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత విద్యా విధానానికి ఇప్పటి విధానానికి ఎంతో వత్యాసం ఉందని, గతంలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటే ఎంతో ఆనందం ఉంటుందని ప్రస్తుత విద్యా విధానం వ్యాపారమైపోయిందని అన్నారు. విద్యా భోధనలో పిల్లలకు కొంత స్వేచ్ఛనివ్వాలని అన్నారు. కాలను గుణంగా మారుతున్న విద్యా విధానంలో వచ్చే మార్పులను అమలు చేస్తే ఆ విద్య విధానానికి సార్ధకత ఉంటుందన్నారు. నాణ్యమైన విద్యనం దించినప్పుడే మంచి సమాజ స్థాపన జరుగుతుందని, ఆ విధంగా విద్యా సంస్థలు అడుగులు వెయ్యాలన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా తలపై భారం మోపకుండా ఆట, పాటలతో స్వేచ్ఛగా విద్యను అందించినప్పుడే వారు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. విద్య సంస్థలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారానే మానసిక పరిపక్వత, సృజనాత్మకతగా ఎదుగుతారన్నారు. ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే వెంకట్రాజు సూచించారు. రాజమండ్రికి చెందిన ఫస్ట్ ప్లస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బొమ్మారెడ్డి కళాధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల వైపు కూడా ఆనక్తి పెంచుకో వాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.శ్రీనివాసరావు, మహేశ్వరరావ్, మండల టీడీపీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, తెదేపా సీనియర్ నాయకులు జ్యేష్ఠ శ్రీధర్, వడ్లమూడి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాస రావు, ఈలి శరత్ బాబు, మద్దిపాటి రమేష్, కొర్లపాటి రాము, కూనపోం ప్రసాద్, పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అంబాజీపేట జడ్పీ హైస్కూల్లో పిఎం శ్రీ నిధులు అవకతవకలపై విచారణ

## ఉపాధ్యాయుడి ఫిర్యాదుపై కదిలి వచ్చిన అధికారులు



**అంబాజీపేట, ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులతో చేపట్టిన పనులు, మధ్యాహ్న భోజన పథకంలో కోడి గుడ్లు అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుతో కొత్తపేట డీవైఈఓ బి.రామలక్ష్మణ మూర్తి ఉన్నత పాఠశాలలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరామ్ పీఎంశ్రీ నిధులు దుర్వినియోగం చేశారని, విద్యార్థులకు అందించాల్సిన కోడిగుడ్లు అవకతవకలు జరిగాయని స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అంజిబాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడన్నారు. పాఠశాల విద్యార్థుల చేత పలు పనులు చేయించి పిఎం శ్రీ నిధులలో బిల్లులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. దాంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టానన్నారు. పీఎం నిధులు ద్వారా రూ. 18.70 లక్షలు నిధులు మంజూరయ్యాయని, వీటితో కెమిస్ట్రీ ల్యాబ్, క్రీడా ప్రాంగణం అభివృద్ధి పనులు, రైలింగ్ తదితర పనులను చేశారన్నారు. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణలపై పాఠశాలలోని ప్రతీ ఉపాధ్యాయుడు, విద్యార్థుల నుండి వివరాలు సేకరించామన్నారు. ఈ నివేదికను డీఈఓకు సమర్పిస్తామని డీవైఈఓ రామలక్ష్మణమూర్తి తెలిపారు.

## రోడ్డు పనులకి ఎంఎల్ఏ శంకుస్థాపన



**అమలాపురం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** ప్రజా రవాణకు తమ ప్రభుత్వం అత్యదిక ప్రాధాన్యత ఇస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు పేర్కొన్నారు.ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను కొబ్బరి కాయ కొట్టి ఎంఎల్ఏ ప్రారంభించారు.ఈ సందర్భ ంగా ఎంఎల్ఏ ఆనందరావు మాట్లాడుతూ రహదా రుల పనులు సకాలంలో పూర్తి చేయాలని అదికా రులను కోరారు ఈ కార్యక్రమంలో ఇసుకుపట్ల జయ మణి రఘుబాబు,గొల్లకోటి చిన్న, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు,దంగేటి బాబ్బులు,జనసేన నాయకు లు, సుంకర చిన్నాబాయి,బూసి బుచ్చిదొర, పోలిశెట్టి శివాజీ, పొలిశెట్టి ఉమా,సుంకర రాంబాబు, కుంపట్ల రమేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యార్థులకు వృత్తిపరమైన నైపుణ్యం ఎంతో అవసరం : డీఈఓ సలీం భాషా



**అంబాజీపేట, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** విద్యార్థులకు వృత్తి పరమైన నైపుణ్యం ఎంతో అవసరమని,భవిషత్ లో ఉపయోగపడే కోర్సుల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి వాటినే ఎంచుకుని శ్రద్ధగా చదువుకుంటే బంగారు బాట అవుతు ందని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంభాషా అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో ఒకేషనల్ కోర్సులో భాగంగా 12 రోజులు పాటు నిర్వహించిన ఇంటర్న్ షిప్ లో పాల్గొన్న విద్యార్థులకు హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన ట్రైనింగ్ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాను ఎంచుకున్న లక్ష్యం వైపు పయణించాలంటే అందుకు తగిన కోర్సును ఎంచుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే భవిషత్ అంతా పూలబాట అవుతుందన్నారు. ఎవరికి నచ్చిన కోర్సులను వారు ఎంచుకుని అందుకు తగ్గట్టుగా ప్రణాళికా బద్ధంగా చదువు కోవాలన్నారు. ఒకేషనల్ కోర్సులో ఉన్నవారు వారి వృత్తిలో నైపుణ్యం పొందితే ఆర్థిక పురోభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి ఎంఎకె. భీమారావు, డీవైఈఓ బి.రామ లక్ష్మణమూర్తి, ఎంఈఓలు కాంగ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఒకేషనల్ టీచర్స్ జి. తేజస్విని, వై. స్టీఫెన్, వై.వివేక్, పిఎంసి చైర్మన్ పితాని త్రిమూర్తులు, స్టాఫ్ సెక్రెటరీ వెన్నపు సత్యనారాయణ, బెహరా మూర్తి, పిడి కె.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై వినతిపత్రం



**సీతానగరం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఎంపీడీవో ఎం. భారతికి వినతిపత్రం అందజేశారు.మండల ఉపాధ్యక్షుడు సుంకవల్లి పోసా రావు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెం ట్లు తమ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కోడెల్లి ప్రకాష్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్మ, కృష్ణవేణి, రామారావు, శ్రీనివాస రావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఏరియాలో ఖర్చు చేసిన నిధుల వివరాలు తెలపండి..వార్డ్ మెంబర్లు ఫిర్యాదు



**రౌతులపూడ, ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** మేజర్ పంచాయతీ అయిన రౌతులపూడిలో2021-2025 వరకు ఎస్సీ పాతపేట, న్యూ కాలనీలలో ఎంత ఖర్చు చేశారు? ఎక్కడ ఖర్చు చేశారు? వివరాలు తెలియజేయాలని వార్డ్ మెంబర్లు కట్టుకొండయమ్మ, మోర్తా నూక రత్నం, బి ఉషారాణి సోమవారం మండల గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీ చాలా అద్వానంగా ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్మశాన వాటిక దగ్గర రేకుల షెడ్డు నిర్మాణం పునాది లోనే ఉండిపో యిందన్నారు. డ్రైనేజీలు మురుగు తో ఉండడంతో లార్వా పెరిగి రోగాల బారిన పడుతున్నామన్నారు. వీటిపై అధికారులు స్పందించాలని వారు పేర్కొన్నారు. మా ఏరియా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# రమణయ్యపేట కైలాస భూమి ఆధునీకరణ

## : ఐరెడ్డి సత్యనారాయణ సేవలను అభినందించిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** రూరల్ మండలం రమణయ్యపేట మార్కెట్ వద్ద గల కైలాస భూమి ని చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో సకల సౌకర్యాలతో ఆధునికరించారు. సోమవారం కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ కైలాస భూమిలో ఆధునికరించిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నానాజీ ప్రారంభించారు. మానవతా దృక్పథంతో ఐ రెడ్డి సత్య నారాయణ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే నానాజీ అభినం దించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ చివరి దశలో ఉన్న వృద్ధులు తమ అంతిమ సంస్కారాలు గౌరవ ప్రదంగా జరగాలని ఆశిస్తారని ఆ దిశగా కైలాస భూమిని ఎంతో చక్కటి సౌకర్యాలతో తీర్చిదిద్దారని అన్నారు. పేద ,మధ్యతరగతి వర్గాల కోసం ఫ్రీజర్ బాక్సులు ఉ చితంగా అవసరమైన వారికి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయ మని అన్నారు. వీర శైవ ధర్మాన్ని ఆచరించిన జంగమ, లింగాయత్ ల సౌలభ్యం కోసం కూర్చునే ఫ్రీజర్ బాక్స్ ను లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ సమకూర్చగా మిగతా వర్గాల కోసం అయిరెడ్డి సత్యనారాయణ మరో ఫ్రీజర్ బాక్స్ ను సమకూ ర్చడం అభినందనీయమని నానాజీ తెలిపారు. లయన్స్ క్లబ్ గవర్నర్ ఈశ్వర్ కుమార్ ,మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ లు ఐరెడ్డి సత్య నారాయణ మానవతా దృక్పథాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోళ్ల కృష్ణమోహన్, అడబాల రత్న ప్రసాద్, తాటికాయల వీరబాబు, కేవీపీ బాలాజీ, ప్రసాద్ నాయుడు, సుబ్బారావు, రమణ య్యపేట పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# గోపాలపురం గ్రామ కార్యదర్శి సాయిరామ్ ఆకస్మిక మృతి



**రావులపాలెం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిమ్మకాయల సాయిరాం సోమవారం ఆకస్మి కంగా మృతి చెందారు. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన స్వగ్రామం ఆలమూరు మండలం పెదపళ్ళ కాగా ఆల మూరులో నివాసం ఉంటున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్యదర్శిగా సేవలందించారు. జిల్లాలో పంచాయతీ ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కారం కోసం కృషి చేసే సాయిరాం మృతి చెందడం పట్ల గ్రామ కార్యదర్శులు, ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతి పట్ల కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, ఎంపీడీవో మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గంగుల కృష్ణ, రావు లపాలెం, ఈతకోట, రావుల పాడు, దేవరపల్లి, ఊబలంక, వెదిరేశ్వరం గ్రామ కార్యదర్శులు ఎల్. దుర్గా ప్రసాద్, శర్మ, పట్టాభి రామయ్య, మట్టా శ్రీనివాస్, శరభరాజు, డి.రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేసారు.

## సామర్లకోట రోడ్ లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరి పరిస్థితి విషమం



**సామర్లకోట, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** సామర్లకోట పట్టణంలో కాకినాడ నుండి వేట్ల పాలెం వెళ్లే రోడ్ మార్గంలో వంతెన ప్రక్కన సోవ ంవారం రాత్రి ఒకేసారి రెండు ద్విచక్ర వాహ నాలు ఢీకొనడంతో ఒక మోటారుసైకిల్ సైకిల్ కి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి బిక్కవోలు నుండి సామర్ల కోట వంతెన పైకి వెళ్తున్న టాటా ఏస్ వాహనం వెనుక చక్రం పై పడటంతో ఆ వ్యక్తిని టాటా ఏస్ వాహనం దాదాపు 5 మీటర్లు ఈడ్చు కొని పోయింది బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన రాయుడు ప్రసాద్ (30) పరిస్థితి విషమంగా ఉంది దీంతో ట్రాఫిక్ ఎస్సై గరగారావు కుటుంబ సభ్యులకు సమా చారం ఇచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

# కీడలతోనే దేశానికీకీర్తి ప్రతిష్టలు..గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీ రామచంద్రమూర్తి



**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** క్రీడాకారులతోనే దేశానికి కీర్తి ప్రతిష్టలు సమకూర్తా యని దేశ విదేశాల్లో జాతీయ జెండాను ఎగరవేసే సత్తా క్రీడాకారులకు ఉంటుందని సర్పంచ్ మెర్ల రాము అన్నారు. సోమవారం ఇటీవల రాష్ట్ర స్థాయి జాతీయస్థాయి క్రీడా పోటీలలో విశేష ప్రతిభ కనబరి చిన క్రీడాకారులకు మెమొంటోళ్లు అందజేసి ఘనం గా సత్కరించారు. మెర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశా లకు చెందిన విద్యార్థులు జాతియస్థాయి నెట్ బాల్, త్రోబాల్ పోటీలలోను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ చూపించారు. పాఠశాల ఆవరణ లో పాఠశాల కమిటీ చైర్మన్ పువ్వల లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మెర్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకు ఘనంగా సత్కరించారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు దాతలు విరాళాలుతో సమకూర్చిన మేమేంటోలు,పతకాలు అందజేసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లవరపు నాగరాజు, మెర్ల లక్ష్మీపతి గోపా మనోహర్, ఎలిపే వీర్రాజు, రంకిరెడ్డి వినయ్ కుమార్, మెర్ల రామంజనేయులు, నాని మెర్ల సంజు, మెర్లర్ల సూరన్న, పాఠశాల హెచ్ ఎం శ్రీహరి, పిఈటి శ్రీకాం త్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే ఫంక్షన్ హాలు నిర్మాణం

## ప్రభుత్వ భూమి కబ్జా పై గ్రామస్తుల ఫిర్యాదు



**శంఖవరం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** మండలంలోని కొంతంగి కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఎటువంటి అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టారు . దీనిపై గ్రామం లోని కొందరు గ్రామస్తులు పుష్కర కాలువ, ఏలేరు కాలువ, రెవెన్యూ భూమిని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు పిర్యాదు కూడా చేసారు. సదరు గ్రామానికి చెందిన గొర్ల చంటబ్బాయి అనే వ్యక్తి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కు, తహశీల్దార్ గ్రీవెన్స్ కు, పంచాయతీ అధికారికి, పిర్యాదులు చేయడంతోపాటు, సమాచార హక్కు చట్టం నుండి దీనిపై అధికారులను వివరాలు అడిగి తీసుకున్నాడు. వీటిలో ఎటువంటి అనుమతులను మేము మంజూరు చేయలేదని, కుడా అనుమతి కూడా లేదని, ఫంక్షన్ హాలు నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేన్నట్లు పేర్కొన్నారు. అనుమతులు లేని నిర్మాణాలను చేపట్టే సామాన్యులపై పనులు నిలిపి వేయించే అధికారులు మౌనం వహించడం వెనుక అసలు రహస్యమేమిటో గ్రామస్తులకు తెలియడం లేదు. అందులోనూ ఫంక్షన్ హాలు నిర్మించిన స్థలం ఏలేరు, పుష్కర కాలువల తోపాటు, రెవెన్యూస్థలం కూడా ఉన్నప్పటికీ అధికారులు బిత్తర చూపులు ఎందుకు చూస్తున్నారని గ్రామస్తు లు తీవ్రంగా విమర్శిస్తు న్నారు. సదరు ఫంక్షన్ హాలు నిర్మాణదారు పుష్కర, ఏలేరు కాల్వ మట్టిని భారీ ఎత్తున తరలించి, ఇప్పటికే లక్షలాది రూపా యులు ఆర్జించాడని, మట్టి చోరీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని ఫంక్షన్ హాలు నిర్మాణం చేపట్టాడని గ్రామస్తుల ఆరోపణ. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలను అడ్డుకుని, స్థలం స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుచున్నారు.

# వినతులను సకాలంలో పరిష్కరించాలి..503 వినతులు స్వీకరణ

**కాకినాడ టౌన్ , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షాన్ మోహన, .జాయింట్ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట రావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ రామలక్ష్మి, సిపిఓ త్రినాద్, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన,



సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలిగింపు, మత్స్యకార భరోసా , డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం 503 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన పేదల సత్యనారాయణకు 15 నుంచి ఆరోగ్యానికి స్పందించకపోవడంతో కిర్లంపూడి మండలానికి చెందిన పాఠంశెట్టి సూర్యచంద్ర అనే వ్యక్తి అంబులెన్స్ ద్వారా స్ట్రక్చర్పై గ్రీవెన్స్కు తీసుకొచ్చారు. తీసుకొచ్చిన వ్యక్తిపై కలెక్టర్ ఫోటో తీసుకుని వస్తే సరిపోతుందని మంచం మీద ఉన్న ఆయనను తీసుకురావడం భావ్యం కాదంటూ పేర్కొన్నారు. అతనికి వారం రోజుల్లోగా ధ్రువీకరణ పత్రాలు అందించి పింఛన్ నిమిత్తం తగు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాసుపత్రి వర్గాల వారిని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించాలని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ అన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం కోనసీమ జిల్లా అమలా పురం, గడియార స్తంభం వద్ద గంగరాజు ఫంక్షన్ హాల్ లో మేధావుల సమావేశం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పార్లమెంట్లో అంబేద్కర్ నిలువెత్తు ప్రతిమ ఏర్పాటు చేయడమే కాకుండా,అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిన తీరుకు నిరసనగా,1951లో రాజీనామా చేయడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముళ్ళపూడి రేణుక, రాష్ట్ర



బిజెపి ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీ వేమా కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, తమలంపూడి రామకృష్ణ రెడ్డి యాళ్ల దొరబాబు ,కలవకోల తాతాజీ,పాలూరి సత్యానందం,చికురుమిల్లి శ్రీనివాస్,ఆర్ వి నాయుడు, మోకా సుబ్బారావు, బాలస్వామి పలువురు డాక్టర్లు,ఇంజనీర్లు,న్యాయవాదులు,ఉపాధ్యాయులు ఇతర రంగాల మేధావులు,బీజేపీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కోనసీమ రైల్వే పూర్తికి సహకారం : కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ




**కోనసీమ బ్యూరో,ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సహకరిస్తానన్న కేంద్ర సహాయ శాఖా మంత్రి శ్రీనివాస వర్మ వాఖ్యలను స్వాగతి స్తున్నామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయని అన్నారు. నాడు తండ్రి బాలయోగి అంకురార్పణ చేసిన ఈ ప్రాజెక్టు ఆయన మరణం అనంతరం మరుగున పడిపోయిందని హరీశ్ పేర్కొన్నారు.2014 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కాస్త ముందుకు సాగిందని 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతం అయ్యా యన్నారు.అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. అలాగే అనకాపల్లిలో ఇటీవల భారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.అదే విధంగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కూడా పూర్తి చేస్తామన్నారు.

## లో వోల్టేజి సమస్యపై ఏఇ కు ఫిర్యాదు



**రౌతులపూడి, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** రౌతులపూడి బీసీ కాలనీలో ఉన్న లో వోల్టేజి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ ఎఇ చిన్న బాబుకు ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేశారు. లోవోల్టేజ్ విద్యుత్ సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తరచూ జరగడం వల్ల గృహోపకరణాలు పాడవుతున్నాయన్నారు. ఏబీ స్విచ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## లేగదూడను చంపుకు తిన్న కుక్కల మంద



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** యర్నగూడెం గ్రామంలో రైతు మండ జనార్ధనరావు పశువుల పాక వద్ద మందలోని లేగదూడని సోమవారం తెల్లవారుజామున కుక్కల గుంపు తీవ్రంగా దాడి చేసి చంపితిన్నాయి పలుమార్లు కుక్కలు దాడిచేసి పశువులను చంపి తింటున్నాయని అధికారులు కుక్కలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

## నేడు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం



**రౌతులపూడి ,ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** మండలంలోని ఎస్. పైడిపాల, ములగపూడి గ్రామాల్లో ప్రతిపాదిత రోడ్ మెటల్ ప్రాజెక్టుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహింపబడుతుందని తాసిల్దార్ ఎస్ వి నరేష్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి జి వెంకట్రావు విచ్చేయుచున్నారన్నారు. ఆయా గ్రామస్తులు పాల్గొని ప్రజాభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు.

# రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో రైతాంగం సంతృప్తిని వ్యక్తం చేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నుండి నిడదవోలు నియోజకవర్గం కానూరు వెళ్లే మార్గమధ్యంలో కాన్వాయ్ ఆపి స్థానిక రైతులతో స్వయంగా ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాలపై మంత్రి దుర్గేష్ ఆరా తీశారు.ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని మంత్రి దుర్గేష్ రైతులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ, రైతుల సమయం వృథా కాకుండా వాట్సాప్ నెంబర్ 7337359375 ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమది రైతులకు మేలు చేసే



ప్రభుత్వమని, చివరి బస్తా వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతూ అధైర్య పడవద్దని, ఆరుగాలం శ్రమించే ప్రతి రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం ఇచ్చారు.

స్వయంగా మంత్రి దుర్గేష్ కాన్వాయ్ ఆపి తమ దగ్గరకు వచ్చి ధాన్యం వివరాలను, రైతాంగం సమస్యలను ఆరా తీయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

# ఘనంగా మల్లేపల్లిలో గీత ఆశ్రమం వార్షికోత్సవం



**గండేపల్లి , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** గండేపల్లి మండలం మల్లేపల్లి అన్నపురాజుపేటలో బలిరెడ్డి కృష్ణార్జున గురువు ఆధ్వర్యంలో నిర్మించిన గీతా ఆశ్రమం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా భరతమాత పూజ గ్రామ పురోహితులు చింతా అరుణ్ కుమార్ శర్మ మంత్రోచ్చారణలతో ఆశ్రమ భక్తుల హరినామ స్మరణలతో ఘనంగా నిర్వహించారు.నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరవడం జరిగింది ఈ కార్యక్రమంలో కురుమల్ల నాగేశ్వరరావు,సింగులూరి రామ్ దీపు,గంధం శ్రీను , బలిరెడ్డి గణేష్,సిద్ధా సతీష్ ,బలిరెడ్డి లోవగంగరాజు,బోగాది గంగారావు లక్ష్మీ,పొంతపల్లి రామయ్య,పాతాళ అప్పన్న అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి నిమిత్తం ఏడు కుట్టు మిషన్లు పంపిణీ

**కాకినాడ టౌన్ , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** కాకినాడ లయన్స్ క్లబ్ హాల్ వద్ద ఏడుగురు పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఉచితంగా లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలక్రిష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు లయన్స్ క్లబ్ కాకినాడ గత 25 ఏళ్ళుగా కృషి చేస్తున్నాదని అందులో భాగంగా 42 ఏళ్ళ నుంచి కుట్టు శిక్షణ



కేంద్రాన్ని నడుపు చున్నారన్నారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు చేయూతను ఇవ్వడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో దేగల రమేష్, ఎంవిఆర్ మోహన కిషోర్, పులవర్తి కుమార్, పివి సుబ్బారావు, వి రామ సుబ్రహ్మణ్యం, జగన్నాథరావు, నేరేళ్ళ మురళి పాల్గొన్నారు.

# పేదలకు ఆర్థిక సాయం చేసిన టిడిపి నాయకుడు శ్రీనివాస్

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** మండల కేంద్రంకె . గంగవరంలో జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు75వ పుట్టిన రోజు వేడుకలు టీడీపీ సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న రేవుశ్రీను అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు





బారీగా హాజరైనారు. 25కేజీల కేక్ కట్ చేశారు. అలాగే 300 మంది మహిళలకి చీరలు పంపిణీ చేశారు.

అనంతరం కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు మరియు శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్టా భూ లక్ష్మి ఒంటరి మహిళకు ఆర్థిక సహాయం అందించారు.

# వీధి సుబ్రహ్మణ్యం కేసు లో దోషులను శిక్షించాలి

**: విశ్రాంత డిజిపి ఏ.బి వెంకటేశ్వరరావు డిమాండ్**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** వీధి సుబ్రహ్మణ్యం కేసులు సీట్ కు అప్పగించి సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని విశ్రాంత డిజిపి ఏబి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్ గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసు వివరాలు తెలుసుకునేందుకు ఆయన కాకినాడ జిల్లాకు విచ్చేశారు.సోమవారం ఉదయం పెదపూడి మండలం జి మామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి జిల్లా కలెక్టర్, జిల్లా కలిసి బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సహాయం గూర్చి చర్చిం చారు. జిల్లా ఎస్పీని కలిసి కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్.పి,ఇన్చార్జి, డి.ఎస్.పి రెగ్యులర్ డి.ఎస్.పి,మరియు టూ టౌన్, సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సక్రమంగా కేసు విచారణ చేయిపట్టలేదని అప్పటి ఛార్జ్ సీటు చూస్తే తేటతెల్లమైందన్నారు. ఈ కేసును సిట్ కప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించిఅరెస్టు చెయ్యాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వీధి సత్య నారాయణ, వీధి నూకరత్నం,తమ్ముడు వీధి నవీన్ కుమార్,ఆర్పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కదలి సత్యమూర్తి, కదలి కిషోర్, కోడి కత్తి శీను తదితరులు పాల్గొన్నారు.



# పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**సీతానగరం, ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని రఘుదేవపురం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని హెడ్ కానిస్టేబుల్ వి. శ్రీను తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలం నుండి రూ. 37,800 నగదు మరియు 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, వాహనాలను స్టేషన్కు తరలించి కేసు నమోదు చేశామని ఆయన వెల్లడించారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల కుటుంబం ఆత్మ హత్యయత్నం

**- అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నం అంటూ సూసైడ్ నోట్**

**- బాధితులను పరామర్శించిన స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప**

**పెద్దాపురం, ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మండపేట స్వీట్ స్టాల్ అధినేత కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు కుటుంబం సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం పట్నంలో తీవ్ర కలకలం రేపింది. కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావ్ భార్య కనకాల మహాలక్ష్మి ప్రస్తుతం పెద్దాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తుండడం, పట్నంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన నేపథ్యం కలిగిన కనకాల కుటుంబం ఆత్మహత్యకు ప్రయత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. గత కొంతకాలంగా తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద తీసుకున్న రూ 50 లక్షల రుణ భారం అధికం కావడం, వడ్డీలు కట్టమని సదరు వ్యక్తులు వేధిస్తుండడం తట్టుకోలేక తీవ్ర మనస్థాపనతో కనకాల కుటుంబం సోమవారం ఉదయం పురుగు మందు తాగి సామూహిక ఆత్మ హత్య యత్నానికి పాల్పడ్డారు. తండ్రి సుబ్రమణ్యం, భార్య మహాలక్ష్మి, కుమారుడు గోవిందు ముగ్గురు సూసైడ్ నోట్ రాసి పురుల మందు సేవించిన ఘటన బయటకి తొక్కడంతో చుట్టు పక్కల వారు హుటాహుటిన వారిని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పలువురు టిడిపి వైసిపి శ్రేణులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.



ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని ప్రత్యేక వాహనంలో కాకినాడ తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య స్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరించారు. ప్రస్తుతం అతన్ని సతీమణి కనక మహాలక్ష్మి మున్సిపల్ వైస్ చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. ఇటీవల వైసిపికి పార్టీకి సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. నాటినుండి రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరి కుటుంబం ఆత్మహత్యయత్నానికి పాల్పడం చర్చనీయాంశంగా మారింది.



## పోషణ పక్వాడ పై అవగాహన

**రౌతులపూడి , ఏప్రిల్ , 21 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని ములగపూడి అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషణ పక్వాడ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జానీ లక్ష్మి, కార్యకర్తలు సత్యవతి, రమణమ్మ, అచ్చుతాంబ, సచివాలయ మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పిల్లల్లో ఇమ్యూనిటీకి..

సీజన్ మారగానే సాధారణంగా జలుబు, దగ్గు వంటి సమస్యలు ఎవరికైనా వస్తుంటాయి. అయితే ఈ సమస్యలు పిల్లల్లో తొందరగా కనిపిస్తాయి. జలుబు, దగ్గు ఎక్కువయితే జ్వరం వంటి అనారోగ్యాలు కూడా ఇబ్బంది పెడుతుంటాయి. వీటి నుండి పిల్లలకు రక్షణ కల్పించాలంటే రోగనిరోధకశక్తి పెరిగేలా చూడాలి. రోగనిరోధకశక్తి ఉంటే చాలా రకాల అనారోగ్యాలకు దూరంగా ఉండొచ్చు. అందుకు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే సరి. నిమ్మ, నారింజ, ద్రాక్ష పండ్ల నుండి సి విటమిన్ లభిస్తుంది. దాంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. పాలకూర వంటి ఆకుకూరలు, ఆకుపచ్చని కూరగాయలు ఎ,సి,ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిలగడదుంపలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలను పిల్లలకు తినేలా చూడాలి. కోడిగుడ్లలో ప్రొటీన్లతో పాటు విటమిన్ ఎ,జింక్ అధికంగా ఉంటుంది. గుడ్లను రోజుకు ఒకటి చొప్పున ఇస్తుండాలి. చికెన్, చేపల్లోనూ ప్రొటీన్లు, జింక్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కూడా ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇవి పిల్లల ఆహారంలో ఉండేలా చూడాలి. బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి నట్స్‌తో పాటు చియాసీడ్స్, పొద్దుతిరుగుడు విత్తనాలు వంటివి కూడా పిల్లలకు పెడుతుండాలి. వీటిల్లో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీని పెంచి అనారోగ్యాలు రాకుండా చూస్తాయి. పెరుగు మంచి ప్రో బయోటిక్ ఆహారం. దీన్ని పిల్లలకు రోజూ పెట్టాలి. కొందరు పిల్లలు పెరుగు తినేందుకు ఇష్టపడరు.



అలాంటప్పుడు నేరుగా దాన్ని పెట్టకుండా అందులో కాస్త చక్కెర లేదా పండ్ల ముక్కలు కలిపి ఇవ్వాలి. దీంతో పెరుగును ఇష్టంగా తింటారు. పెరుగు జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది.. ఇది పిల్లల్లో జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. వెల్లుల్లి, అల్లం వంటి ఆహారాలను కూడా పిల్లలకు ఇస్తుండాలి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చిన్నారుల్లో రోగ నిరోధకశక్తిని పెంచుతాయి. ◆

# కళ్ల రక్షణకు..

ప్రతి గంటకోసారి కుర్చీలోంచి లేచి అలా నాలుగు అడుగులు వేయాలన్నది తెలిసిందే కదా! కానీ చాలామంది ఉద్యోగినులు రోజు మొత్తంలో మరీ అవసరమైతే తప్ప సీటులోంచి లేవడానికి ఇష్టపడటం లేదట. తదేకంగా సిస్టమ్‌ని చూసీచూసీ సాయంత్రానికి కళ్లు లాగడం, మంటలు వగైరా! ఉండటం మామూలైంది. పని హడావుడిలో ఇవేం పట్టించుకుంటాం అంటారా? సిస్టమ్ చూసేప్పుడు సాధారణంగానే కళ్లు ఆర్పడం మర్చిపోతుంటాం. దీంతో అవి పొడిబారి నొప్పులు, మండటం లాంటివి కనిపిస్తాయి. ప్రతి 20 నిమిషాలకు ఓసారి పని పక్కన పెట్టండి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లపాటు కళ్లార్పకుండా చూడండి. ఇలా చేస్తూ ఉంటే కళ్లకూ వ్యాయామం, విశ్రాంతీ దొరుకుతుంది. సమయం గుర్తుండదు అనిపిస్తే అలారం పెట్టుకున్నా సరే!. తరచూ తలనొప్పి, పనిపై దృష్టి పెట్టలేకపోవడం, మెడనొప్పి.. వగైరా వచ్చినప్పుడు తెగ ఇబ్బంది పడతాం కదా! నిజానికి కళ్లు మూసుకోండి.



తర్వాత నెమ్మదిగా తెరిచి, అర నిమిషంపాటు ఆపకుండా కళ్లార్చాలి. అప్పుడు తేమ అంది ఉపశమనం కలుగుతుంది. ప్రతి అరగంటకు ఓసారి సిస్టమ్ నుంచి కళ్లు మరల్చి, వేరే పనిమీద దృష్టిపెట్టండి. వీలుంటే గంటకోసారి అలా పక్కకు వెళ్లినా మంచిదే. కళ్లతోపాటు శరీరానికీ మేలు కలుగుతుంది. సమయం వృథా అనుకుంటాం కానీ, ఇలా చేయడం వల్ల మెదడూ శాంతపడుతుంది. కనీసం అయిదు నిమిషాలైనా అలా నడుస్తూ ఉండండి మరి. సిస్టమ్ నుంచి వచ్చే వెలుతురు, సన్నని అక్షరాలు కూడా కళ్లపై ప్రభావం చూపేవే ! కాబట్టి, వెలుతురు మరీ ఎక్కువ కాకుండా చూసుకోండి. అలాగే అక్షరాల సైజును పెంచుకోండి. చాలావరకూ వాటిపై భారం తగ్గుతుంది. వీలైతే బయటికి గాలికి కాసేపు ఉండి, తిరిగి పనిలో నిమగ్నమయితే మంచిది. ◆

# కర్బూజ జ్యూస్

కర్బూజ ముక్కలు – ఒకటిన్నర కప్పు, పాలు – లీటరు. కస్టర్డ్ పౌడర్ – రెండు చెంచాలు, యాలకులపొడి – అరచెంచా, పంచదార – అరకప్పు, సబ్జా గింజలు – రెండు చెంచాలు, సగ్గుబియ్యం – అరకప్పు. సబ్జాగింజలు సగ్గుబియ్యం అరగంట ముందు నీళ్లలో నానబెట్టుకోవాలి. తర్వాత పాలు గిన్నెలో పోసుకుని సన్న మంటపై పొయ్యి మీద పెట్టుకోవాలి. అడు గంటకుండా కలు పుతూ ఉండాలి. కస్టర్డ్ పౌడర్‌లో కొద్దిగా నీళ్లు పోసి కలిపి పాలల్లో పోయాలి. దాంట్లో రెండు చెంచాల పంచదార, యాలకుల పొడి వేసి కలపాలి. అయిదు నిమిషాలు మరగనిచ్చి దింపాలి. కప్పు కర్బూజ, రెండు చెంచాల పంచదార వేసి మిక్సీ వేసి పక్కన పెట్టాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి దాంట్లో సగ్గుబియ్యం వేసి అవి మెత్తమడే వరకు ఉడికించుకోవాలి. తర్వాత వాటిని వడకట్టుకోవాలి. ఒక గిన్నె తీసుకుని దాంట్లో కస్టర్డ్ పాలు, కర్బూజ గుజ్జు, సగ్గుబియ్యం, సబ్జా వేసి కలపాలి. మిగిలిన కర్బూజని సన్నగా తరిగి దీంట్లో వేసుకుని ఓ అరగంటపాటు ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లగా సర్వ్ చేసుకోవాలి. ◆



# ఫ్రిజ్‌లో పెట్టినా పాడవకుండా

ఏ రోజు కారోజు వెళ్లి.. తాజా కూరగాయలు కొనుక్కోవడం కొంచెం కష్టమైన సంగతే.. అందుకు బదులుగా కవర్లలో పెట్టి ఫ్రిజ్‌లో భద్రంచేయడం మామూలే. మరి అవి వారం పదిరోజుల వరకూ తాజాగానే ఉండాలంటే. సిలికాన్ వెజిటబుల్ ఫుడ్ స్టోరేజ్ బ్యాగ్స్ వాడితే మంచిది. ఈ జిప్ లాక్ కవర్లు గాలి చొరబడనివ్వవు. మందంగా ఉంటాయి. సీల్ వేసినట్టుగా ఉండి.. కాయలు, పండ్లను తాజాగా ఉంచుతాయి. నాణ్యమైన మెటీరియల్‌తో చేయడం వల్ల మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. అయితే ఒకదాని మీద ఒకటి కాకుండా పక్కపక్కన నిలబెట్టొచ్చు. ఈ స్టోరేజ్ కంటెయినర్ ఫ్రీజర్‌లో స్నాక్స్, పానీయాలను కూడా భద్రం చేయొచ్చు. వీటిల్లో ఉంచిన పదార్థాల్ని మరో పాత్రలోకి తీయకుండా.. తిన్నగా కవర్‌తోనే అవెన్‌లో వేడిచేయొచ్చు. ఫ్రిజ్‌లో ఎక్కువ స్థలం ఆక్రమించదు. డిష్‌వాషర్‌తో శుభ్రం చేయడమూ తేలికే. నాణ్యమైన సిలికాన్ కనుక పదార్థాల రుచి తగ్గదు, విషతుల్యం కాదు. ◆

## ఆధ్యాత్మికం

# తైత్తిరీయ ఉపనిషత్తు

వేదాలసారమంతా ఉపనిషత్తుల్లో ఉందంటారు పెద్దలు. పది ముఖ్యమైన ఉపనిషత్తుల్లో తైత్తరీయ ఉపనిషత్తు ఒకటి. ఆ ఉపనిషత్తుకు ఆ పేరు ఎందుకొచ్చిందో తెలుసుకుందాం. మొదట వేదమంతా ఒక సమూహంగా ఉంటే ఆ వేదరాశిని వేద వ్యాసుడు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని నాలుగు వేదాలుగా విభజించాడు. తన శిష్యులైన పైల, వైశంపాయన, జైమిని, సుమంతులకు ఒక్కొక్కరికి ఒక్కో వేదాన్ని బోధించాడు. వైశంపాయనుడు యజుర్వేదాన్ని నేర్చుకుని దానిని తన శిష్యుడైన యాజ్ఞవల్క్యునికి బోధించాడు. ఏదో ఒక సందర్భంలో యాజ్ఞవల్క్యునిపై వైశంపాయనునికి కోపం వచ్చింది. తాను నేర్పిన విద్యను తనకు తిరిగి ఇవ్వమని యాజ్ఞవల్క్యున్ని ఆదేశించాడు. యాజ్ఞ వల్క్యుడు తన తపోబలంచేత ఆ వేదాన్ని వమనం చేశాడు. అప్పుడు ఆచార్యుల ఆదేశానుసారం ఇతర శిష్యులు 'తిత్తిరి' పక్షుల రూపంలో యాజ్ఞవల్క్యుడు వమనం చేసిన యజుర్వేదాన్ని స్వీకరించారు. అందుచేత 'తైత్తిరీయం' అనే పేరు వచ్చిందని అంటారు కొందరు. ఈ వివరణను 21వ శతాబ్దంలో ఉన్న మనం అంగీకరించం. వేదాన్ని ఏమి, వమనం చేయటమేమి? శిష్యులు పక్షుల రూపంలో దాన్ని స్వీకరించడటమేమని ప్రశ్నిస్తాం. అలా ప్రశ్నించటంలో తప్పులేదు. తైత్తిరీయ సంహితకు వ్యాఖ్యానం చేసిన పండితులు భట్టు భాస్కరులవారి ఉపోద్ఘాతంలో దీన్ని ప్రస్తావించి వైశంపాయనుల శిష్యులలోనో, ప్రశిష్యులలోనో 'తిత్తిరి' అనువారొకరుండిరి. ఈ తిత్తిరి రుషి వేద, వేదాంగ పారంగుడని ప్రసిద్ధి చెందారు. సంప్రదాయ కర్తలవటం వలన బహుశ వారి పేరుతోనే కృష్ణయజుర్వేదం 'తైత్తిరీయం' నామధేయం పొంది ఉండవచ్చు' అని రాశారు. సనాతన ధర్మగ్రంథాలను అధ్యయనం చేసేవారు వివేకాన్ని వినియోగించి వివిధ వ్యాఖ్యానాలను పరిశీలించి సరైన దాన్ని స్వీకరించాలి గానీ తృణీకరించి విసర్జించరాదు.


**- రాచమడుగు శ్రీనివాసులు**

# పనిమీద శ్రద్ధ

మనలో చాలామందికి ఒక్కరే ఉండాలంటే బోరింగ్. చేతిలో ఫోన్.. లేకుంటే ఎవరో ఒకరు తమతో మాట్లాడుతూ ఉండాలనీ, కబుర్లు చెబుతూ ఉండాలనీ అనుకుంటుంటారు. మీరూ అలానే ఆలోచిస్తున్నారా! ఇంటిపని, ఉద్యోగం.. ఏ పనులైనా సరే పరిపూర్ణంగా చేయాలంటే ఏకాంతం, పనిపై శ్రద్ధ ఉండాలి. ఇక ఈ డిజటల్ యుగంలో మన దృష్టిని మరల్చే సాధనలే ఎక్కువ. మరి వీటన్నింటినీ జయించాలంటే మనసు స్థిరంగా ఉంచుకోవాల్సిందే. యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా పరిశోధన ప్రకారం సృజనాత్మకంగా ఆలోచించేవాళ్లు ఒంటరిగా ఉన్నా బోర్‌గా ఫీలవకుండా, తమ ఆలోచనలపైనే దృష్టి పెడతారట. కొత్తగా ఏం చేద్దాం అని ఆలోచిస్తుంటారు. అందుకే కొవిడ్ సమయంలో పరిస్థితులు ఎక్కువమందికి ఒత్తిడి కలిగిస్తే.. వీళ్లు ఇబ్బందీ లేకుండా ఉండగలిగారట. మనతో మనం సమయం గడపగలిగి, ఆలోచనలపై దృష్టి పెట్టగలిగితే అనుకున్న లక్ష్యాలను తేలిగ్గా సాధించగలం. ◆

# కళగా ఉండే కనకాంబరాలు

కనకాంబరం వాసన లేకపోయినా కంటికింపైన రంగుల్లో ఆకట్టుకుంట టాయివి. తేలిగ్గా ఉండి, మూడు నాలుగు రోజుల పాటు తాజాగా కనిపిస్తాయి. బతుకమ్మ పండక్కి ఈ పూలు దండల్లే ఆరి..పడచుల మనసుల్ని మురిపిస్తాయి. అయితే, సాధారణంగా కనకాంబరాలు అనగానే నారింజ, పసుపు రంగుల్లో ఉన్నవే ఎక్కువగా కనిపిస్తుంటాయి. కానీ, నేరేడు, ఎరుపు లేత గులాబీ.. వంటి మరెన్నో వర్ణాల్లోన ఇవి దొరుకుతాయి. దాంతో ఒక్క బతుకమ్మ వేడుకలోనేకాదు..పెళ్లి, పేరంటం.. ఏదైనా సరే మూరైనా కనకాంబరాల మాల తలలో పెట్టుకోవాల్సిందే అనుకుంటారు ఒకప్పటితరం. ఇలా వీటని కేశాలంకరణకే కాదు, ఇతర అలంకరణలు, దేవుడి పటాలకు దండలుగానూ వాడుతుంటారు. అంతేనా, ఈ కనకాంబరం మొక్కల్లో ఔషధ గుణాలు ఎక్కువట. ఆయుర్వేద వైద్యంలో దగ్గు, అల్సర్ నివారణా మందుల్లో వాడతారట. పుణెలోని మోడరన్ కాలేజీ నిర్వహించిన బయోటెక్నాలజీ పరిశోధనల్లో కనకాంబరాలకు సెల్‌ఫోన్‌పై పేరుకునే బ్యాక్టీరియాను తొలగించే శక్తి ఉందనీ తేలింది. ◆



# ఆస్తుల బదలాయింపు వివాదం కారణంగా కర్ణాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్ హత్య

## భార్య, కూతురు చంపినట్లు నిర్ధారణ - కళ్లలో కారం చల్లి, కత్తి, బాటిల్‌తో పొడిచి అంతమొందించినట్లు పోలీసులకు ఆధారాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** కర్నాటకలో సంచలనం రేపిన మాజీ డిజిపి ఓం ప్రకాష్ దారుణ హత్యలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ హ త్యలో ఆయన భార్య పల్లవి, కూతురు కృతి నిందితులుగా తేలారు. ఆస్తుల బదలాయింపుకు సంబంధించిన వివాదంలో ఓం ప్రకాష్‌ను భార్య పల్లవి కూతురు కృతి పథకం ప్రకారం కళ్లలో కారం చల్లి తాడుతో బంధించి అనంతరం కత్తి, పగిలిన బాటిల్‌తో కడపులో, ఒంటిపై ఇతర చోట్ల విచక్షణారహితంగా పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసులో ఓం ప్రకాష్ కుమారుడు కార్తికేష్ తన తల్లి, సోదరి నేరం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి హత్యకు వాడిన కత్తిని, బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో నగరంలో వివిఐపిలు వుండే హెచ్‌ఆర్‌ఎస్ లే అవుట్‌లో మూడంతస్తుల బంగళాలలో వుంటున్న ఓం ప్రకాష్ కొన్ని రోజుల క్రితం తనకు చెందిన ఓ ఆస్తిని బెంగళూరులోనే వుంటున్న తన సోదరికి బదలాయించారు. ఈ విషయంలో భార్య పల్లవి, కుమార్తె కృతితో ఓం ప్రకాష్‌కు గొడవలు చెలరేగాయి. ఇది కాస్త ముదిరి ఓం ప్రకాష్ భార్య పల్లవి ఆవేశంతో తన భర్తను కత్తితో పొడిచి చంపుతానని బెదిరించే వరకు వెళ్లింది. దీంతో ఓం ప్రకాష్ పది రోజుల క్రితం తన సోదరి ఇంటికి వెళ్లారు. అయితే కుమార్తె కృతి తండ్రి వద్దకు వెళ్లి బలవంతం చేసి తిరిగి శనివారం నాడు ఇంటికి తీసుకు వచ్చింది. శనివారం రాత్రి తిరిగి ఓం ప్రకాష్‌తో భార్య పల్లవి, కుమార్తె కృతి గొడవ పడ్డారు. ఆ రోజు రాత్రి వివాదం సద్దుమణిగినా ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు మళ్లీ గొడవ జరిగింది. ఓం ప్రకాష్ తన భా ర్య పల్లవి, కుమార్తె కృతిని సముదాయించేందుకు ప్రయత్నించినా వారు వినలేదు. ఆస్తిని మరొకరికి బదలాయించడంతో సహనం కోల్పోయిన పల్లవి ఒక్కసారిగా వం టింట్లో నుంచి కారం పొడిని తెచ్చి భర్త కళ్లలో చల్లింది. దీంతో ఆయన షాక్‌కు గురై కిందపడగా ఇదే అదనుగా పల్లవితో పాటు కృతి ఇద్దరు కలిసి ఓం ప్రకాష్‌ను తాడు తో చేతులు, కాళ్లు కట్టివేశారు. అనంతరం పల్లవి తన వద్ద వున్న కత్తితో పొట్టలో పలుమార్లు పొడిచింది. దీంతో పాటు ఇంట్లో పగిలిపోయిన బాటిల్‌తోనూ పలుచోట్ల పొడిచింది. ఈ సందర్భంగా పల్లవికి కూతురు కృతి సహకరించింది. భర్తను హత్య చేసిన తరువాత పల్లవి తనకు పరిచయం వున్న మాజీ ఐపిఎస్ అధికారి సతీమణికి ఫోన్ చేసి తాను తన భర్తను చంపేశానని, ఐ కిల్డ్ ద మాన్‌స్టర్ అని చెప్పి మెసేజ్ చేసింది. ఈ మెసేజ్‌ను సదరు మాజీ ఐపిఎస్ అధికారి సతీమణి చూసి, దీనిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని తరువాత ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఓం ప్రకాష్ ఇంటికి పోలీసులు రాగా అప్పటికే ఆయన రక్తపు మడుగులో పడివున్నారు. ఆయన జీవించి వుంటాడని భావించిన పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. కాగా తన తం డ్రి హత్యపై ఓం ప్రకాష్ తనయుడు కార్తికేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రి ఓం ప్రకాష్‌ను తల్లి పల్లవి, సోదరి కృతిలు హత్య చేసినట్లు ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఆస్తి బదలాయింపు విషయంలో తన తల్లి పల్లవి, తండ్రి ఓం ప్రకాష్‌తో కొంతకాలంగా గొడవ పడుతుందని, ఈ విషయంలో సోదరి కృతి కూడా తల్లికి మ ద్దతు ఇచ్చిందని అతను తెలిపారు.

దీంతో కొన్ని రోజుల క్రితం తన తండ్రి ఓం ప్రకాష్ మేనత్త ఇంటికి వెళ్లారని, అయితే శనివారం నాడు సోదరి కృతి బలవంతం చేసి ఇంటికి తెచ్చిందని ఆయన తెలిపాడు. తన తండ్రిని తల్లి పల్లవితో పాటు సోదరి పక్కా పథకంతో కళ్లలో కారం చల్లి కత్తితో, బాటిల్‌తో పొడిచి చంపారని కార్తికేష్ తెలిపాడు. తండ్రిని చంపాక తన తల్లి పల్లవి ఈ విషయాన్ని విశ్రాంత ఐపిఎస్ అధికారి సతీమణికి ఫోన్ చేసి చెప్పడంతో పాటు మెసేజ్ చేసిందని కార్తికేష్ తెలిపాడు. తన తల్లి ఒకరకమైన మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతుందని, ఇది కూడా హత్య చేయడానికి కారణమై వుండవచ్చని ఆయన తెలిపాడు.

# ప్రయాణికుల భద్రతే ప్రధానం - ఎంప్లాయ్ ఆఫ్‌ది మంథ్ అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే జీఎం జైన్



రైల్వే జీఎంచే ఎంప్లాయ్ ఆఫ్ ది మంథ్ అవార్డు అందుకుంటున్న సిబ్బంది

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 21,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి కాలంలో రైలు ప్రయాణికుల భద్రతకు,రక్షణకై చిత్తశుద్ధితో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఉద్ఘాటించారు. సోమవారం రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో జరిగిన భద్రతా,సమయపాలన సమీక్షా సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్,డిప్యూటీ జీఎం మల్లాది శ్రీనివాస్‌తో కలిసి జోన్‌లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వేస్టేషన్లలో మార్గదర్శకాలు అందించేందుకు మరికొంతమంది సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ ఏడాది మార్చి మాసంలో జోన్‌పరిధిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన సికింద్రాబాద్ డివిజన్‌లో ఇద్దరికి,విజయవాడ డివిజన్‌లో పనిచేస్తున్న ముగ్గరికి,గుంటూరు డివిజన్‌లో పనిచేస్తున్న ఒకరితో కలిపి జోన్‌వ్యాప్తంగా మొత్తం ఆరుగురు సిబ్బందికి రైల్వే జీఎం జైన్ ఎంప్లాయ్ ఆఫ్‌ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. విపత్కర పరిస్థితులను నివారించడంలో విధి నిర్వహణ పట్ల అప్రమత్తత, అంకితభావంతో పనిచేసిన వారికి ఈ అవార్డులను అందచేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకట రమణారెడ్డి, జోన్‌కు చెందిన ఆయా కీలక విభాగాలకు చెందిన ప్రధాన అధికారులతో పాటు హైదరాబాద్,సికింద్రాబాద్,విజయవాడ,గుంతకల్లు ,గుంటూరు,నాందేడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్‌ఎంలు,డివిజన్‌లకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు,సీనియర్ సబార్డినేట్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# వైద్య కళాశాల విద్యార్థుల మాల్ ప్రాక్టీసుపై నివేదిక

## 12మందిపై చర్యలకు సిఫార్సు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాలల్లో సప్లమెంటరీ ఎగ్జామ్స్‌లో ఐదుగురు ఎంబీఎస్ఎస్ విద్యార్థులు మాల్ ప్రాక్టీసుకి పాల్పడుతూ పట్టుబడిన అంశంపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యే విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.మాల్ ప్రాక్టీసులో వైద్య కళాశాలలో కీలక విభాగం నిర్లక్ష్యం ఉన్నట్టు నిర్ధారణ విచారణ కమిటీ నివేదికలో స్పష్టంగా తెలిపింది.ఈ ఘటనలో . 12 మందిపై చర్యలు తీసుకోవాలని.. కళాశాల సూపరెండెంట్ ఎగ్జామినర్, డిప్యూటీ సూపరింటెండెంట్, 8 మంది ఇన్విజలేటర్లు, ఇద్దరు క్లర్క్‌లపై చర్యలకు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఉద్యోగులపైబదిలీలేనిపక్షంలోకోడ్‌ఆఫ్ కండక్ట్ కింద చర్యలుతీసుకునే అవకాశం ఉంది.

# తిరుమల ఘాట్‌లో అగ్నికి ఆహుతైన కారు

**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** వాతావరణంలో మార్పులతో వేసవిలో సూర్యుని తీవ్రతకు ఉష్ణోగ్రతలు 41డిగ్రీలు నమోదవుతున్నాయి, ఈ వేడికి వాహనాలు కూడా పలు కారణాలతో ఇంజిన్ వేడిగా మారి మంటలు వ్యాపించి వాహనాలు దగ్గమైపోతున్నాయి. తిరుమల ఘాట్‌లో, తిరుమలలో రెండురోజుల్లో రెండు కార్లు మంటలకు ఆహుతయ్యాయి. ఈ నేపథ్యంలో రానున్న రెండునెలలు వేసవిలో యాత్రికులు తమ వాహనాలను జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాల నుండి కాపాడుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి,హర్షవర్ధన్‌రాజు సూచించారు. సుదూర ప్రాంతాల నుండి తిరుమలకు వచ్చే యాత్రికులు తమ యాత్రకు ముందు వాహనాలను సర్వీసింగ్ చేయించాలని, ఇంజిన్ ఆయిల్, కూలెంట్ , బ్రేక్ ఆయిల్, ఏసి ఆయిల్ తనిఖీ చేయాలని సూచించారు. రేడియేటర్ లీకేజీ లేకుండా చూసుకోవాలి. ఫ్యాన్‌బెల్ట్ సరిచూసుకోవాలి. ప్రయాణంలో వాహనాల డ్రైవర్లు ప్రతి రెండుగంటలకోసారి వాహనం ఆపి ఐదు నిమిషాలు పాటు నడక చేయడం, స్వల్ప వ్యాయామం చేయడం, మంచినీరు తాగడం చేయాలి. తిరుమల ఘాట్‌లో ప్రయాణించే ముందు కనీసం 30నిమిషాలు వాహనాన్ని ఆపి విశ్రాంతి నివ్వాలని, ఘాట్‌లో కొండకు వచ్చేముందు ఏసి ఆఫ్‌చేయాలని,బండి దిగే సమయంలో ఎక్కువగా బ్రేక్ వాడకుండా, ఇంజిన్ బ్రేకింగ్ వాడటం మంచిదని సూచించారు.



# రాష్ట్రం మీదుగా దక్షిణాది నుంచి బీహార్‌కు వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 21,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీదుగా దక్షిణాది నుంచి నుంచి బీహార్‌కు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తమిళనాడులోని పోదనూరు నుంచి బీహార్‌లోని బరౌని వెళ్లే నెంబర్ 06056ప్రత్యేక రైలు ఈ నెల 26నుంచి మే 24వరకు ప్రతి శనివారం ఉదయం 11.50గంటలకు పోదనూరు నుంచి బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం 2.30గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని నుంచి పోదనూరు వెళ్లే నెంబర్ 06057ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29నుంచి మే 27వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.45గంటలకు బరౌని నుంచి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 3.45గంటలకు పోదనూరు చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు రాష్ట్రంలోని గూడూరు, నెల్లూరు,ఒంగోలు, విజయవాడ,ఏలూరు,తాడేపల్లి గూడెం, రాజమండ్రి,దువ్వాడ,సింహాచలం నార్త్, విజయనగరం, బొబ్బిలి,పార్వతీపురం స్టేషన్లతో పాటు తమిళనాడు,ఒడిశా,ఝార్ఖండ్,పశ్చిమ బెంగాల్,బీహార్ రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

# 15రోజుల్లో తిరుమలలోని మఠం ఖాళీచేయాలని నోటీసులు

## -విశాఖ శారదాపీఠం మఠం భవనం టిటిడి ఆధీనంలోకి

**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి ఇష్టానురీతిలో విశాఖశారదాపీఠానికి స్థలం కేటాయిస్తూ ఆమోదించడం, అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేయడంతో హైకోర్టు ధర్మాసనం తీవ్రస్థాయిలో ఆగ్రహించింది. మఠం అక్రమభవననిర్మాణమంటూ ఇప్పటికే తిరుమలలో పలు హిందూ సంఘాల స్వామీజీలు, జనసేనపార్టీ నేతలు, ధర్మపరిరక్షణ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సమగ్ర విచారణ చేసిన రాష్ట్రహైకోర్టు ధర్మాసనం టిటిడికి అనుకూలంగా తీర్పు వెలువడించింది.



ఈ నేపధ్యంలో తిరుమలలోని విశాఖ శారదాపీఠం మఠం ఖాళీ చేయాలంటూ సోమవారం టిటిడి అధికారులు నోటీసులు ఇచ్చారు. తిరుమల హిందువుల పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ కొలువైన కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు,స్వాములు, హిందూ సంఘాల సభ్యులు వస్తుంటారు. అంతేగాక మధ్యతరగతి,సామాన్యవర్గాల ప్రజలు యువతీయువకుల కళ్యాణాలను మఠాలలో జరిపిస్తుంటారు. తిరుమలలో పాపవినాశనం మార్గంలోని గోగర్భమ్‌డ్యామ్ ప్రాంతంలో నలభైకిపైగా పలు మఠాలు భవనాలను నిర్మించుకుని వ్యాపారాలు చేస్తున్నాయనేది హిందూ సంఘాల ఆరోపణలు. ఇదే విషయంగా తిరుమలలోని విశాఖ శారదాపీఠం మఠానికి గత ఐదేళ్ళ టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు కొండపై 20వేల చదరపు అడుగులు స్థలాన్ని లీజుకు కేటాయించారు. ఈ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా రెండేళ్ళ నుండి మఠం నిర్వాహకులు భవననిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే భవనం నిర్మాణం జరిగింది. తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా ఈ అక్రమనిర్మాణమంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఈ విషయంపై విచారణ చేసిన హైకోర్టు టిటిడికి అనుకూలంగా తీర్పును వెల్లడించింది. శారదాపీఠం భవనాన్ని టిటిడి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అక్రమనిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ నిర్మాణాలను కూల్చివేయాలనిహైకోర్టు న్యాయస్థానం పేర్కొంది. ఈ ఆదేశాలతో విశాఖ శారదాపీఠం నిర్మించిన మఠానికి టిటిడి సోమవారం నోటీసులు జారీచేసింది. నిబంధనల ప్రకారం లీజును రద్దుచేస్తూ పదిహేనురోజుల్లోపు మఠం ఖాళీచేయాలని తమకు అప్పగించాలని టిటిడి రెవెన్యూ ఎస్టేట్ అధికారి నోటీసుల్లో పేర్కొన్నారు.

# 'థగ్ లైఫ్' ఫస్ట్ సింగిల్ రిలీజ్

కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ నుంచి మొదటి సింగిల్ జింగుచాను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. లెజెండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్, శింబు, త్రిష వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ లాంచ్ కోసం నిర్వహించిన ఈవెంట్‌తో దేశం మొత్తం థగ్ లైఫ్ వైపు చూసింది. ఈ వేడుకల్లో కమల్ హాసన్, మణిరత్నం, మార్మోగి పోయేలా జింగుచా అనే ఫస్ట్ సింగిల్‌ను కాసేపటి క్రితమే రిలీజ్ చేశారు. ఈ పాటకు కమల్ హాసన్ సాహిత్యాన్ని అందించారు. ఇక రెహమాన్ బాణీ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసభరితంగా ఉంది. థగ్ లైఫ్ చిత్రాన్ని తమిళనాడులో రెడ్ జెయింట్ మూవీస్, ఓవర్సీస్‌లో హోమ్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో, ఎపి ఇంటర్నేషనల్ సంయుక్తంగా రిలీజ్ చేస్తున్నాయి. ఇక నార్త్ ఇండియాలో పెన్ మరుధర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్, తెలుగులో శ్రేష్ట్ మూవీస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాయి. కర్ణాటకలో ఫైవ్ స్టార్ సెంథిల్ భారీ ఎత్తున విడుదల చేస్తోంది. థగ్ లైఫ్ ఆడియో హక్కులను సారెగామా భారీ రేటుకి సొంతం చేసుకుంది. ఈ చిత్ర డిజిటల్ హక్కుల్ని నెట్‌ఫ్లిక్స్ చేజిక్కించుకుంది. జూన్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా థగ్ లైఫ్ థియేటర్లలో విడుదలకు సిద్ధం అవుతోంది. జస్ట్ గ్రో ప్రొడక్షన్స్ సహకారంతో



థగ్ లైఫ్ ఫెస్టివల్‌ను కూడా టీం ప్రకటించింది. ఇది మే 23వ తేదీన శుక్రవారం నాడు ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఈ ఈవెంట్ జరగనుంది. ఆ మ్యూజికల్ ఈవెంట్‌లో ఏఆర్ రెహమాన్ కూడా ప్రదర్శన ఇవ్వనున్నారు. థగ్ లైఫ్‌లో కమల్ హాసన్ రంగరాయ శక్తివేల్ నాయకర్‌గా నటించారు. శింబు, త్రిష కృష్ణన్, ఐశ్వర్య లక్ష్మి, అశోక్ సెల్వన్, అభిరామి, జోజు జార్జ్, నాసర్, అలీ ఫజల్, సన్యా మల్హోత్రా వంటి అనేక మంది ప్రశంసలు పొందిన నటీనటులు ముఖ్య పాత్రలను పోషించారు.

ఎ.ఆర్. రెహమాన్ సందడి చేశారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, ఆర్. మహేంద్రన్, మద్రాస్ టాకీస్, శివ అనంత్ నిర్మించిన థగ్ లైఫ్ ప్రస్తుతం అందరి అంచనాలను అమాంతం పెంచేసింది. పెళ్లి వేడుకల్లో

# 'షష్టిపూర్తి' నుంచి టీజర్

రూపేష్, ఆకాంక్షా సింగ్ హీరో, హీరోయిన్లుగా, లేడీస్ టైలర్థ్ కపుల్ రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రధారులుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ చౌదరి నిర్మిస్తున్న చిత్రం షష్టిపూర్తి. ఈ సినిమాకి వున్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ఈ చిత్రానికి విశ్వవిఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతాన్ని అందించారు. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ఆర్.కె. సినీ మాక్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా సినిమాటోగ్రాఫర్ రామ్ మాట్లాడుతూ, ఇలాంటి లెజండరీస్‌తో వర్క్ చేయడం చాలా గొప్ప అవకాశంగా నేను అదృష్టవంతుడిని అన్నారు. కథానాయిక ఆకాంక్షాసింగ్ మాట్లాడుతూ, నాకు ఈసినిమా చాలా గొప్ప అనుభవం. ఇంత గొప్పవారితో వేదిక పంచుకోవడం, వారు సినిమాకి పని చేయడం నా అదృష్టం. నవరసభరితమైన ఈ సినిమా మాకు గర్వ కారణంగా నిలుస్తుంది అన్నారు. కళా దర్శకుడు తోట తరణి మాట్లాడుతూ, యూనిట్ బాగా పని చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను అన్నారు. ఈ సినిమాకి పనిచేయడం నాకు చాలా నచ్చిందని అన్నారు. కథానాయకుడు, నిర్మాత రూపేష్ మాట్లాడుతూ, ఇంత పెద్ద దిగ్గజాలతో పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. అందరికీ కృతజ్ఞతలు అన్నారు. కీరవాణి మాట్లాడుతూ, ఈ సినిమాలో రాజా సార్ ట్యూన్‌కి నేను రాసిన పల్లవి ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం.. నీదో, మాట్లాడుతూ, ఇంత గొప్ప వారు నా సినిమాకి పని చేయడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది.



భావిస్తున్నాను అన్నారు. గీత రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడుతూ, ఈ షష్టి పూర్తి సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే, కీరవాణికి చాలాపాటలు రాశాను. నాకు మిగిలిపోయిన ఆశ ఇళయరాజాకి ఒక్క పాటైనా రాయాలని. నాకు మూడు పాటలు రాసే అవకాశం నాకు ఈ సినిమా ఇచ్చారు. ఈ సినిమా రూపొందించడంలో పవన్ ప్రభ, రూపేష్ అద్భుతమైన కృషి చేశారు. ఈ సినిమాకి కీరవాణి పాట రాశారు. అది ఒక అద్భుతంలా జరిగింది. మేం చెప్పిన 20 నిమిషాల్లోనే అద్భుతమైన పాట రాశారు అన్నారు. దర్శకుడు పవన్ ప్రభ నీవల్ల నాదో ఈ పరవశం. రాగం నీదై, పల్లవి నాదై చరణం, చరణం కలిసిన వేళ పయనాలు ఏ హిమాలయాలకో అనే పాట రాశాను. ఈ సినిమాలో నేను రాసిన పాట ఈ సినిమాలోని సందర్భంతో పాటు, నా జీవితానికి కూడా సంబంధించింది. నేను కేవీ మహదేవన్ వీరాభిమానిని. ఆయన పాటలంటే చాలా ఇష్టం. ఆయన చేసిన పాటలన్నీ నాకు తెలుసు. ఇళయరాజా సంగీతానికి అభిమానిగా మారాను. ఆ తర్వాత చాలా సంవత్సరాల తర్వాత నేను మద్రాసు వెళ్ళినప్పుడు, ఇళయరాజా ఇల్లుని ఆరాధనా భావంతో చూసేవాడిని. అన్వేషణ సినిమాలో కీరవాణి అంటూ సాగే పాట వుంది.

# 'ఎన్టీఆర్-నీల్'లో 22 నుంచి తారక్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్.. ప్రపంచ వ్యాప్తంగా ఈయనకున్న మాస్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈయన కెజియఫ్, సలార్ వంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్స్ చిత్రాలను రూపొందించిన బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో ఓ యాక్షన్ ఎపిక్ మూవీ కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇటీవల ఎన్టీఆర్ నీల్ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా ప్రారంభమైంది. అనౌన్స్‌మెంట్ రోజు నుంచే సినిమాపై అభిమానులు, ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. రీసెంట్‌గా ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. ఈ క్రేజీ మూవీ సెట్స్‌లోకి ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు అడుగు పెడతాడా అని అభిమానులు సహా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం వచ్చేసింది. ఏప్రిల్ 22 నుంచి షూటింగ్‌లో మ్యాన్ ఆఫ్ మాసెస్ పాల్గొంటున్నారు. దీని కోసం ఆయన హైదరాబాద్ నుంచి కర్ణాటకకు వెళుతున్నారు. రోజు రోజుకీ ఈ కాంబోపై ఎక్స్‌పెక్టేషన్స్ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్టీఆర్ చిత్రీకరణలో పాల్గొన బోతుండటంతో అందరిలో ఆసక్తి రెట్టింపు అయ్యింది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కలయిక వెండితెరపై ఎలాంటి మ్యాజిక్‌ను క్రియేట్ చేస్తుందోనని అందరూ ఆతృతగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పుడుసెట్స్‌లోకి ఎన్టీఆర్ అడుగు పెట్టబోతున్నారనే వార్త ఆయన అభిమానులు, ప్రేక్షకులకు సరికొత్త ఉత్సాహాన్నిస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్స్‌నుతెరకెక్కించిన ప్రశాంత్‌నీల్ యూనిక్ మాస్ విజన్‌తో ఎన్టీఆర్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఇది సినీ ఇండస్ట్రీలో సరికొత్త మైలురాయిని క్రియేట్ చేయనుంది.



# 'వీర చంద్రహాస' తెలుగు రైట్స్ ఎమ్‌వి రాధాకృష్ణకే

కేజీయఫ్, సలార్ లాంటి యాక్షన్ చిత్రాలకు సంగీతం అందించి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక సంచలనం సృష్టించిన రవి బస్రూర్.. ఇప్పుడు దర్శకుడిగా కూడా సత్తా చాటుతున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన కన్నడ చిత్రం వీరచంద్రహాస. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించగా, శిథిల్ శెట్టి, నాగశ్రీ జిఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వేగర్, గుణశ్రీ ఎం నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. ఏప్రిల్ 18న కన్నడలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. తెలుగులోనూ ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతున్నారు. మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధా కృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద్గ, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస్థ చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన.. తాజాగా వీర చంద్రహాస తెలుగు రైట్స్‌ను దక్కించు కున్నారు. అతి త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ, రీసెంట్‌గా కన్నడలో విడుదలైన వీర చంద్రహాస్థ చిత్రానికి హిట్ టాక్‌తో పాటు మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ మూవీ తెలుగు రైట్స్ దక్కించుకోవడం చాలా ఆనందంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి తెలుగు ఆడియెన్స్‌ను కూడా బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నా. సినిమా సక్సెస్ గ్యారెంటీ అని నమ్ముతున్నా. తనదైన సంగీతంతో అందర్నీ అలరించిన రవి బస్రూర్ ఇప్పుడు దర్శకుడిగానూ సత్తా చాటడం సంతోషంగా ఉంది అని అన్నారు. వీర చంద్రహాస అనేది మహాభారతంలోని అశ్వమేధిక పర్వంలోని కథ. ఇది ఒక అనాథ కుర్రాడి యొక్క గొప్ప కథను చెబుతుంది. పరాక్రమ వంతుడు, సద్గుణవంతుడు వీర చంద్రహాసుడు అవుతాడు. సినిమా చరిత్రలో మొట్టమొదటి సారిగా యక్షగానం వెండి తెరపై పూర్తి వైభవంతో రావడం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీయెన్స్ ఇచ్చేలా ఉంటుంది.



# 'కుబేర' నుంచి 'పోయిరా మామా'!

పాన్-ఇండియా విజువల్ ఫీస్ట్ కుబేర ఫస్ట్ సింగిల్ పోయిరా మామా రిలీజ్ అయింది. ఇది సౌండ్ సునామీ, మూడు జాతీయ అవార్డ్ విజేతలు ధనుష్, దర్శకుడు శేఖర్ కమ్ముల, రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కలయికలో మ్యూజిక్ బ్లాస్ట్. రాక్‌స్టార్ డిఎస్‌పి అందించిన ఈ పాట ఎక్స్‌ప్లోసివ్ ఎనర్జీతో ఉంది. ఫుట్ టాపింగ్ బిట్స్‌తో ప్రేక్షకులు హృదయాలను వెంటనే గెలుచుకుంటాయి. ధనుష్ స్వయంగా పాడిన వాయిస్ ఈ పాటకి మరింత ఫీల్ తీసుకొచ్చింది – అతని గాత్రంలో ఉన్న మాగ్నెటిక్ ఫోర్స్ పాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. భాస్కరభట్ల రాసిన సాహిత్యం అందరినీ అలరిస్తూ, మాస్ టచ్‌కి తగిన రిథమిక్ మ్యాజిక్ ను అందించింది. శేఖర్ వి.జె అందించిన కొరియోగ్రఫీ పాటను ఒక విజువల్ ట్రీట్ గా మలిచింది – ధనుష్ డాన్స్‌లో చూపిన స్పిరిట్, ఎనర్జీ, ఒరిజినాలిటీ ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది. ఈ పాటలో విజువల్స్, వాయిస్, సాహిత్యం, కొరియోగ్రఫీ అన్నీ కలసి ఒక అద్భుత అనుభూతిని అందిస్తున్నాయి. పోయిరా మామాతో కుబేరా మీద ఉన్న హైప్ నెక్స్ట్ లెవెల్‌కి చేరుకుంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన కుబేర భావోద్వేగాలు, డ్రామా, గ్రాండ్ విజువల్స్ కలిగిన మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్. జూన్ 20న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రంలో ధనుష్, నాగార్జున, రష్మికమందన్నా మరియు జిమ్ సార్ఫ్ వంటి స్టార్ తారాగణం ఉంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై సునీల్ నారంగ్ ,పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో రూపొందించబడింది హిందీ, కన్నడ, మలయాళం భాషలలో విడుదల కానుంది – ఇది ట్రూ పాన్ ఇండియన్ మూవీ.



# 'ఏఎల్‌సిసి' టికెట్ లాంచ్

యెల్ ఆర్ ఫిల్మ్‌సర్క్యూట్స్ బ్యానర్‌పై లేలీధర్ రావు కోలా దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఏ ఎల్ సి సి (ఓ యూనివర్సల్ బ్యాచిలర్). రీసెంట్‌గా ఈ సినిమా ట్రైలర్ విడుదలై ఎంతగానో ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో జెపి నవీన్ మాట్లాడుతూ, ఇక్కడికి వచ్చిన పెద్దలకు, మీడియా మిత్రులకు అందరికి కృతజ్ఞతలు. ఒక యంగ్ స్టర్ ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా హీరోగా ఎంట్రీ అవ్వడం అంటే చాలా కష్టం. అది మీ మీడియా వారికి బాగా తెలుసు. నాలాంటి వ్యక్తికి ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన దర్శకుడు లేలీధర్ రావుకి కృతజ్ఞతలు.. ఈ సినిమా సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ చాలా బాగా కుదిరాయి. మాలాంటి కొత్తవాళ్ళని దయచేసి సపోర్ట్ చెయ్యండి అని అన్నారు. హీరోయిన్ శ్రావణి శెట్టి మాట్లాడుతూ, ముందుగా స్టేజి మీద ఉన్న పెద్దలందరికి నా నమస్కారాలు. నాకు ఈ అవకాశం ఇచ్చిన లేలీధర్ రావుకి కృతజ్ఞతలు.. ఈ సినిమా సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ చాలా బాగా కుదిరాయి. లేలీధర్ రావు ఒక టీచర్.. అలాంటిది ఆయన ఒక ప్యాషన్‌తో డైరెక్టర్‌గా మారి ఈ సినిమా చేశారు. తప్పకుండా ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. అందరికి నచ్చుతుంది అని అన్నారు. డైరెక్టర్ నగేష్ మాట్లాడుతూ, ముందుగా ఇక్కడికి విచ్చేసిన వారందరికీ నమస్కారాలు. చిన్న సినిమా, పెద్ద సినిమా అనే విషయం పక్కనపెడితే.. వైవిధ్యమైన సినిమాలను తప్పకుండా ప్రోత్సహించండి. ఈ సినిమా చిన్న సినిమా అయినా, ఒక వైవిధ్యమైన సినిమా. డైరెక్టర్ లేలీధర్ రావు కోలా చాలా బాగా తీశారు. నష్టాలు వస్తున్నాయని రైతు వ్యవసాయం ఆపడు. మేము కూడా అంతే. సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయని సినిమాలు చెయ్యడం మానము. ఇంకా కొత్త కొత్త సినిమాలు చెయ్యడానికి ప్రయత్నిస్తాం." అని అన్నారు. డైరెక్టర్ సముద్ర మాట్లాడుతూ, లేలీధర్ రావు కోలా ఒక మంచి టీచర్. పిల్లల భవిష్యత్తు కోసం గొప్ప గొప్ప పాఠాలు చెప్పారు. అలాంటి గొప్ప టీచర్ నేడు డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా మారి ఈ సినిమా చేశారు. ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఇక ఈ సినిమా డైరెక్టర్ లేలీధర్ రావు కోలా మాట్లాడుతూ, మా సినిమాని ఎంకరేజ్ చెయ్యడానికి వచ్చిన పెద్దలకు మీడియా మిత్రులకు నా నమస్కారాలు. ఈ సినిమాని ఎంతో ఇష్టంగా తీశాను. కచ్చితంగా ప్రేక్షక దేవుళ్ళకు నచ్చుతుందని భావిస్తున్నాను. ఈ సినిమా కోసం నా టీం చాలా కష్టపడింది. వారందరికీ పేరు పేరున నా ధన్యవాదాలు. ఈ సినిమాని సపోర్ట్ చెయ్యడానికి వచ్చిన నగేష్‌కి, సముద్రాలకి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అని అన్నారు.






కీర్తి సురేష్ నయా లుక్

# మే 23న 'ఎసిఇ'

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన మోస్ట్ ఎవైటెడ్ మూవీ ఎసిఇ మే 23, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. అఫీషియల్ అనౌన్స్ మెంట్‌తో పాటు స్పెషల్ పోస్టర్ కూడా విడదల చేశారు. సినిమా ఇప్పటికే సంచలనం సృష్టించడం ప్రారంభించింది. అరుముగకుమార్ దర్శకత్వం వహించిన ఎసిఇలో విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్, యోగి బాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్‌కుమార్ వంటి స్టార్ తారాగణం ఉన్నారు. ఈ చిత్రాన్ని 7సిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అరుముగకుమార్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇది కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని కరణ్ బహదూర్ రావత్ నిర్వహి స్తున్నారు, జస్టిన్ ప్రభాకరన్ పాటలు కంపోజ్ చేస్తున్నారు. సామ్ సి.ఎస్. నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఎడిటింగ్‌ను ఫెన్నీ ఆలివర్ నిర్వహి స్తున్నా. ఆర్ట్ డైరెక్షన్‌ను ఎ.కె. ముత్తు పర్యవేక్షిస్తున్నారు. పూర్తిగా మలేషియాలో చిత్రీకరించబడిన ఎసిఇ చిత్రం టైటిల్ టీజర్, గ్లింప్స్, పాటల ద్వారా ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది, హై ఆక్టేన్ యాక్షన్, గ్రిప్పింగ్ నెరేటివ్ బ్లెండ్‌తో వస్తున్న ఈ చిత్ర కోసం విజయ్ సేతుపతి అభిమానులు, సినిమా ప్రేమికులు, ట్రేడ్ వర్గాల్లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'ఓదెల 2' డివైన్ సక్సెస్ మీట్

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తన రూటు మార్చి తొలిసారి నాగసాధువుగా నటించిన చిత్రం ఓదెల్థ. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్‌గా సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై హిట్ టాక్‌తో దూసుకెళ్తోంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్యమైన పాత్రలు పోషించిన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు పరమశివుడి దర్శనం కల్పించింది. సినిమా చూసిని ప్రతి ప్రేక్షకుడూ డివైన్ ఫీల్‌తో బయటకు వచ్చి ఎంతో గొప్పగా మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ డివైన్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నిర్మాత మధు మాట్లాడుతూ, ఓదెల2లో యాక్ట్ చేసిన నటీనటులందరికీ ధన్యవాదాలు. సంపతి నంది, నేను కలిసి ఒక మంచి సినిమా చేయాలని అనుకున్నాం. అనుకున్నట్లుగానే మంచిభక్తిభావం ఉన్న సినిమాను తీశాం. ఈ సినిమా ద్వారా కాశీని చూశాం. మహాకుంభమేళాలో టీజర్ లాంచ్ చేశాం. ఈ సినిమా ద్వారా నా లైఫ్‌లో ఎన్నో మిరాకిల్స్ జరిగాయి. ఈ సినిమా గురించి కొన్ని రివ్యూస్ చూసి నా చాలా ఆశ్చర్యపోయా. ప్రేక్షకులంతా సినిమా బాగుందని అంటుంటే.. రివ్యూయర్స్ కొంతమంది మాత్రం నెగిటివ్‌గా రాశారు. అది మంచి పద్ధతి కాదు. ఈ రివ్యూస్ ఏంటో.. ఈ సినిమా ప్రపంచం ఏంటో నాకు కొత్తగా అనిపిస్తోంది. రివ్యూయర్స్ కంటే ప్రేక్షకుల ఫీలింగ్ మాకు ముఖ్యం. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ చాలా బాగుందని చెప్తున్నారు. అందుకే అందరూ థియేటర్‌కు వచ్చి డివైన్ ఫీల్‌ను ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ అశోక్ మాట్లాడుతూ, సినిమా బాగుంటేనే కలెక్షన్స్ పెరుగుతాయి. సినిమా బాగుంటేనే మౌత్ టాక్ స్ప్రెడ్ అవుతుంది. అది మా ఓదెల2కి జరుగుతోంది. రివ్యూస్ అనేది ఒకరి అభిప్రాయం. కానీ మేము సినిమా తీసింది అందరికోసం. కచ్చితంగా చూడండి. అందరికీ నచ్చుతుంది అని చెప్పారు. నటుడు వశిష్ట ఎన్ సింహా మాట్లాడుతూ, ఇక్కడున్న ఓదెల2 ఫ్యామిలీ చాలా మంచి ఫ్యామిలీ. అందరికీ మంచి జరగాలిఅని కోరుకునే సభ్యులున్న ఫ్యామిలీ ఇది. సంపత్ నంది లేకపోతే ఈ జర్నీ ఇలా ఉండేది కాదు. మనం ఇక్కడ ఎంత మాట్లాడినా.. మన సినిమా థియేటర్‌లో మాట్లాడుతోంది. మన సినిమాలో ఉన్నట్లు దేవుడి శక్తి తెలియాలంటే దుష్టశక్తి గురించి కూడా తెలియాలి. ఈ రివ్యూస్ లాంటి నెగిటివిటీ కూడా అలాంటిదే. వీలైతే మంచిని పంచాలని కానీ.. చెడును స్ప్రెడ్ చేయకూడదు. క్లైమాక్స్‌లో శివుడి దర్శనం జరిగేటప్పుడు ఆడియన్స్ దేవుడికి దండం పెడుతున్నారు. సినిమా వాళ్లకు నచ్చకపోతే అలాచేయరు. నిజంగా ఇది గొప్ప సినిమా. అందుకే రోజురోజుకూ కలెక్షన్స్ పెరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులో కూడా మంచి కలెక్షన్స్ వస్తున్నాయి.



# కొనుగోలు కేంద్రాలు తెరిచారు.. రైతన్న ఇబ్బందులు మరిచారు

## ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో రాని స్పష్టత

### రైతులపై హమాలీ భారం

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం7337 కొనుగోలు కేంద్రాలను కేంద్రాలను ప్రారంభించామని పౌరసఫరాలశాఖ, కార్పొరేషన్ గణాంకాలు వండివార్చుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం సేకరణ రైతుకు శాపంగా మారింది. తేమకొలిచే యంత్రాలు మొరాయించడం, ప్రభుత్వ గోదాముల్లో భద్రపరిచే ధాన్యం హమాలీచార్జీల భారం రైతుపై వేయడం,హమాలీల కొరత వంటి బాలారిష్టాలు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాచేలా చేస్తున్నాయి. తెలంగాణలో ఏప్రిల్ నెల ఆరంభం నుంచి నిత్యం ఈదురుగాలులు,అకాలవర్షాలు, వడగండ్ల వానలు కురిసి ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంటను కళ్ళాల వద్ద వర్షార్పణం అవుతుండటంతో రైతులు కంట తడిపెడుతున్నారు. రబీసీజన్‌లో ఐకెపి,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ఇతర ఏజన్సీలతో కలిసి 8329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఇందులో 91శాతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా అందులో అనేక సమస్యలు ఉండటంతో తూకం వేయడంలేదు. అనేక కొనుగోలు కేంద్రాలలో పక్షం రోజులకు పైగా ధాన్యం విక్రయానికి తెచ్చి కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు కాస్తున్నారు.ధాన్యంలో తేమ కొలిచే యంత్రాలు సరిగా పనిచేయకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా మారింది. అకాలవర్షాలు,వడగండ్ల కారణంగా రబీ సీజన్‌లో కూడా తేమను నిర్ధారించుకొని ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తున్నది. సగటు నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యంకు 14శాతం తేమ ఉండాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువైతే కనీస మద్దతు ధరలో ఒక్కొక్క శాతానికి నిర్ధారించి పద్ధతిలో ధరను తగ్గిస్తారు. తేమ యంత్రాలు సరిగా లేకపోవడంతో వేసవిలో కూడా ధాన్యంలో తేమ కొన్ని చోట్ల 29శాతం మించి చూపుతున్నాయి. మండే ఎండలో అంత తేమ ఉండదని రైతులు చెబుతున్నా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మళ్ళీ ధాన్యం ఆరబోసి ఎండిన తరువాత తీసుకొని రమ్మంటున్నారు. పనిచేయని యంత్రాలు ఎంత ఎండబోసినా తప్పుడు తేమనే చూపుతున్నాయి.కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం ఖండెబల్లూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమను ఒక్కో యంత్రం ఒక్కో విధంగా చూపుతుండటంతో రైతులు సహకార సంఘం కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట,గోపురపల్లి, కాల్వాశ్రీరాంపూర్ గంగారం, తారుపల్లిలో కూడా తేమకొలిచేయంత్రాలు, ధాన్యంలోని మట్టి,ఇతరాలను వేరు చేయడానికి ఉండాల్సిన జల్లెడలు, ఆరబోత మిషన్లు సరిగా లేకపోవడం దీనికి తోడు హమాలీలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.రైతులు దొడ్డు రకాన్ని ట్రేడర్లకు విక్రయించి సన్నరకాలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని రైతులు భావించినప్పటికి కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇక ఎంతకో కొంతకు అన్ని ప్రైవేట్‌కు విక్రయించు కొంటున్నారు. పక్షం రోజులుగా వర్షాలు పడుతుం డటంతో అకాల వర్షంలో ధాన్యం తడవకుండా కాపాడుతోకోవడానికి ఎక్కడ కూడా టార్పాలిన్లు రైతులకు అందుబాటులో లేవు. హమాలీలు కూడా కొనుగోలు కేంద్రాలలో కొరతగా ఉండటంతో తూకం వేయడంలో కూడా జాప్యం జరగడానికి కారణమైంది. బీహార్ ఉత్తర్ ప్రదేశ్ నుంచి కూలీలు రావడం ఆలస్యం అవుతుండటంతో మెదక్ జిల్లా చేగుంట, హవేలి ఘనపూర్, వెల్దుర్తి, దొంతి, మక్కరాజ్‌పేటలో రహదారులు, కళ్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు కుప్పలు,తెప్పలుగా పేరుకొని పోయాయి. మెదక్ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలోని 15 కొనుగోలు కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలోని ఐదుకొనుగోలు కేంద్రాలు మాత్రమే ధాన్యం సేకరణ చేస్తున్నాయి.మిగితా చోట్ల అనేక సమస్యలు సేకరణకు అడ్డుగ నిలుస్తున్నాయి.కాంటా వేసిన ధాన్యం బస్తాలను ఏ మిల్లుకు పంపాలో ప్రభుత్వం నిర్వహకులకు తెలపకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరణ చేసిన ధాన్యం బస్తాల దిగుమతి కేటాయించిన మిల్లు యజమానులు గతంలో భరించేవారు. ఇప్పుడు మిల్లులపై స్పష్టత రాకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరించి ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో స్పష్టత లేకపోవడంతో గోదాముల్లో నిల్వచేసే ధాన్యం హమాలి కూలీ వ్యయం రైతుకు ఆర్థికభారంగా మారింది. మిల్లులకు కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా గతంలో దిగుమతి హమాలి వ్యయం మిల్లర్లు భరించేవారు. రైతుల నుంచి ఇప్పుడు కొన్ని చోట్ల రూ.8 నుంచి రూ.10 బస్తాకు వసూలు చేస్తున్నారని కొంత మంది రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల 40కిలోల బస్తాకు 5రూపాయలు హమాలీ చొప్పున రైతుపై భారం వేస్తున్నారు. క్వింటాల్‌కు 12.5రూపాయలు హమాలీ ఖర్చు రైతుపై పడుతోన్నది. తుంగతుర్తి మండల కేంద్రంలో ధాన్యం రాశులతో కొనుగోలు కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి పదిరోజులైనా అక్కడ కాంటా మొదలు కాలేదు. ఎఇఓ తేమ శాతం కొలిచి కాంటా వేసేందుకు జాప్యం జరుగుతోంది. సూర్యాపేట జిల్లాలో సహకార సంఘాల ద్వారా కొనుగోళ్ళు మొదలయ్యాయి. కాంటా వేసిన బస్తాలు మిల్లులకు తరలించగా మిల్లర్లు సాకులు చూపుతూ బస్తాలు దింపుకోవడంలేదు. రైతులు మిల్లరు విధించే కోతలకు ఒప్పుకోవాల్సివస్తున్నది. దీనికి తోడు ఒక్కో మిల్లుకు కేవలం వెయ్యి ,పదిహేను వందల క్వింటాళ్ళమేరకు ధాన్యం దిగుమతికి అనుమతి ఇవ్వగా వారి లక్ష్యం రెండురోజుల్లో కేటాయింపుల పరిమితి పూర్తికావడంతో మిల్లర్లు చేతులు ఎత్తేస్తున్నారు.



# చెన్నమనేని రమేష్ జర్మనీ పౌరుడే!

## హైకోర్టు తీర్పు.. పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడిని : ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భారత పౌరుడు కాదని, జర్మన్ పౌరుడని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఆయన పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేయగా తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు సోమవారం తీర్పును వెల్లడించింది. తప్పుడు పత్రాలతో 15 ఏళ్ల పాటు ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాలను చెన్నమనేని రమేశ్ తప్పుదోవ పట్టించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్థించింది.అలాగే ఆయనను రూ.30 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపింది. న్యాయస్థానం తీర్పుపై అప్పీల్ చేయకుండా తన తప్పును ఒప్పుకుని చెన్నమనేని రమేశ్ రూ. 30 లక్షల ఫైన్ చెల్లించారు. చెన్నమనేని రమేష్ తప్పుడు పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ చేయకుంటే పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడినని అంటూ వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ తీర్పుపై వ్యాఖ్యానించారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన రమేష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆది డిమాండ్ చేశారు. చెన్నమనేని భారతీయుడు కాదని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను పదిహేనేళ్ళ సుదీర్ఘ పోరాటంలో న్యాయం గెలిచిందని అన్నారు. కోర్టులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# పని చేస్తేనే గుర్తింపు

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** గుర్తింపు కోసం మనం ఎవరి వెంట పడాల్సిన అవసరం లేదని మనం చేసే పనిని సక్రమంగా చేస్తే గుర్తింపు దానికదే వస్తుందని,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ కమలాహసన్ రెడ్డి అన్నారు.సోమవారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో 50 మంది సిబ్బందికి డైరక్టర్ చేతుల మీదుగా క్యాష్ రివార్డులను అందచేశారు. ప్రధానంగా కేసుల డిటెక్షన్, నిందితులను రికవరీ చేసిన సొమ్మును డిస్పోజల్ చేయడం, నిందితులకు కన్విక్షన్ పడే విధంగా చార్జీ షీట్‌ను దాఖలు చేయడం, మంచి కేసులను పట్టుకోవడం,ఇతర రాష్టాల్లో కేసుల్లో ఉన్న నిందితులను పట్టుకోవడం చేసినప్పుడే ప్రతి ఒక్కరికి మంచి పేరు వస్తుందన్నారు.ఎక్సైజ్‌శాఖలో ప్రతిభ కనదరిచిన వారికి చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వంతో పలుమార్లు మాట్లాడి క్యాష్ రివార్డులకు కావాల్సిన నిధులను తీసుకవచ్చామన్నారు. మరింతగా మరింతగా శ్రమించి మంచి కేసులను పట్టుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. సంగారెడ్డిలో వరుసగా నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం, సంగీతా సాహు లాంటి గంజాయి డాన్‌తోపాటు ఒరిస్సా నిందితలను పట్టుకొని అరెస్టు చేయడం బాగుందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి,టీం లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్‌లు పాల్గొన్నారు.

# వేములవాడ అభివృద్ధికి నిధులు తెస్తా

## కరీంనగర్ అభివృద్ధి కోసం పట్టుదలతో పనిచేస్తున్నా

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సన్మానం చేసిన దృశ్యం

**వేములవాడ, ప్రభాతవార్త :** వేములవాడ ఆలయ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, ఈ ఏడాది ఖచ్చితంగా కేంద్రం నుంచి నిధులు తీసుకొని అభివృద్ధి చేస్తానని, ఈ విషయంలో మొండి పట్టుదలతో ఉన్నానని, అంతేగాకుండా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో ప్రతి గ్రామానికి రూ.5లక్షల చొప్పున ఉపాధి హామీలిచ్చామని, సిఎస్ఆర్ ఫండ్స్ కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కొందరు కావాలని తాను నయా పైసా కూడా తేలేదని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాటిని జనం నమ్మే పరిస్థితి లేదని, జిల్లాకు నవోదయ స్కూల్ మంజూరు చేయించిన, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృసి చేస్తున్నాని, ఏ ఉద్యమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేయక పోయిన కాంగ్రెస్‌కు అధికారం లభించడంతో ప్రజలను పట్టించుకోవడం లేదని, గత 17 నెలలుగా కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడంతో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సీనియర్ న్యాయకులు రేగుల మల్లికార్జున్, దళిత మోర్చ నాయకులు, కార్యకర్తలున్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

## 29న రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్ల ముట్టడి

### ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజులు చెల్లిందాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడికి జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన బిసి విద్యార్థుల కోర్ కమిటీ సమావేశానికి నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి స్కాలర్‌షిప్‌లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు.గత నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లమీద వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పెట్టించుకోవడంలేదని,కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలు బిల్లులు మాత్రం చెల్లిస్తున్నారన్నారు.ఒక కాంట్రాక్టుకు ఇచ్చే బిల్లులతో 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించవచ్చన్నారు.ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది. కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదు.తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. గతంలో స్కాలర్ షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పునఃప్రారంభం చేశామని చెప్పారు.ఫీజులు, స్కాలర్‌షిప్ చెల్లించకపోవడంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సటీ పరిధిలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ విద్యార్థులు పరీక్షలకు బహిష్కరించాలని ప్రస్తుతం నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎంత ఆందోళన జరుగుతున్న ప్రభుత్వానికి బుద్ధి రావడంలేదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు లక్ష40 వేల కోట్లు.వస్తున్న ఆదాయ ఎంత..అందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లిందారు? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు ఇప్పటికైన ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు,ఫీజుల బకాయిలు 4వేల కోట్లు తక్షణమే చెల్లిందాలని డిమాండ్ చేశారు. . ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన చదవలేక పోతున్నారు. అలాగే ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారు.ఈ సమావేశంలో నీల వెంకటేష్, అంజి, రాందేవ్ మోదీ, గొరిగే మల్లేశ్, అనంతయ్య, రాజునేత, రాజేందర్, రవికుమార్ యాదవ్ తదితరులు మాట్లాడారు.

# సెర్ప్‌లో సాధారణ బదలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సెర్ప్‌లో 10 గత పది సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు పంచాయితీ రాజ్‌శాఖ వంత్రి సీతక్క ఆదేశాల మేరకు 3974 మంది సాధారణ ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.గత పది సంవత్సరాలుగా బదిలీలు లేక పోవడంతో తమను బదిలీ చేయాలని సెర్ప్ ఉద్యోగులు అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను జారీ చేసింది. అనేక మంది సిబ్బంది సంవత్సరాలుగా ఒకే చోట ఉండిపోడంతో సంబంధిత పనుల్లో వేగం తగ్గింది.దీన్ని దృష్టిలో పెట్టకున్న పనుల్లో స్పీడ్ పెంచడమే కాకుండా నాణ్యవంతమైన సేవలు పొందేందుకు వారిని బదలీ చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి పాలసీ, మహిళా సంఘాలకు స్వయం ఉపాధి నుంచి ఉపాధి కల్పిన, సంపద సృష్టి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెర్ప్‌లో ఒకే సారి పెద్ద సంఖ్యలో బదిలీల చేయడం ద్వారా సెర్ప్‌లో నూతన ఉత్సాం నింపినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ఎసిబికి పట్టుబడిన మణుగూరు సిఐ

## సహకరించిన ఛానల్ రిపోర్టర్‌పై కూడా కేసు నమోదు

### లక్ష నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 21 :** ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడిలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌తో పాటు ఓ ఛానల్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపీ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. ఈ మేరకు సోమవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ



వై.రమేష్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని గుట్టమల్లారం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 49, 33లలో పలువురు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా భూవ్యాపారం నిర్వహించినందున సదరు వ్యక్తులపై ల్యాండ్‌గ్రాబింగ్ కేసు నమోదుచేయవలసిందిగా ఇటీవల మణుగూరు తహశీల్దార్ ఎస్‌హెచ్‌వో మణుగూరుకు ఓ వ్రాతపూర్వక ఫిర్యా దును అందజేశారు. ఈ కేసుకు సంబంధించి వివాదాస్పద ప్రభుత్వ భూమిని అమ్మిన వ్యక్తుల పేర్లు బహిర్గతమవడంతో వారిపై కేసు నమోదు కాకుండా చూసేందుకు జరిగిన తంతులో భాగంగా ఈ అవినీతి నిరోధకచట్టం అధికారులు పక్కా సమాచారంతో మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై దాడులు నిర్వహించారు. మణుగూరు తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదును ఆసరగా చేసుకొని ప్రభుత్వ భూమిని అమ్మి సొమ్ముచేసుకున్న వ్యక్తులపై కేసులు నమోదుచేయకపోగా అందుకు పరిహారంగా లంచం ఇవ్వాలంటూ మణుగూరు సీఐ సతీష్‌కుమార్ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవాల నిర్వహణ కోసం గోపీ అనే వ్యక్తిని సతీష్‌కుమార్ మధ్యవర్తిగా వాడుకున్నారని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా బేతం చర్ల వెంకటేశ్వర్లు, కూరాకుల శ్రీనివాసరావు అనే వ్యక్తులను రూ.4లక్షలు సీఐ డిమాండ్ చేసినట్లుగా తమకు స్పష్టమైన సమాచారం ఉందని తెలిపారు. రూ.3లక్షలు తాను చెల్లించవలసిన బాకీకి బదలాయింపు చేయాలని, రూ.1లక్ష నగదు ఇవ్వాలని సీఐ కోరిన మేరకు మధ్యవర్తి గోపీకి సోమవారం నగదు అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా దాడిచేసి గోపీని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. గోపీ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌ను స్టేషన్‌లో విచారించిన మీదట ఇరువురిపై భారత న్యాయసంహిత చట్టంలోని 318(4), 329(3) సెక్షన్లతో పాటు తెలంగాణ స్టేట్ గేమింగ్‌యాక్ట్ సెక్షన్ 5 వీరిపై వినియోగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ నగదును కలరింగ్ టెస్ట్ చేయగా 2వ నిందితునిగా ఉన్న గోపీ డబ్బు తీసుకున్నట్లుగా రుజువైందన్నారు. వీరిరువురినీ అరెస్ట్‌చేసి ఎస్‌పీఈ అండ్ ఏసీబీ వరంగల్ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

# టూరిజం హబ్‌గా నిర్మల్ జిల్లా

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** తెలంగాణను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. చారిత్రక కోటలు, జల పాతాలు, అభయారణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. బాసర నుంచి కవ్వాల్ వరకు టూరిజం కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.దీని ద్వారా స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణను పర్యాటకానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వతం కృషి చేస్తున్న సంగతి తెలిసిందే.

చార్మిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలతో పాటు కట్టిపడేసే ప్రకృతి అందాలను ఆస్వాధించేలా పర్యటక రంగానికి సరికొత్త సొబగులు అద్దేందుకు అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇందులో భాగంగానే తెలంగాణలో ఆయా ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతూ పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాకు కూడా రాష్ట్ర పర్యాటక పటంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించనున్నారు.చారిత్రక వైభవం ఉట్టిపడే కోటలు, బురుజులు,కనువిందు చేసే సహజ సిద్ధమైన జలపాతాలు, అద్భుతమైన వన్యప్రాణులతో కూడిన అభయారణ్యాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ కృషి చేస్తోందని అధికారులు చెబుతున్నారు. గత కొద్ది రోజులు క్రితం టూరిజం శాఖ కార్పోరేషన్ ఎండి పటేల్ రమేశ్ రెడ్డి స్వయంగా నిర్మల్‌లోని చారిత్రాత్మక బంగల్‌పేట చెరువు నడిబొడ్డున కొలువై ఉన్న బురుజును, శతాబ్దాల చరిత్రను తనలో నింపుకున్న శ్యామ్‌గడ్ కోటను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమంద్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల చారిత్రక ప్రాధాన్యతను, అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఆయన అధికారులతో చర్చించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన పటేల్ రమేశ్ రెడ్డి.. నిర్మల్ జిల్లా ఒక అద్భుతమైన చారిత్రక, సహజ సంపదలకు నిలయమని కొనియాడారు. శిథిలావస్థలో ఉన్న కోటలు, బురుజులకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

ముఖ్యంగా విద్యాక్షేత్రంలో ప్రసిద్ధి గాంచిన బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం నుంచి ప్రకృతి అందాలకు నెలవైన కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ వరకు ఒక ప్రత్యేకమైన టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమవుతున్నాయన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్తు బాధితుడు

# మత్తు కోసం మెడికల్ డ్రగ్స్ వినియోగం

## మైనర్ మృతి.. మరో ఇద్దరు ఆస్పత్రి పాలు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మత్తు రావడం కోసం మెడికల్ షాపులో విక్రయించే మత్తుకు సంబంధించి డ్రగ్స్ (టాబ్లెట్లు)తో పాటు ఇంజక్షన్‌లను అధిక మోతాదులో తీసుకున్న ముగ్గురిలో ఒకరు మృత్యువాత పడగా మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోయిన బాధితుడు మైనర్ కావడం గమనార్హం. ఆస్పత్రి పాలైన ఇద్దరిలో మరో మైనర్ బాలుడు, ఓ యువకుడు ఉన్నాడు. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపు ఓనర్ మత్తును కలిగించే ఔషధాలను వారికి విక్రయించడం వల్లే ఈ అనర్థం జరగడం కలకలం రేపింది. హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సులా_న్‌పూర్ టౌన్‌షిప్‌కు చెందిన మైనర్ బాలుడు, కొత్తపేట్‌కు చెందిన మరో మైనర్ బాలుడు, బాలాపూర్ రాయల్ కాలనీకి చెందిన షాబాజ్ (22)లు స్నేహితులు. మత్తుకు అలవాటు పడిన వీరు మెడికల్‌కు సంబంధించిన కొన్ని రకాల డ్రగ్స్ తీసు కుంటుంటారు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం టాబ్లెట్లతోపాటు ఇం జెక్షన్‌లను కొనుగోలు చేసిన వారు నిర్మానుష్య ప్రదేశం వాటిని తీసుకొని అప స్మారక స్థితిలోకి వెళ్లారు. పరిస్థితి గమనించిన వారు ఆసుపత్రికి ముగ్గురిని తరలించారు. అయితే చికిత్స పొందుతూ మైనర్ బాలుడు ఉస్మానియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మరో మైనర్ బాలుడు, యువకుడు పిసల్‌బండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. మృతి చెందిన బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలాపూర్ షాహిన్‌నగర్ ప్రాంతానికే చెందిన సాహిల్ అనే వ్యక్తి మెడికల్ డ్రగ్స్‌ను వారికి విక్రయించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఈ ఉద ంతంపై బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజీవ్ యువవికాస్ గడువు తేదీ పొడిగించాలి

## ఇబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాజీవ్ యువవికాస్ గడువు తేదీని పొడగించాలని ఇబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. రాజీవ్ యువ వికాస పథకంలో రాష్ట్రంలోని అగ్రవర్ణ పేఊదలకు సహాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. మొదట ఈ పథకంలో ఓసీలకు అవకాశం కల్పించలేదని, అనంతర వారికి కూడా అవకాశం ఇస్తూ నిర్ణయం తీసకోవడం అభినందనీయమన్నారు.అయితే ఇప్పటికే గడువు ముగిసి ఉండటం ఈడబ్ల్యూఎస్‌కు వారికి సర్టిఫికెట్లు తప్పని సరి చేయడంతో వారు ఎమ్మార్వో కార్యాలయంలో సదరు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇంతలోనే గడువు ముగిసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పథకంలో ఈబీసీలకు అవకాశం కల్పిచండంతో జాప్యం జరగడం, ఇంతలోనే గుడువు ముగియడంతో అనేక మంది అగ్రవర్ణ పేదలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయారని, వారి దృష్టిలో ఉంచకుని ఈ పథకం గడవు తేదీని పెంచాలని ఒక ప్రకటనలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కోరారు.

# తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష

## ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా

### మూడు పైసలు తేలే : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**భద్రాచలం, ప్రభాతవార్త :** తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను ఉద్దేశించి కార్యకర్తలను స్వయంగా కలిసి పిలుపునిచ్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం భద్రాచలం చేరుకున్నారు. ఉదయం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం హరిత హోటల్‌లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్‌కు, కార్యకర్తలకు మధ్య వారిధిగా ఉంటానని, కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి నేను తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని, ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని దుయ్యబట్టారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అప్పులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విపరీతమైన అబద్ధాలు చెబుతున్నారని, 2004లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని, 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్ల ప్రజలను ఏడిపించిందని, వందలాది మంది బిడ్డలను పొట్టన పెట్టుకొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదు పేర్కొన్నారు. లక్షా 60 వేల కోట్లుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని, తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని చెబుతున్నారని అన్నారు. తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత పాలకులు చూడడానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని, కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పిందని, లేనిపోని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్ గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దని, సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని గుర్తు చేశారు.

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు బీఆర్ఎస్ పార్టీ బీఫామ్‌పై నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని, భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదేనని జోష్యం చెప్పారు. ఇలాంటి ద్రోహులను చాలా చూశామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తాత మధు, రేగా కాంతరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, వైరా మాజీ ఎమ్మెల్యే చందనవతి, భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, బోదబోయిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోట్లతో కొన్నా రిజల్ట్ సున్నా


రిషబ్ పంత్


గ్లెన్ మాక్స్‌వెల్


వెంకటేష్ అయ్యర్


మార్కస్ స్టొయినిస్

**ఖరీదైన ఆటగాళ్లు ఫెయిల్యూర్**

**లిస్ట్‌లో రిషబ్, మాక్స్‌వెల్, వెంకటేష్, స్టొయినిస్**

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజను 18 రసతవత్తరంగా సాగుతోంది. రోజురోజుకూ అభిమానుల్లో ఉత్సాహం పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్లో చాలా మంది ఆటగాళ్లు తమ ప్రదర్శనతో అభిమానుల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. కానీ మంచి ప్రదర్శన ఇస్తారని భావించిన కొంత మంది ఆటగాళ్లు మాత్రం నిరాశ పరుస్తున్నారు. వీళ్లను భారీ మొత్తంలో డబ్బులు వెచ్చించికొన్నా వీరి ప్రదర్శన ఇప్పటివరకు పేలవంగా ఉంది. ఫ్రాంచైజీలు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన ఇలాంటి ఆటగాళ్ల గురించి తెలుసుకుంటే ఈ సీజన్ రిషబ్ పంత్ చాలా దారుణంగా ఆడుతున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేశారు. ఐపిఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు. కానీ 7 మ్యాచ్‌ల్లో కేవలం 17.17 సగటు, 100 స్ట్రైక్ రేట్‌తో 103 పరుగులు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై 63 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అయినా ఆ మ్యాచ్‌ల్లో జట్టు ఓడిపోయింది. ఆ తర్వాత దారణమైన ప్రదర్శన సాగించాడు. పంత్ కెప్టెన్సీ కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇక గ్లెన్ మాక్స్‌వెల్ ఐపిఎల్లో స్టార్‌గానిలిచేవాడు. అందుకే జట్లుఅతన్ని తమతోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాయి. పంజాబ్ కింగ్స్ జట్టు మాక్స్‌వెల్ రూ.4.2 కోట్లకు నిలుపు కుంది. కానీ ఇప్పటివరకుఆడిన 6మ్యాచ్‌ల్లో మాక్స్‌వెల్ కేవలం 41రన్స్ మాత్రమే సాధించాడు. లాంగ్ ఫోర్లు, సిక్సర్లు కొట్టడంలో ప్రసిద్ధిచెందిన మాక్స్‌వెల్ ఈ సీజన్లో కేవలం 4 ఫోర్లు, ఒక సిక్సర్ మాత్రమే కొట్టాడు. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్ వెంకటేష్ అయ్యర్‌ను రూ.23.75కోట్ల భారీ మొత్తానికికొంది. కానీ అయ్యర్‌మాత్రం ఇప్పటి వరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 24.5 సగటు, 155. 05 స్ట్రైక్ రేట్‌తో 121పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 29 బంతుల్లో 60పరుగులుచేసి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. తర్వాత చతికలపడ్డాడు. మార్కస్ స్టొయినిస్‌ను పంజాబ్‌కింగ్స్ రూ.11కోట్లకు కొను గోలు చేసింది. ఈసీజన్ 6మ్యాచ్‌లు ఆడిన స్టొయి నిస్ 66పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆడిన ఇన్నింగ్స్‌లో 11 బంతుల్లోనే 34 పరుగులు చేశాడు. ఇదే అత్యధిక స్కోరు. మరోవైపు బౌలింగ్‌లోసైతంఫలితం శూన్యం. ఇప్పటి వరకు ఆడిన 6మ్యాచ్‌ల్లో ఒక్కవికెట్‌కూడా పడగొట్టలేదు.


కోనేరు హంపి


ద్రోణవల్లి హారిక


దివ్య దేశ్‌ముఖ్

## మహిళల గ్రాండ్‌ప్రిలో..
# హంపి మూడో విజయం
## హారిక-దివ్య మధ్య డ్రా

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మూడో విజయం నమోదు చేసింది. మంగోలియాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ బత్ఖుయాగ్ మున్‌గున్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలుపొందింది. దీంతో హంపికిది మూడో విజయం కావడం విశేషం. మరో మూడు గేమ్‌లను డ్రా చేసుకున్న హంపి 4.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఇక భారత్‌కే చెందిన మరో స్టార్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, ప్రపంచ జూనియర్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య జరిగిన ఆరో రౌండ్ గేమ్ డ్రాగా ముగిసింది. 27 ఎత్తులయ్యాక గేమ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ వైశాలి రెండో పరాజయాన్ని చవి చూసింది. చైనాకు చెందిన జు జినెర్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో వైశాలి 41 ఎత్తుల్లో ఓడిపోయింది. కాగా జార్జియాకు చెందిన మేలియా సలోమితో జరిగిన మరో గేమ్‌లో రష్యాకు చెందిన పోలీనా షువలోవా 45 ఎత్తుల్లో గెలిచింది. బల్గేరియాకు చెందిన నుర్గుల్ సలీమోవా, పోలాండ్‌కు చెందిన అలీనా కష్లిన్‌స్కాయా మధ్య జరిగిన మరో గేమ్ 67 ఎత్తుల్లో డ్రా గా ముగిసింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత జినెర్ 5 పాయింట్లతో అగ్రస్థానంలోను, 4 పాయింట్లతో దివ్య దేశ్‌ముఖ్ మూడో స్థానంలో, హారిక 3 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

## బిసిసిఐ కాంట్రాక్టు జాబితాలో..
# టాప్ గ్రేడ్‌లో రోహిత్, విరాట్




**న్యూఢిల్లీ:** టీమిండియా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టు జాబితాను విడుదలైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు టాప్ కేటగిరీని రిటేన్ చేసుకున్నారు. 34 మందితో కూడిన కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాను సోమ వారం బిసిసిఐ విడుదల చేసింది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషణ్ కూడా కాంట్రాక్టు జాబితాలో చోటు దక్కింది. ఎ+ గ్రేడ్ క్యాటగిరీలో మొత్తం నలుగురు క్రికెట్లు ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా ఆ లిస్టులో ఉన్నారు. ఎ+ గ్రేడ్ ఆటగాళ్లకు రిటేన్ ఫీజు 7 కోట్లు చెల్లించనున్నారు. ఇక ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో హీరోగా నిలిచిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ కాంట్రాక్టు జాబితాలో చోటు సంపాదించాడు. అయితే అతనికి గ్రూపు బీలో స్థానం కల్పించారు. ఆ గ్రూపు ఆటగాళ్లకు మూడు కోట్ల రూపాయలు చెల్లించనున్నారు. గత ఏడాది అయ్యర్‌ను కాంట్రాక్టు లిస్టును తొలగించారు. ఐపిఎల్ కోసం స్వదేశీ క్రికెట్‌ను ఆడకపోవడం వల్ల గత ఏడాది అయ్యర్‌ను ఆ జాబితా నుంచి తప్పించారు. ముంబై బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా గత ఏడాది ఇదే సమస్యను ఎదుర్కొన్నాడు. అయితే ఈ సారి అతనికి గ్రూపు సి కేటగిరీలో చోటు కల్పించారు. గ్రూపు సి క్యాటగిరీలో ఆటగాళ్లు కాంట్రాక్టు కింద కోటి ఇవ్వనున్నారు. గత ఏడాది గ్రూపు ఏ లో ఉన్న రిషబ్ పంత్ ఈసారి గ్రూపు ఏ కేటగిరీలో చోటు దక్కించుకున్నాడు. రిటైర్ అయిన అశ్విన్ స్థానంలో పంత్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్.. తొలి ఇన్నింగ్స్‌లో
# 273 రన్స్‌కు జింబాబ్వే ఆలౌట్



**న్యూఢిల్లీ:** రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా బాంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో పర్యాటక జింబాబ్వే కీలకమైన 82 పరుగల తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 67/1 వద్ద సోమవారం రెండో రోజు ఆటను ప్రారంభించిన జింబాబ్వే మరో 206 పరుగులు జోడించి 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్ నగరవ (28 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. మిగిలిన బ్యాటర్లలో బెన్ కర్రన్ 18, నిక్ వెల్చ్ 2, కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ 8, వెల్లింగ్టన్ మసకడ్జ 6, ముజరబానీ 17, న్యాయుచి 7 పరుగులకు ఔటయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లుతో చెలరేగగా, నహీద్ రాణా 3 వికెట్లు, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అంతకు ముందు జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బాంగ్లాదేశ్ సొంతగడ్డపై భారీ దెబ్బకొట్టారు. బంగ్లాదేశ్‌కు సొంత గడ్డపై ఇది నాలుగో అత్యల్ప స్కోర్ కావడం విశేషం. బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (56) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (40), జాకీర్ అలీ (28), మహ్మదుల్ హసన్‌రాయ్ (14), షద్మాన్ ఇస్లాం (12), హసన్ మహమూద్ (19) రెండంకెల స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీం 4, మెహిది హసన్ మిరాజ్ 1, తైజుల్ ఇస్లాం 3, నహీద్ రాణా డకౌటయ్యారు. ఖలీద్ అహ్మద్ 4 పరుగులతో అజేయంగా నిలిచాడు.

## వరల్డ్ కప్ షూటింగ్‌లో..
# భారత్‌కు రెండు రజతాలు



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య రెండో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శనను కనపరుస్తున్నారు. పెరూలో భారతీయ కాలమాన ప్రకారం సోమవారం జరిగిన టోర్నీలో భారత్ షూటర్లు రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకూ భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి 6 పతకాలతో మూడో స్థానంలో ఉంది. ఇక పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో అర్జున్ బాబుటా, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్-ఆర్య బోర్సి రజత పతకాలు సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ బాబూటా 252.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో 253.4 పాయింట్లతో చైనా షూటర్ షెంగ్ లీహావో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. హంగేరీకి చెందిన పెనీ మార్టన్ 229.8 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక ఫైనల్‌కు చేరిన మరో భారత్ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ 104.8 పాయింట్లతో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో పాటిల్- ఆర్య ద్వయం 11-17తో నార్వేకు చెందిన జంట జెనెట్ హెగ్-జాన్ హెర్మన్ హెగ్ చేతిలో ఓడిపోయింది.

# వాణిజ్యం

# సెన్సెక్స్, నిఫ్టీలకు ఎఫ్ఐఐల ఊతం



**ముంబై, ఏప్రిల్ 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ మన మార్కెట్లు మాత్రం పరుగులు పెడుతున్నాయి. అమెరికా టారిఫ్‌ల ఆందోళనల ప్రభావం తగ్గుముఖం పట్టడం, సానుకూల త్రైమాసిక ఫలితాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు తిరిగి రావడం సానుకూల సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో సెన్సెక్స్ మళ్లీ 79వేల మార్కు దాటగా, నిఫ్టీ 24వేల ఎగువన ముగిసింది. బ్యాంకింగ్ రంగ షేర్లు రాణిస్తుండటంతో బ్యాంక్ నిఫ్టీ 55 వేల మార్కు దాటింది. 55,304 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్ ఉదయం 78,903.09 పాయింట్లతో లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడే 79,635.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరకు 855 పాయింట్ల లాభంతో 79,408.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 273.90 పాయింట్ల లాభంతో 24,125.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.13గా ఉంది. టెక్‌మహీంద్రా, ఇండస్‌ఇండ్‌బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రాఅండ్‌మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు రికార్డు స్థాయిలో 3397 డాలర్ల వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ సానుకూల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ స్టాక్స్ రాణించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరిగాయి. గత వారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.8,472 కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారత్, అమెరికా మధ్య త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు వస్తున్న కథనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపర్చాయి. ఏప్రిల్ 23 నుంచి ఇరు దేశాల మధ్య దీనిపై చర్చలు జరగనున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడుతోంది. నేటి ట్రేడింగ్‌లో రూపాయి 25 పైసలు బలపడి 85.05గా కొనసాగుతోంది. అటు చమురు ధరలు క్షీణించడం కూడా మార్కెట్ ర్యాలీకి ఓ కారణమైంది.

# నకిలీ రూ.500 నోట్లతో జాగ్రత్త: హోంశాఖ హెచ్చరికలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారు చేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డిఆర్ఐ, ఎఫ్ఐయు, సిబిఐ, ఎన్ఐఎ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలా వరకు అసలు నోట్లు లాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని, దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. రిజర్వ్ పదంలో 'ఇ' బదులు 'ఎ' పడినట్లు వెల్లడించింది. ఈచిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

# లక్షకు చేరువలో బంగారం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్ కారణంగా బంగారం ధరకు మళ్లీ రెక్కలు వస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండడంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర పెరుగుతూనే ఉంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ పసిడి ధర పరుగులు పెడుతోంది. బులియన్ మార్కెట్‌లో 10గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.99,600 పైనే పలుకుతోంది. రూ.లక్షకు కాస్త దూరంలో నిలిచింది. అటు వెండి సైతం కిలోరూ.98 వేలుగా ఉంది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కు దాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్ట్స్‌లో 10గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1493 మేర పెరిగి ఇంట్రాడేలో 96,747 రూపాయల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 3,393 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు.


# కొత్తగా 84 లక్షల డీమ్యాట్ అకౌంట్లు




**ముంబై, ఏప్రిల్ 21:** గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ కేపిటల్ మార్కెట్లు జోరు చూపడం పలువురు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఇలో నికరంగా 84 లక్షల డీమ్యాట్ ఖాతాలు కొత్తగా జమయ్యాయి. వెరసి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లకు చేరింది. ఇందుకు ప్రధానంగా మార్కెట్లు జోరందుకోవడానికి తోడు డిజిటల్ బ్రోకరేజీ సంస్థలు దోహదం చేశాయి. కొత్తగా జత కలిసిన ఖాతాలలో గ్రో, ఏంజెల్‌వన్ నుంచే 57శాతం నమోదయ్యాయి. 34 లక్షల డీమ్యాట్ ఖాతాలు గ్రో నుంచి ఓపెన్ కాగా, ఏంజెల్ వన్ నుంచి 14.6 లక్షల ఖాతాలు జమయ్యాయి. అంటే 84 లక్షల కొత్త ఖాతాలలో ఈ రెండు సంస్థల నుంచే 48.6 లక్షల ఖాతాలు జత కలిశాయి. ఈ బాటలో ఇన్వెస్టర్లు మరో బ్రోకింగ్ సంస్థ జిరోధా నుంచి 5.4 లక్షల ఖాతాలు తెరిచినట్లు ఎన్ఎస్ఇ గణాంకాలు వెల్లడించాయి. మొబైల్ ఆధారిత సరళీకృత లావాదేవీల కారణంగా ఇన్వెస్టర్లు డిజిటల్ బ్రోకరేజీలను ఆశ్రయిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల నుంచి ఇన్వెస్టర్లు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా లావాదేవీలకు ఆసక్తి చూపుతున్నట్లు వివరించారు.


# షాంఘై షాపింగ్ మాల్‌లో గోల్డ్ ఎటిఎం

**ముంబై, ఏప్రిల్ 21:** భారతదేశంలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం కూడా ఆవిష్కరణ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సాధారణంగా జ్యుయెలరీ షాపుల్లో, ఇతర రుణ సంస్థలలో బంగారం ఇచ్చి డబ్బులు తీసుకోవడం వంటివి చూసే ఉంటారు. కానీ మీరు ఎప్పుడైనా బంగారు ఎటిఎం గురించి విన్నారా లేదా చూశారా? చైనాలోని అతిపెద్ద నగరమైన షాంఘైలోని ఒక పెద్ద షాపింగ్ మాల్‌లో ఇలాంటిదే కనిపించింది. ఇది షాంఘైలో మొట్టమొదటి బంగారు ఏటీఎం. ఈ ఎటీఎం ప్రజలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఈ ఎటిఎం 1,200 డిగ్రీల సెల్సియస్ వద్ద బంగారాన్ని కరిగించి, బంగారం స్వచ్ఛతను దాని ప్రత్యక్ష ధరతో పాటు చూపిస్తుంది. దీని తరువాత రేటు ప్రకారం తిగిలీ నుండి నగదు బయటకు వస్తుంది. దీని ద్వారా మీరు బ్యాంకు నుండి డబ్బును కూడా బదిలీ చేయవచ్చు. ఈ ఏటీఎంను వినియోగదారులు ఎంతగానో ఇష్టపడుతున్నారు. ఈ ఎటీఎం నుండి బంగారం లావాదేవీ చాలా సులభం. ముందుగా ఈ యంత్రం బంగారాన్ని తూకం వేస్తుంది. ఇది బంగారం 99.99 శాతం స్వచ్ఛమైనదా కాదా? అని తనిఖీ చేస్తుంది. కానీ దీని నుండి ఒక చిన్న సర్వీస్ ఛార్జీ కూడా కట్ అవుతుంది. భారతదేశంలో బంగారాన్ని శ్రేయస్సు, భద్రతకు చిహ్నంగా పరిగణించినట్లే, చైనాలో కూడా దీనిని అలాగే పరిగణిస్తారు. ప్రజలు బంగారాన్ని పెట్టుబడిగా కూడా ఉపయోగిస్తారు. మీడియా నివేదికల ప్రకారం, ఈ ఏటీఎంను షెన్‌జెన్‌కు చెందిన కంపెనీ కింగ్‌హుడ్ గ్రూప్ తయారు చేసింది. ఈ ఎటిఎం చైనాలోని 100కి పైగా నగరాల్లో ఏర్పాటు చేయబడింది. ఇది మాత్రమే కాదు. షాంఘైలో కూడా మరో బంగారు ఎటీఎం ఏర్పాటు చేయబోతున్నారు. ప్రజలు దీన్ని చాలా ఇష్టపడుతున్నారని ఇది స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పుడు కస్టమర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా బంగారాన్ని సులభంగా అమ్మవచ్చు. ఈ బంగారు ఎటీఎం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియోపై జనాలు ఒకరి తర్వాత ఒకరు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై ఒక యూజర్, వావ్, త్వరలో భారతదేశంలో గోల్డ్ ఎటిఎం చూస్తామని ఆశిస్తున్నాను" అని అన్నాడు.



## ఎఐతో నిరుద్యోగ ఉపద్రవం: బిల్‌గేట్స్, ఒబామా

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** ఈ సాంకేతిక యుగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఎఐ ఆధారిత ఆటోమేషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో వేగంగా పనులు పూర్తవుతున్నా, కొన్ని సమస్యలూ లేకపోలేదు. ముఖ్యంగా ఎఐ రాకతో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. తాజాగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో కోట్లాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇది ఏఐ యుగం.. జ్ఞానంపై



సమాజం దృక్కోణాన్ని సమూలంగా మార్చే శకం. ఇప్పటి వరకు గొప్ప గొప్ప డాక్టర్లు, టీచర్ల మేధ అద్భుతం అని కొనియాడాం. కానీ, ఎఐ రాకతో రాబోయే దశాబ్దకాలంలో వీరికి ఉండే జ్ఞానం ఉచితంగా, అందరికీ అందుబాటులోఉంటుంది. ప్రస్తుతం మన జనాభాకు సరిపడావైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. దీంతో ఎఐతో లభించే మెడికల్ సలహాలు, టీచింగ్‌క్లాస్‌లు అందరికీ నచ్చుతాయి. కానీ, ఇది కాస్త భయానకమైన విషయం. ఇదంతా పక్కనబెడితే.. మరి ఉద్యోగాల సంగతేంటీ? కనీసం వారానికి రెండు,మూడురోజులైనా పని చేయగలమా? అని బిల్‌గేట్స్ అన్నారు. అయితే, కొన్ని విషయాల్లో ఎఐ సమస్యలను పరిష్కరిస్తోందని టెక్ దిగ్గజం తెలిపారు. కృత్రిమ మేధతో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, పనులు వేగవంతమవుతున్నాయని పేర్కొన్నారు. ఎఐ మరింత ప్రభావవంతంగా, వేగంగా అందుబాటులోకి వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఆటోమేషన్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షన్. అయితే, కేవలం తయారీరంగాన్ని మాత్రమే ఆటోమేటిక్ చేయట్లేదు. రోబో చేతులను ఉపయోగించినట్లు కాదు. ఉన్నత స్థాయి మేధోపరంగానూ అనేక పనులు చేస్తోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చేసే 70శాతం పనులను ఎఐ చేయగలదు. నిపుణులైన ఉద్యోగులు, మంచి జీతభత్యాల గురించి మాట్లాడు కునేటప్పుడు ఎఐ రాక కాస్త గందరగోళానికి గురిచేస్తుంది. కృత్రిమ మేధ వినియోగం పెరిగితే చాలాఉద్యోగాలు గల్లంతే.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.